www.andhrajyothy.com
గుంటూరు సిటీ
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సోమవారం | 24-11-2025 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 258
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం, తిథి: చవితి రా.9.22 తదుపరి పంచమి, నక్షత్రం: పూర్వాషాఢ రా.9.54 తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం: శేషం ఉ.7.48, దుర్ముహూర్తం: ప.12.24-1.08, ప.2.37-3.21, అమృతఘడియలు: సా.4.36-6.22, రాహుకాలం: ఉ. 7.30-9.00, సూర్యోదయం: 6.28, సూర్యాస్తమయం: 5.34
Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఇంతింతై.. జెడ్డా టవరంతై

సౌదీ అరేబియాలోని జెడ్డా నగరానికి సమీపంలో
ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన భవన నిర్మాణం
ఈ ఆకాశహర్మ్యం ఎత్తు కిలోమీటరుకు పైమాటే!
ప్రస్తుతానికి ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన బుర్జ్‌ఖలీఫా కన్నా 590 అడుగులు ఎక్కువ ఎత్తు
నిర్మాణానికి దాదాపు రూ.11 వేల కోట్ల ఖర్చు
బరువు 9 లక్షల టన్నులు.. మే 2028కి పూర్తి

2





పుట్టపర్తిలో సత్యసాయి శత జయంతి వేడుకల వేదికపై ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, మంత్రి లోకేశ్, తమిళనాడు మంత్రి శేఖర్ బాబు, ట్రస్టు ప్రతినిధులు నాగానందం, రత్నాకర్ తదితరులు

సాయి మార్గాన నడుద్దాం!

సర్వం.. సాయి స్మరణ

సత్యసాయి నామంతో పులకించిన పుట్టపర్తి

- కనులపండువగా శత జయంతి వేడుకలు
- స్వర్ణ రథంపై బాబా చిత్రపటం ఊరేగింపు
- అలరించిన సంగీత, నృత్య, కళా ప్రదర్శనలు
- తరలివచ్చిన లక్షలాది దేశ విదేశీ భక్తులు
- ప్రభుత్వం, సెంట్రల్ ట్రస్టు ఆధ్వర్యంలో దిగ్విజయంగా జరిగిన వేడుకలు
- ఉపరాష్ట్రపతి, చంద్రబాబు, రేవంత్ హాజరు
- ఇంద్రసేనారెడ్డి, పలువురు సీజేలు, మంత్రులూ

పుట్టపర్తి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'సత్యమే యథార్థం. అదే నా తత్వం. నాపేరు కూడా సత్యం. నా ప్రచారమే సత్యం. నేనే సత్యం..' అని ప్రకటించుకున్న పుట్టపర్తి సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో రాష్ట్ర ప్రభుత్వం, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సంయుక్తంగా నిర్వహించిన ఈ వేడుకలకు దేశ విదేశాల నుంచి

మిగతా 12వ పేజీలో...

నిస్వార్థ సేవలకు సాయి ప్రతిరూపం

- ఆయన బోధనలతో కోట్ల మంది ప్రభావితం
- ఇతరుల కోసం జీవించడమే నిజమైన ఆధ్యాత్మికత
- బాబా వారసత్వాన్ని మాటల్లో కాకుండా సేవల్లో చూపాలి
- శత జయంతి వేడుకల్లో ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ పిలుపు

12

లక్ష్యం కోసం అవతరించిన మహోన్నతుడు

- మానవ రూపంలో మనం చూసిన దైవం సాయి: సీఎం
- విశ్వ శాంతిని, సకల జనుల సంక్షేమాన్ని కోరుకున్నారు
- జ్ఞానబోధతో భక్తులకు సన్మార్గం చూపారు
- 75 ఏళ్ల ప్రశాంతి నిలయం ఓ ఎనర్జీ సెంటర్
- సెంట్రల్ ట్రస్టు ద్వారా దేశ విదేశాల్లో సేవలు: చంద్రబాబు

వక్తల ఉద్ఘాటన

సత్యసాయిబాబా శతజయంత్యుత్సవాలు ఆదివారం పుట్టపర్తిలో ఘనంగా జరిగాయి. ఆయన చూపిన మార్గంలో పయనిద్దామని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, పలువురు ప్రముఖులు పిలుపిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ఉమ్మడిగా నిర్వహించిన ఈ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, మేఘాలయ, ఉత్తరాఖండ్ హైకోర్టుల చీఫ్ జస్టిస్‌లు, రాష్ట్ర మంత్రులు లోకేశ్, సవిత తదితరులు పాల్గొన్నారు. దేశ విదేశాల నుంచి వచ్చిన భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. మంగళవాయిద్యాలు, భజనలు, సాయినామ జపంతో పుట్టపర్తి మార్మోగింది.

షెడ్యూల్ ప్రకారమే స్థానికం!

వచ్చే సెప్టెంబరు-అక్టోబరులో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు
పంచాయతీలకు మాత్రం టెన్త్ పరీక్షల తర్వాత



- ఈ ప్రక్రియలో బీసీ రిజర్వేషన్లే కీలకం
- 34 శాతానికి పెంచుతామని కూటమి హామీ
- అయితే 50% మించరాదని తేల్చిచెప్పిన సుప్రీం
- 'ట్రిపుల్ టెస్ట్' పాటించాల్సిందేనని స్పష్టీకరణ
- రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల ఖరారుకు వచ్చే నెలలో డెడికేటెడ్ కమిషన్‌ను నియమించే చాన్సు
- అధ్యయనానికి 3 నెలలు పట్టే అవకాశం
- మార్చిలో ముగియనున్న ఎస్ఈసీ నీలం పదవీకాలం
- కొత్త కమిషనర్ వచ్చాకే ఎన్నికలపై కసరత్తు?

అమరావతి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు సకాలంలోనే అంటే వచ్చే ఏడాది సెప్టెంబరు-అక్టోబరులో జరిగే అవకాశాలున్నాయి. అయితే వచ్చే మార్చిలో జరగాల్సిన పంచాయతీ ఎన్నికలు మాత్రం షెడ్యూల్ ప్రకారం జరిగే పరిస్థితులు కనిపించడం లేదు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనుండడమే ఇందుకు కారణం. ఏ స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగాలన్నా బీసీ కులాల జనాభా నిర్ధారణ జరగాలి. ఇందుకు డెడికేషన్ కమిషన్‌ను నియమించాల్సి ఉంది. ఈ కమిషన్ రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలోనూ బీసీల కులగణన చేపట్టి.. ఏ జిల్లా, మండలం, గ్రామంలో ఎంత శాతం కోటా బీసీలకు కేటాయించాలో ప్రభుత్వానికి నివేదించాల్సి ఉంటుంది. ఆ నివేదిక ప్రకారమే బీసీ రిజర్వేషన్‌ను సర్కారు ఖరారుచేయాల్సి ఉంటుంది. రాష్ట్రంలో వచ్చే నెలలో ఈ కమిషన్‌కు చైర్మన్, సభ్యులను ప్రభుత్వం నియమించే వీలుంది. బీసీల రిజర్వేషన్లను 34 శాతానికి పెంచుతామని టీడీపీ గత ఎన్నికల్లో హామీ ఇచ్చింది. దీని అమలుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉన్నా..

మిగతా 11వ పేజీలో...



చండీగఢ్‌ను వదులుకోం

- భగ్గుమన్న పంజాబ్ పార్టీలు
- కేంద్ర ప్రభుత్వ బిల్లుతో దుమారం
- చండీగఢ్‌పై మాకు హక్కుంది: సీఎం మాన్
- ఆ బిల్లు పంజాబ్‌పై దాడే: కేజ్రీవాల్
- అది పంజాబ్ వ్యతిరేక బిల్లు: బాదల్
- తుది నిర్ణయం తీసుకోలేదు: కేంద్రం

2

బ్యాంకులొస్తున్నాయ్ అమరావతికి

- 28న ఒకేసారి 25 ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులకు శంకుస్థాపన
- నేలపాడులో ఆర్బీఐ భవన నిర్మాణానికీ శ్రీకారం
- కేంద్ర మంత్రి నిర్మల చేతుల మీదుగా భూమిపూజ

11

టెట్ రాసేద్దాం!

- 32 వేల మంది ఇన్‌సర్వీస్ టీచర్ల దరఖాస్తు
- సుప్రీంకోర్టులో ఉపశమనంపై సందేహం
- మొత్తంగా దరఖాస్తులు 2.58 లక్షలు
- అత్యధికంగా మహిళలే

11

కూరగాయాలు

- మొంథా తుఫానుకు దెబ్బతిన్న తోటలు
- సామాన్యులపై పడుతున్న భారం
- బహిరంగ మార్కెట్లో ఏ రకం అయినా కిలో రూ.70పైనే
- కిలో చిక్కుడు కాయలు 120
- క్యారెట్, బీట్‌రూట్, క్యాప్సికం, బీన్స్ 80-100
- రైతుబజార్లలోనూ వ్యత్యాసం తక్కువే

ఉత్పత్తి తగ్గి.. ధరలు పైపైకి

మొంథా తుఫానుతో ఇటీవల పెద్దఎత్తున పంటలు దెబ్బతిని రైతులు నష్టపోగా.. ఇప్పుడు ఆ ప్రభావం సామాన్యులపైనా చూపుతోంది. తుఫాను గాలులు, భారీ వర్షాలకు కూరగాయ తోటలు దెబ్బతినడంతో దిగుబడులు తగ్గాయి. డిమాండ్-సప్లైలో వ్యత్యాసం కారణంగా ధరలకు రెక్కలొచ్చాయి.



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాను, కృష్ణా, గోదావరి నదులకు వరదల కారణంగా లంక గ్రామాల్లో వేలాది ఎకరాల్లో కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. దీంతో గత 20 రోజులుగా బహిరంగ మార్కెట్లో కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. వ్యాపారులు ఉత్పత్తి లేదంటూ ధరలు అమాంతం పెంచేశారు. తుఫాను తర్వాత రిటైల్ మార్కెట్‌లో ఏ రకం కూరగాయలు అయినా కిలో రూ.70కు తక్కువ పలకడం లేదు. కొన్ని రకాలు సెంచరీ కొట్టాయి. గత నెలలో కిలో టమోటా రూ.20కు పడిపోగా, ప్రస్తుతం రూ.60 పలుకుతోంది. కిలో చిక్కుడు రూ.120కు అమ్ముతున్నారు. పచ్చిమిర్చి రూ.60, బెండ, దొండ, బీర, కాకర, వంకాయ వంటివి కిలో రూ.80 చెబుతున్నారు. క్యారెట్, బీట్‌రూట్, క్యాప్సికం, బీన్స్ రూ.80-100 పలుకుతున్నాయి. దోసకాయ రూ.60 దాకా చెప్తున్నారు. పొట్లకాయ,

మిగతా 11వ పేజీలో...



ప్రభుత్వ వ్యతిరేక తీర్పులు ఇవ్వక్కర్లేదు

- అలా ఇస్తేనే స్వతంత్రంగా వ్యవహరించే జడ్జి అనుకుంటారనే భావన సరికాదు
- కోర్టు ముందున్న పత్రాలు, ఆధారాల మేరకే తీర్పులు ఇవ్వాలి
- న్యాయవ్యవస్థ స్వతంత్రత కోసం కొలీజియం వ్యవస్థ ఉండాల్సిందే
- ఎస్సీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ ఉండాలి: జస్టిస్ బీఆర్ గవాయ్

న్యూఢిల్లీ, నవంబరు 23: ఎవరైనా న్యాయమూర్తి తాను స్వతంత్రుడనని నిరూపించుకునేందుకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పులు ఇవ్వాల్సిన పని లేదని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. అయితే న్యాయమూర్తులు స్వతంత్రంగా వ్యవహరించక తప్పదని, కోర్టు ముందున్న ఆధారాలకు అనుగుణంగా నిర్ణయం

మిగతా 2వ పేజీలో...

53వ సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్

నేడే ప్రమాణ స్వీకారం

2

తొలిసారి అతిథులుగా 6 దేశాల సీజేలు

మీ కష్టం నాకు తెలుసు

నేను రైతు బిడ్డనే.. మీకు అండగా ఉంటా.. అన్నదాతలకు చంద్రబాబు లేఖ

- నేటి నుంచి 'రైతన్నా.. మీ కోసం'
- లాభసాటి సాగుకు పంచసూత్రాలపై అవగాహన
- అన్నదాతల ఇళ్లకు తరలిరానున్న ప్రజాప్రతినిధులు, అధికారులు
- ఆర్థిక సాధానికి మూల స్తంభం వ్యవసాయమే
- పంటల మార్పిడి పాటించాలి
- చిరుధాన్యాల సాగు మరింత పెరగాలి
- ప్రకృతి వ్యవసాయం అవలంబించాలి
- ఫుడ్ ప్రాసెసింగ్‌తో పంటలకు మరింత విలువ
- 13 వేల కోట్లతో 38 పరిశ్రమలకు ఎంవోయూలు
- టెక్నాలజీ తోడైతే రైతుకు తిరుగుండదు: సీఎం



అమరావతి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పంచ సూత్రాలతో లాభసాటి వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నుంచి చేపడుతోంది. వారం రోజులు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు అన్నదాతల ఇళ్లకే రానున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు వారికి రాసిన లేఖను కరపత్రం రూపంలో అందించనున్నారు. కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి, రైతు సంక్షేమానికి అందిస్తున్న.. ఇకపై చేపట్టనున్న చర్యలను ఆయన అందులో ప్రస్తావించారు. కొత్త ఆలోచనలు పంచుకుంటూ, మార్పునకు నాంది పలకడానికి ప్రభుత్వానికి అన్నదాతలందరూ తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో

మిగతా 11వ పేజీలో...



మన తేజస్ ఎంత భద్రం?

24 ఏళ్లు.. 18 వేల ఫ్లైట్ అవర్స్‌లో కేవలం రెండే ప్రమాదాలు

ఎఫ్-16 తొలినాళ్లతో పోలిస్తే తక్కువే

ఫ్లైట్ అవర్స్ పెరిగే కొద్దీ ట్రాక్ రికార్డు మరింత మెరుగయ్యే అవకాశం

సింగిల్ ఇంజిన్‌తో కూడిన నాలుగో తరం యుద్ధవిమానమైన తేజస్-ఎంకే1ను కొనుగోలు చేసేందుకు అర్జెంటీనా, ఈజిప్ట్, నైజీరియా, ఫిలిప్పీన్స్ వంటి దేశాలు ఆసక్తిగా ఉన్నాయి. ఇలాంటి సమయంలో.. దుబాయ్‌లో జరిగిన ఎయిర్ షోలో మన తేజస్-ఎంకే1 నేలకూలడం ఆందోళన

మిగతా 2వ పేజీలో...

టచ్ చేశారో ఖాతా ఖాళీ!

- ఏపీకే ఫైల్స్‌తో సైబర్ నేరగాళ్ల పంజా
- ఎస్‌బీఐ పేరిట లక్షలాది మందికి సందేశాలు
- తెలంగాణలో వేల ఖాతాలను కొల్లగొట్టిన వైనం
- సీఎం, మంత్రులు, జర్నలిస్టుల గ్రూపుల హ్యాక్
- ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలంటూ వాట్సాప్ సందేశం
- లేదంటే ఖాతా బ్లాక్ అవుతుందని హెచ్చరికలు



2

రీల్స్ కోసం లేడీ గ్యాంగ్ దారుణం

యువతిని అపహరించి.. దాడి!

- ఆ దృశ్యాలు నెట్‌లో..
- మధ్యప్రదేశ్‌లో ఘటన
- ఇద్దరు బాలికలు, ఓ యువతి అరెస్టు

2

మావోయిస్టుల అడ్డాలో బలగాలు!

- కర్రెగుట్ట కొండల్లో కొత్త క్యాంపు ఏర్పాటు
- ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దులో ఆపరేషన్లు!
- క్యాంపును సందర్శిస్తున్న సీనియర్ అధికారులు
- బీజాపూర్‌లో ఐదుగురు నక్సల్స్ అరెస్టు
- లొంగిపోయిన నక్సల్స్‌ను కలిసిన ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం విజయ్ శర్మ

2



విమాన టికెట్లపై 80% దాకా వాపస్!

- చివరి 4 గంటల్లో రద్దు చేసుకున్నా కూడా..
- కసరత్తు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం
- టికెట్ చార్జీల్లోనే స్వల్ప మొత్తంలో బీమా?

2

చండీగఢ్‌ను వదులుకోం

- భగ్గుమన్న పంజాబ్ రాజకీయ పార్టీలు
- ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు: కేంద్రం

న్యూఢిల్లీ, చండీగఢ్, నవంబరు 23: పంజాబ్, హరియాణా ఉమ్మడి రాజధాని చండీగఢ్‌లో చట్టాలు చేసే అధికారాన్ని రాష్ట్రపతి పరిధిలోకి తెచ్చేందుకు వీలుగా రాజ్యాంగ అధికరణం 131ను సవరిస్తూ బిల్లు తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. చట్ట సభల్లేని కేంద్ర పాలిత ప్రాంతాలైన అండమాన్ నికోబార్ దీవులు, దాద్రానగర్ హవేలీ తరహాలో చండీగఢ్‌ను కూడా రాజ్యాంగ అధికరణం 240 పరిధిలోకి తీసుకురావాలని యోచించింది. దీనికి సంబంధించి పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో బిల్లు పెట్టాలనుకుంది. బిల్లు ఆమోదం పొందితే పంజాబ్ గవర్నర్ పర్యవేక్షణలో ఉన్న చండీగఢ్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్థాయి అధికారి స్వతంత్ర పాలకుడిగా నియమితులవుతారు. అయితే పంజాబ్‌లోని రాజకీయ పార్టీలన్నీ ఈ ప్రతిపాదనను వ్యతిరేకించాయి. చండీగఢ్‌పై కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనతో రాజకీయ దుమారం రేగింది. పంజాబ్‌లో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్, అకాలీదళ్ నేతలు కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనను తప్పుబట్టారు. చండీగఢ్‌పై పంజాబ్‌కు హక్కు ఉందని, వదులుకోబోమని సీఎం భగవంత్ మాన్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదన పంజాబ్‌పై దాడి అని ఆప్ అధినేత కేజ్రీవాల్ విమర్శించారు. చండీగఢ్‌ను లాక్కుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని పంజాబ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అమరీందర్ సింగ్ రాజా హెచ్చరించారు. పంజాబ్ బీజేపీ నేతలు కేంద్రం వైపు ఉంటారో లేక పంజాబ్ వైపు ఉంటారో తేల్చుకోవాలన్నారు. పంజాబ్ వ్యతిరేక బిల్లుగా అకాలీదళ్ అధినేత సుఖ్‌బీర్ సింగ్ బాదల్ విమర్శించారు. పంజాబ్‌లోని రాజకీయ పార్టీలన్నీ వ్యతిరేకించడంతో కేంద్ర ప్రభుత్వం వెనకడుగు వేసింది. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో చండీగఢ్ బిల్లును పెట్టడంపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని కేంద్ర హోంశాఖ స్పష్టం చేసింది. అన్ని భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపులు జరిపాకే బిల్లును ప్రవేశపెడతామని తెలిపింది.

విమాన టికెట్లను రద్దు చేసుకుంటే 80% రీఫండ్

న్యూఢిల్లీ, నవంబరు 23: విమాన ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం త్వరలోనే శుభావార్త చెప్పనుంది. ప్రయాణాన్ని వాయిదా వేసుకున్న, రద్దు చేసుకున్న సందర్భాల్లో టికెట్ల కోసం చెల్లించిన మొత్తంలో 80% సొమ్మును ప్రయాణికులకు తిరిగి చెల్లించే విధానంపై కసరత్తు చేస్తోంది. విమానం టేకాఫ్ అయ్యే చివరి 4 గంటల సమయంలో టికెట్ రద్దు చేసుకున్నా ఈ సదుపాయాన్ని అందించాలని భావిస్తోంది. ఈ సదుపాయాన్ని వచ్చే రెండు మూడు మాసాల్లోనే అందుబాటులోకి తీసుకువచ్చే అవకాశం ఉందని సంబంధిత అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఉన్న విధానంలో విమానం టేకాఫ్ అయ్యే మూడు గంటలకు ముందు.. టికెట్‌ను రద్దు చేసుకున్న వారికి రూపాయి కూడా తిరిగి చెల్లించడం లేదు. కేవలం వైద్య పరమైన అవసరాల్లో మాత్రమే దీనికి మినహాయింపు ఉంది.

ఇంతింతై.. జెడ్డా టవరంతై..

ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన భవనం అనగానే ఠక్కున గుర్తొచ్చేది.. దుబాయ్‌లోని బుర్జ్ ఖలీఫా! దాని ఎత్తు 828 మీటర్లు! దాంట్లో ఉన్న అంతస్తుల సంఖ్య 163. ఇప్పుడు దానికి పోటీగా.. దీటుగా.. కిలోమీటరు ఎత్తుండే ఆకాశహర్మ్యాన్ని సౌదీ అరేబియా నిర్మిస్తోంది. దాని పేరు.. జెడ్డా టవర్! ఈ టవర్ ప్రతిపాదిత ఎత్తు 1008 మీటర్లు. అంటే బుర్జ్ ఖలీఫా కన్నా 180 మీటర్లు ఎక్కువ! 120 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఈ టవర్‌లో అంతస్తుల సంఖ్య మాత్రం 168. బుర్జ్ ఖలీఫా భవన నిర్మాణానికి రూపకల్పన చేసిన అమెరికన్ ఆర్కిటెక్ట్ అడ్రియన్ స్మిత్.. దీని డిజైన్‌ను కూడా రూపొందించారు. టవర్ నిర్మాణం కోసం దాదాపు 660 అడుగుల లోతుకు గుంతలు తవ్వి వాటిలో కాంక్రీటు నింపి బలమైన పునాదులు నిర్మించారు. వాటిపై 300 అడుగుల వెడల్పు, 15 అడుగుల లోతైన కాంక్రీట్ ప్యాడ్ నిర్మించి.. దానిపై ఈ భవనాన్ని నిర్మిస్తున్నారు. 2013 ఏప్రిల్‌లో మొదలుపెట్టి అదే ఏడాది డిసెంబరు నాటికి పునాదులు, కాంక్రీట్ ప్యాడ్ నిర్మాణాన్ని పూర్తిచేశారు. 2018 జనవరిలో పలు కారణాలతో టవర్ నిర్మాణం నిలిచిపోయింది. మళ్లీ ఈ ఏడాది జనవరిలో పనులు పునఃప్రారంభమై శరవేగంగా సాగుతున్నాయి. 2028 నాటికి ఈ టవర్ నిర్మాణాన్ని పూర్తిచేయనున్నట్టు సమాచారం. దీని నిర్మాణానికి 1.8 కోట్ల ఘనపుటడుగుల కాంక్రీటును, 80 వేల టన్నుల ఉక్కును వినియోగిస్తున్నారు. ఈ భవనం నిర్మాణం ఖర్చు రూ.11 వేల కోట్లని అంచనా!!


బెంగాల్ నుంచి బంగ్లాదేశీయులు వెనక్కు

- 'సర్' ప్రభావంతో తిరిగి వెళ్లిపోతున్న వైనం

హకీంపూర్, న్యూఢిల్లీ, కోల్‌కతా, నవంబరు 23: పశ్చిమ బెంగాల్‌లో ఎన్నో ఏళ్లుగా అక్రమంగా నివసిస్తున్న బంగ్లాదేశీయులు తిరిగి వారి దేశానికి వెళ్లిపోతున్నారు. హకీంపూర్ వద్ద ఉన్న బీఎస్ఎఫ్ సరిహద్దు అవుట్ పోస్టు వద్ద వారు భారీగా బారులు తీరుతున్నారు. తమను 'ఇంటికి' వెళ్లనివ్వాలని బీఎస్ఎఫ్ సిబ్బందిని వేడుకుంటున్నారు. భారత్‌లో ఓటర్ల జాబితాపై నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రభావం కారణంగా నవంబరు నెల ఆరంభం నుంచి ఇలా 'రివర్స్ మైగ్రేషన్' పరిస్థితి నెలకొందని అధికారులు చెబుతున్నారు. వెళ్లిపోతున్న వారిలో చాలా మంది పశ్చిమబెంగాల్‌లో ఉన్నప్పుడు తప్పుడు పత్రాలతో నకిలీ ఆధార్, రేషన్ కార్డులు, ఓటు గుర్తింపు కార్డులు పొందినట్టు అంగీకరిస్తున్నారని పీటీఐ వార్తా సంస్థ తెలిపింది. బీఎస్ఎఫ్ నివేదిక ప్రకారం నవంబరు 4వ తేదీ నుంచి సరైన పత్రాలు లేని వారిని ధ్రువీకరణ అనంతరం రోజుకు 150-200 మంది వరకూ బంగ్లాదేశ్‌కు పంపించేస్తున్నారు. నిర్ధారణ ప్రక్రియకు రెండు నుంచి మూడు రోజుల సమయం పడుతోంది. గత వారం రోజుల్లో అధికారిక ప్రక్రియ పూర్తిచేసుకున్న దాదాపు 1,200 మంది బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లిపోయారని బీఎస్ఎఫ్ అధికారులు వెల్లడించారు.

సర్... ఉద్దేశపూర్వక కుట్ర: రాహుల్ గాంధీ

వివిధ రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'సర్'లో పాల్గొంటున్న కొందరు బూత్ స్థాయి అధికారుల మరణంపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. 'సర్' అనేది సంస్కరణ కాదని, కేంద్ర విధించిన అణచివేత అని ఆ పార్టీ ముఖ్యనేత రాహుల్ గాంధీ అభివర్ణించారు. 'సర్ అనేది ఉద్దేశపూర్వక కుట్ర. ఒత్తిడి కారణంగా బీఎల్‌వోలు మరణిస్తున్నారు' అని రాహుల్ ఎక్స్‌లో మండిపడ్డారు. మరోవైపు, 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమి పార్టీలు గెలిచిన నియోజకవర్గాల్లో 50 వేలకంటే ఎక్కువ ఓట్లను రద్దు చేయడానికే 'సర్'ను అమలుచేస్తున్నారని అఖిలేశ్ విమర్శించారు.


నేత్ర-వంశీ దంపతులతో మంతెన రామరాజు, జెన్నిఫర్ లోపెజ్

మంతెన రామరాజు కుమార్తె వివాహానికి దేశ, విదేశీ సెలబ్రిటీల క్యూ

- రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఘనంగా వేడుకలు
- జూ.ట్రంప్, జెన్నిఫర్, బీబర్, బాలీవుడ్ తారల హాజరు

ఉదయ్‌పూర్/విజయవాడ, నవంబరు 23: డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు అడ్డా అయిన రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఆదివారం మరో 'రిచ్' వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ సంతతికి చెందిన అమెరికా పారిశ్రామికవేత్త, ఇంజెనెస్ ఫార్మాస్యూటికల్స్ అధినేత మంతెన రామలింగరాజు కుమార్తె నేత్ర-వంశీ గాదిరాజు(ఎన్ఆర్ఐ) ఒక్కటయ్యారు. ఈ పెళ్లికి దేశ, విదేశాలకు చెందిన ప్రముఖ సెలబ్రిటీలు హాజరై.. నూతన దంపతులను ఆశీర్వదించారు. అతిథుల్లో అమెరికా అధ్యక్షుడు కుమారుడు జూనియర్ డొనాల్డ్ ట్రంప్, గాయని-నటి జెన్నిఫర్ లోపెజ్, జస్టిన్ బీబర్, రాంచరణ్, హృతిక్ రోషన్ తదితరులు ఉన్నారు. గత మూడు రోజులుగా జరుగుతున్న ఈ వివాహ వేడుకల్లో శుక్ర, శనివారాల్లో జెన్నిఫర్ లోపెజ్, బీబర్, కృతి, మాధురి, షాహిద్‌లు తమ ప్రదర్శనలతో అలరించారు. మంతెన రామరాజు విజయవాడలో జన్మించారు. ఉన్నత విద్య కోసం 1984లో అమెరికాకు వెళ్లారు. తర్వాత అక్కడ పలు కంపెనీలు ప్రారంభించారు.

ప్రభుత్వ వ్యతిరేక తీర్పులు ఇవ్వక్కర్లేదు

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోవాలని చెప్పారు. విద్వేషపూరిత ప్రసంగాలను నియంత్రించేందుకు ప్రత్యేకంగా ఒక చట్టం అవసరమని చెప్పారు. సుప్రీం ప్రధాన న్యాయమూర్తిగా ఆదివారం పదవీ విరమణ చేసిన జస్టిస్ గవాయ్ తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. "ఒక న్యాయమూర్తిగా తమ ఎదుట ఉన్నది ప్రభుత్వమా, ప్రైవేటు వ్యక్తులా అన్నదానిని బట్టి నిర్ణయం తీసుకోకూడదు. కోర్టు ముందున్న పత్రాలు, ఆధారాలను బట్టి నిర్ణయం తీసుకోవాలి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటేనే స్వతంత్రంగా వ్యవహరించే జడ్జి అనే భావన కొందరిలో ఉంది. అది సరికాదు. స్వతంత్రంగా వ్యవహరించే న్యాయమూర్తి అని నిరూపించుకునేందుకు ప్రభుత్వం చేసే ప్రతిదానికి వ్యతిరేకంగా తీర్పులు ఇవ్వాల్సిన అవసరం లేదు" అని గవాయ్ చెప్పారు.

కొలీజియం వ్యవస్థ తప్పనిసరి!


ప్రజల్లో న్యాయవ్యవస్థ పట్ల విశ్వాసం కొనసాగాలంటే.. న్యాయవ్యవస్థ స్వతంత్రంగా వ్యవహరించాల్సిదేనని జస్టిస్ గవాయ్ చెప్పారు. జడ్జీల నియామకాలకు సంబంధించిన కొలీజియం వ్యవస్థపై కొన్ని విమర్శలు ఉన్నా.. న్యాయవ్యవస్థ స్వతంత్రతను నిలుపుకొనేందుకు అది తప్పనిసరని పేర్కొన్నారు. అదే సమయంలో నిఘా, దర్యాప్తు సంస్థలు, కేంద్ర న్యాయశాఖ నుంచి వచ్చే నివేదికలు, సూచనలను కొలీజియం కచ్చితంగా పరిగణనలోకి తీసుకుంటుందని తెలిపారు. కొందరు మహిళా న్యాయమూర్తులను సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమించే ప్రతిపాదనను పరిశీలించామని.. కానీ కొలీజియంలో ఏకాభిప్రాయం రాకపోవడంతో నియమించలేకపోయామని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు.

గవర్నర్లకు గడువు విధించలేం.

గవర్నర్లకు గడువు విధించలేమన్న తాజా తీర్పుపై విమర్శలను ప్రస్తావించగా.. "రాజ్యాంగంలో లేని దానిని మేం చెప్పలేం. రాజ్యాంగం వ్యవస్థల మధ్య అధికారాలను విభజించింది. అందువల్ల గవర్నర్లకు గడువును నిర్దేశించలేమని చెప్పాం. అదే సమయంలో అవసరమైన మేర న్యాయ సమీక్షకు అంగీకరించాం. గవర్నర్లు సుదీర్ఘకాలం బిల్లులను పెండింగ్‌లో పెట్టడం సరికాదని, అలాంటి సమయంలో న్యాయ సమీక్ష ఉంటుందని స్పష్టం చేశాం" అని చెప్పారు. ప్రొటోకాల్ ప్రకారం గవర్నర్ కంటే సుప్రీం చీఫ్ జస్టిస్ ఎప్పుడూ పైస్థాయిలో ఉంటారని పేర్కొన్నారు. ఇక పాలన వ్యవస్థ నుంచి తాను ఎలాంటి ఒత్తిడిని ఎదుర్కోలేదని తెలిపారు.

రిజర్వేషన్లలో క్రీమీలేయర్ ఉండాలి..


తన తండ్రి పెంపకం, రాజ్యాంగ సూత్రాలు, సామాజిక, ఆర్థిక న్యాయం తదితర అంశాలు తనను ప్రభావితం చేశాయని.. రాజ్యాంగ సూత్రాలకు, ప్రాథమిక హక్కులకు మధ్య సమతౌల్యం ఉండాలనేది తన నమ్మకమని గవాయ్ చెప్పారు. రిజర్వేషన్లలో క్రీమీలేయర్ ఉండాలన్నది తన అభిమతమని, దానిపై చట్టం చేసే బాధ్యత ప్రభుత్వానిదని పేర్కొన్నారు. రిజర్వేషన్ల విషయంలో ఒక పెద్ద అధికారి కుమారుడు, మరో వ్యవసాయ కూలీ కుమారుడు ఇద్దరినీ ఒకేలా చూడటం సరికాదన్నారు. రిజర్వేషన్లతో కొన్ని ఎస్సీ కుటుంబాలు తరతరాలుగా ప్రయోజనం పొందుతూనే ఉన్నాయని చెప్పారు.



53వ సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ నేడే ప్రమాణ స్వీకారం



న్యూఢిల్లీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జస్టిస్ సూర్యకాంత్ భారత దేశ 53వ ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా ప్రమాణం చేయనున్నారు. జస్టిస్ సూర్యకాంత్‌తో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం ప్రమాణం చేయించనున్నారు. రాష్ట్రపతి భవన్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగనుంది. ఆరు దేశాల ప్రధాన న్యాయమూర్తులు సీజేఐ ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరు కానున్నారు. భూటాన్, కెన్యా, మలేసియా, మారిషస్, నేపాల్, శ్రీలంక దేశాల చీఫ్ జస్టిస్‌లు వారి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొననున్నారు. భారత ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి విదేశీ అతిథులు రావడం ఇదే తొలిసారి. జస్టిస్ సూర్యకాంత్ సుమారు 15 నెలల పాటు సీజేఐ పదవిలో ఉంటారు. 2027 ఫిబ్రవరి 9న ఆయన పదవీ విరమణ చేస్తారు. జస్టిస్ సూర్యకాంత్ సీజేఐగా బాధ్యతలు చేపట్టిన తొలి హరియాణా వ్యక్తిగా నిలవనున్నారు. సీజేఐ ప్రమాణ స్వీకారోత్సవానికి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరవనున్నారు. జస్టిస్ సూర్యకాంత్ 1962 ఫిబ్రవరి 10న హరియాణాలోని హిసార్‌లో ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అలాగే, 2024 నవంబరు 12 నుంచి సుప్రీంకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్‌గా పనిచేస్తున్నారు.



రీల్స్ కోసం లేడీ గ్యాంగ్ దారుణం

- యువతిని అపహరించి.. దాడి!
- ఆ దృశ్యాలు నెట్‌లో.. మధ్యప్రదేశ్‌లో ఘటన..
- ఇద్దరు బాలికలు, ఓ యువతి అరెస్టు

భోపాల్, నవంబరు 23: సోషల్ మీడియాలో రీల్స్‌కు లైక్‌లు, కామెంట్ల కోసం యువత ఎంతకైనా తెగిస్తున్నారనేందుకు ఈ దారుణ ఘటనే ఉదాహరణ! ఓ లేడీ గ్యాంగ్.. రీల్స్ మైకంలో తామేం చేస్తున్నామన్న విచక్షణ మరిచి.. యువతులను కిడ్నాప్ చేసి, వారిని విచక్షణారహితంగా కొడుతూ.. ఆ దృశ్యాలను చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్టు చేస్తోంది. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో ఈ దారుణం వెలుగుచూసింది. ఇటీవల ఓ యువతిని కిడ్నాప్ చేసిన గ్యాంగ్.. ఆమెను జుత్తు పట్టుకొని కొడుతున్న, కాలితో తన్నుతున్న దృశ్యాలు నెట్‌లో వైరల్ అయ్యాయి. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఆ లేడీ గ్యాంగ్‌లోని 17 ఏళ్ల ఇద్దరు బాలికలు సహా ఓ యువతిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ గ్యాంగ్ ఇదే తరహాలో మరికొందరు యువతులపై దారుణాలకు పాల్పడినట్లు తెలిసింది.

పుస్తకాల్లో అక్బర్ పేరు నుంచి 'గ్రేట్' తొలగింపు!

న్యూఢిల్లీ, నవంబరు 23: పాఠశాల చరిత్ర పుస్తకాల్లో మొఘల్ చక్రవర్తి అక్బర్, మైసూర్ పాలకుడు టిప్పు సుల్తాన్ పేర్లకు అనుబంధంగా ఉండే గౌరవప్రదమైన 'గ్రేట్ అనే పదాన్ని ఎన్సీఈఆర్టీ తొలగించింది! ఈ నిర్ణయంపై రాజకీయ, సామాజిక నేతల నుంచి మిశ్రమ స్పందనలు వస్తున్నాయి. నాగ్‌పూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆరెస్సెస్ నేత సునీల్ అంబేకర్ మాట్లాడుతూ ఎన్సీఈఆర్టీ మార్పులను స్వాగతించారు. ఎన్సీఈఆర్టీ నిర్ణయాన్ని అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ గట్టిగా సమర్థించారు. ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'టిప్పును సముద్రంలో పడేయండి..' అంటూ వ్యాఖ్యానించారు.

టచ్ చేశారో ఖాతా ఖాళీ..!

తెలంగాణలో ఏపీకే ఫైల్స్‌తో సైబర్ పంజా

ఎస్‌బీఐ పేరిట లక్షలాది మందికి సందేశాలు

హైదరాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు సరికొత్త ఎత్తుగడతో మళ్లీ పంజా విసిరారు. ఆదివారం బ్యాంకులకు సెలవుదినం కావడంతో దీన్ని అవకాశంగా మలచుకున్న సైబర్ నేరగాళ్లు తెలంగాణలోని లక్షలాది మందికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) పేరిట ఏపీకే ఫైల్స్ రూపంలో సందేశాలు పంపి.. 'మీ ఆధార్ నంబర్ ఈ రోజు అర్ధరాత్రి లోపు అప్‌డేట్ చేసుకోవాలి. లేదంటే మీ బ్యాంకు ఖాతా క్లోజ్ అవుతుంది. వెంటనే ఎస్‌బీఐ ఆధార్ అప్‌డేట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి' అని సూచిస్తూ హెచ్చరించారు. మరోవైపు వేలాది వాట్సాప్ గ్రూపుల్లోకి చొరబడి వాటి అడ్మిన్‌లను కంట్రోల్ తీసుకుని డీపీని ఎస్‌బీఐ చిహ్నం కింద మార్చివేశారు. జర్నలిస్టులు, మంత్రులు, ఆఖరికి సీఎంవో వాట్సాప్ గ్రూపుల్లోకి సైతం చొరబడ్డారు. వాళ్లు పంపిన ఏపీకే ఫైలును తెరిచిన వెంటనే ఫోన్లు హ్యాంగ్ అయిపోతుండటం, బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు ఖాళీ అవుతుండటంతో వేలాది మంది సైబర్ క్రైం విభాగానికి ఫిర్యాదులు చేశారు.

హ్యాకింగ్ అయ్యేదిలా...

ఎస్‌బీఐ పేరిట వచ్చిన ఏపీకే ఫైల్‌ను పొరపాటున ఇన్‌స్టాల్ చేస్తే వెంటనే హ్యాకర్లు ఆ ఫోన్‌కు సంబంధించిన ఓటీపీలు, ఎస్ఎంఎస్‌లు, యూపీఐ పిన్‌లు తెలుసుకుంటారు. నిమిషాల వ్యవధిలో బ్యాంకు ఖాతాలు ఖాళీ చేస్తారు. ఆదివారం ఒక మహిళా జర్నలిస్టు ఇలాంటి ఏపీకే ఫైల్‌ను ఓపెన్ చేయడంతో హ్యాకర్లు ఆమె కాంటాక్ట్స్‌లోకి చొరబడి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు వాట్సాప్ సందేశాన్ని పంపించారు. ఆమె తల్లికి సీరియస్‌గా ఉందని, ఆస్పత్రిలో చేర్చామని వెంటనే డబ్బు పంపాలని కోరారు. కొద్దిసేపటికి ఆమె ఖాతాలో జమఅయిన దాదాపు రూ.12 లక్షలను సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టారు. సైబర్ నేరగాళ్ల మోసపూరిత సందేశాల నేపథ్యంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ఫోన్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఎస్‌బీఐ పేరిట వచ్చిన ఏ సందేశాన్నీ ఓపెన్ చేయవద్దని అలర్ట్ సందేశాన్ని విడుదల చేశారు.

మావోయిస్టుల అడ్డాలో భద్రతాదళాల పాగా

- కర్రెగుట్ట కొండల్లో కొత్త క్యాంపు
- ఫార్వర్డ్ ఆపరేషన్లకు బేస్‌గా ఉపయోగపడుతుందని ఆలోచన

బీజాపూర్/సుక్మా, నవంబరు 23: ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్ట కొండల్లో భద్రతాదళాలు కొత్త క్యాంపును ఏర్పాటు చేసుకున్నాయి. దట్టమైన అడవులతో కూడిన ఈ ప్రాంతాన్ని ఒకప్పుడు మావోయిస్టు సీనియర్లకు సురక్షితమైన స్థావరంగా భావించేవారు. అయితే, మావోయిస్టుల నిర్మూలనలో భాగంగా ఈ ఏడాది ఏప్రిల్-మే నెలల్లో కర్రెగుట్ట కొండల చుట్టూ ఉన్న దట్టమైన అడవుల్లో కేంద్ర, రాష్ట్ర భద్రతాదళాలు 21 రోజుల సమగ్ర ఆపరేషన్‌ను నిర్వహించి 31 మంది నక్సల్స్‌ను అంతమొందించాయి. భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలనూ స్వాధీనం చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో బీజాపూర్ జిల్లాలోని ఉసూర్ పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న తాడ్పాలా గ్రామ సమీపంలో ఈ నెల 4న భద్రతాదళాలు 'సురక్షా ఏవం జన్ సువిధ క్యాంపు'ను ఏర్పాటు చేసినట్టు ఒక అధికారి ఆదివారం వెల్లడించారు. సీఆర్‌పీఎఫ్, కోబ్రా దళాలకు చెందిన 196, 205 బెటాలియన్లకు ఈ క్యాంపు ఎఫ్‌వోబీ(ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్)గా ఉపయోగపడనుందన్నారు. ఈ ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాలను అరికట్టడానికి, భద్రతాదళాల ఆపరేషనల్ సామర్థ్యాలను మెరుగుపరచడానికి, అలాగే, గ్రామస్థులకు అత్యవసర సేవలు కల్పించడంలో ఈ క్యాంపు దోహదపడుతుందని చెప్పారు. అడవుల్లో ఆపరేషనల్ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఈ ప్రాంతాన్ని ప్రత్యేక శిక్షణ కేంద్రంగానూ అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. ఇక్కడి నుంచే ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దు వెంబడి సంయుక్త, సమన్వయ ఆపరేషన్లు నిర్వహించనున్నట్టు చెప్పారు. కాగా, బీజాపూర్‌లో ఐదుగురు నక్సల్స్‌ను, ఇద్దరు సానుభూతిపరులను అరెస్టు చేసినట్టు ఓ పోలీసు అధికారి తెలిపారు.

అసెంబ్లీ సమావేశాలకు లొంగిపోయిన నక్సల్స్!

ఛత్తీస్‌గఢ్ ఉపముఖ్యమంత్రి విజయ్ శర్మ శనివారం సుక్మా జిల్లా కేంద్రంలోని లొంగిపోయిన నక్సల్స్ పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. అందులో 94మంది లొంగిపోయిన నక్సల్స్ ఆశ్రయం పొందుతున్నారు. వారిలో 54 మంది పురుషులు, 40మంది మహిళలు ఉన్నారు. అక్కడ వారికి అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలు, వసతి సౌకర్యాలను డిప్యూటీ సీఎం అడిగి తెలుసుకున్నారు. అసెంబ్లీ శీతాకాల సమావేశాల సమయంలో వారంతా శాసనసభను సందర్శించి ప్రజాస్వామ్య ప్రక్రియలు ఎలా ఉంటాయో తెలుసుకునేలా ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

ఏఐ దుర్వినియోగాన్ని అడ్డుకోవాలి

గ్లోబల్ కాంపాక్ట్‌ను ఏర్పాటు చేయాలి.. జీ20 సదస్సులో ప్రధాని మోదీ పిలుపు


దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రమఫోసా, బ్రెజిల్ అధ్యక్షుడు లులాతో ప్రధాని మోదీ

జొహాన్నెస్‌బర్గ్, నవంబరు 23: ప్రపంచవ్యాప్తంగా ఏఐ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు గ్లోబల్ కాంపాక్ట్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ అన్నారు. దక్షిణాఫ్రికాలోని జొహాన్నెస్‌బర్గ్‌లో జరుగుతున్న జీ20 సదస్సు మూడో సెషన్‌ను ఉద్దేశించి ఆదివారం ఆయన మాట్లాడారు. 'అందరికీ పారదర్శకమైన, న్యాయమైన భవిష్యత్తు-కీలక ఖనిజాలు-ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్' అంశాలపై ఈ సెషన్‌లో చర్చిస్తున్నారు. దీనిపై మోదీ మాట్లాడుతూ.. ఏఐ వినియోగంలో తగిన మానవ పర్యవేక్షణ, డిజైన్ సేఫ్టీ, పారదర్శకత ఉండాలన్నారు. డీప్‌ఫేక్‌కు, నేరాలు, ఉగ్రవాద కార్యకలాపాలకు ఏఐని వినియోగించకుండా కఠిన పరిమితులు విధించాలని సూచించారు. ఏఐ వ్యవస్థను బాధ్యతాయుతంగా తీర్చిదిద్దాలన్నారు. అన్నింటికంటే ముఖ్యంగా ఏఐ అనేది మానవ సామర్థ్యాన్ని మరింత పెంచేదిగా ఉండాలని, కానీ.. అంతిమ నిర్ణయం తీసుకునే బాధ్యత మాత్రం మనుషుల చేతిలోనే ఉండాలని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఏఐ పట్ల 'నేటి ఉద్యోగాలు'గా ఉన్న అభిప్రాయం.. 'రేపటి సామర్థ్యాలు'గా మారాలన్నారు. ఈ విషయంలో వేగవంతమైన సృజనాత్మకత కోసం చైతన్యవంతమైన ప్రతిభ అవసరమని, తాము ఢిల్లీలో నిర్వహించనున్న జీ20 తదుపరి సదస్సులో ఈ అంశాన్ని చేరుస్తామని చెప్పారు. భారత్‌లో ఏఐ ప్రయోజనాలు దేశంలోని ప్రతి ఒక్కరికీ అందేలా తాము చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందుకోసం ఇండియా-ఏఐ మిషన్‌ను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఏఐ ప్రభావ సదస్సుకు భారత్ ఆతిథ్యమివ్వనున్నట్లు చెప్పారు. ఈ సదస్సుకు జీ20 దేశాలన్నీ హాజరు కావాలని కోరారు.

భద్రతా మండలిలో సంస్కరణలు చేపట్టాలి..

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సంస్కరణలు చేపట్టడం అనివార్యమని మోదీ అన్నారు. మొత్తంగా ప్రపంచ పరిపాలనా వ్యవస్థలోనే సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందంటూ భారత్, బ్రెజిల్, దక్షిణాఫ్రికా దేశాల (ఐబీఎస్ఏ) గ్రూప్ సందేశం ఇవ్వాలన్నారు. ఆదివారం ఐబీఎస్ఏ నేతల సదస్సులో మోదీ మాట్లాడారు. ప్రపంచం చీలికలకు, విభజనకు గురవుతున్నట్లు కనిపిస్తున్న తరుణంలో ఐక్యత, సహకారం, మానవత్వ సందేశాన్ని ఐబీఎస్ఏ ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఐబీఎస్ఏ-ఎన్ఎస్ఏ సమావేశాన్ని సంస్థాగతం చేయడం ద్వారా మూడు దేశాల మధ్య భద్రతా సహకారాన్ని బలోపేతం చేయాలని దక్షిణాఫ్రికా, బ్రెజిల్ అధ్యక్షులు సిరిల్ రమఫోసా, లులా డా సిల్వకు భారత ప్రధాని ప్రతిపాదించారు.

మన తేజస్ ఎంత భద్రం?

(మొదటిపేజీ తరువాయి)

కలిగిస్తోందిగానీ.. ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచిన ఎఫ్-16లు, రఫేల్ యుద్ధవిమానాల వంటివి తొలిదశల్లో ఇంతకన్నా ఎక్కువ సంఖ్యలో నేలకూలినట్టు గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుతానికి భారత వాయుసేన వద్ద రెండు స్క్వాడ్రన్ల తేజస్-ఎంకే1లు ఉన్నాయి. 2001లో మొదటి టెస్ట్ ఫ్లైట్ నిర్వహించినప్పటి నుంచి దాదాపు 18 వేల గంటల ఫ్లీట్ ఫ్లైయింగ్ అవర్స్ నమోదు చేసిన తేజస్ విమానం ప్రమాదానికి గురికావడం ఇది రెండోసారి. మొదటి ప్రమాదం కిందటి సంవత్సరమే జరిగింది. 2024 మార్చిలో రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో ఒక తేజస్-ఎంకే1 కూలిపోయింది. 24 సంవత్సరాల వ్యవధిలో రెండు ప్రమాదాలు అంటే చాలా తక్కువగా అనిపించవచ్చు. కానీ, విమాన ప్రమాదాలను 'ఫ్లైట్ అవర్స్' లెక్కలో కొలుస్తారు. లక్ష గంటల ఫ్లైట్ అవర్స్‌లో సగటున ఎన్ని ప్రమాదాలు జరిగాయి అనే లెక్క ఆధారంగా ఆయా విమానాలు ఎంతవరకూ సురక్షితమో గుర్తిస్తారు. ఉదాహరణకు.. అమెరికాకు చెందిన ఎఫ్-16 యుద్ధవిమానాలనే తీసుకుంటే.. 1975-1993 నడుమ లక్ష ఫ్లైట్ అవర్స్‌లో సగటున 5 'క్లాస్-ఏ' ప్రమాదాలు జరిగాయి ('క్లాస్-ఏ' ప్రమాదాలంటే.. పైలట్ ప్రాణాలు కోల్పోవడం లేదా శాశ్వత వైకల్యానికి గురికావడం లేదా ఆ ప్రమాదం వల్ల 20 లక్షల డాలర్లకు మించి నష్టం వాటిల్లడం). కానీ.. 1975 సంవత్సరం ఒక్కదాన్నే లెక్కలోకి తీసుకుంటే.. ఒక ఎఫ్-16 నేలకూలి పైలట్ చనిపోయారు. ఆ ఏడాది ఎఫ్-16 యుద్ధవిమానాలు 161 గంటల పాటు ఎగిరాయి. ఎగిరిన గంటలు, పోయిన ప్రాణాల ఆధారంగా లెక్కిస్తే ((1/161) × 100,000).. ప్రమాదాల సగటు 621.11. రెండో ఏడాదికి ఆ సగటు 442.48కి తగ్గింది. ఇలా ఎఫ్-16లు ఇప్పటిదాకా ఎగిరిన గంటలన్నింటినీ కలిపి లెక్కిస్తే ఆ ప్రమాదాల సగటు 3.55కు తగ్గిపోయింది. ఇలా మన తేజస్ ఎంకే1 'క్యుములేటివ్ ఆపరేషనల్ ఫ్లైట్ అవర్స్'కు సంబంధించి అధికారిక గణాంకాలు అందుబాటులో లేవు. ఉన్న 'దాదాపు 18 వేల గంటల ఫ్లైట్ అవర్స్' అనే అంచనా లెక్కనే పరిగణనలోకి తీసుకుని దాన్ని లక్ష గంటలకు అన్వయిస్తే.. ((2/18,000) ఐ100,000).. సగటున 11.1 ప్రమాదాలతో సమానం. అమెరికన్ ఎఫ్-16 తొలినాటి ప్రమాదాల లెక్కతో పోలిస్తే ఇది చాలా తక్కువ కిందే లెక్క.. ఇక.. ఫ్రాన్స్‌కు చెందిన దసో కంపెనీ నుంచి మనం కొంటున్న రఫేల్ యుద్ధవిమానాల విషయానికి వస్తే.. లక్ష గంటల ఫ్లైట్ అవర్స్‌లో 1.73 నుంచి 3 క్లాస్-ఏ ప్రమాదాలు జరిగినట్టు.. అందుబాటులో ఉన్న వివరాల ఆధారంగా తెలుస్తోంది. పాకిస్థాన్ వద్ద ఉన్న జేఎఫ్-17 యుద్ధవిమానాల ఫ్లైట్ అవర్స్ 19 నుంచి 25 వేల గంటలని సమాచారం. 2007 నుంచి 2024 నడుమ ఆరు జేఎఫ్-17లు నేలకూలాయి. 19 వేల ఫ్లైట్ అవర్స్‌ను లక్ష ఫ్లైట్ అవర్స్‌కు అన్వయిస్తే.. 26.3 ప్రమాదాలతో సమానం. అయితే, ఎఫ్-16లు, రఫేల్ యుద్ధవిమానాలకు లక్షల గంటల ఫ్లైట్ అవర్స్ ఉన్నాయి కాబట్టి వాటి విషయంలో నిర్దిష్ట డేటా దొరుకుతోంది. కానీ.. తేజస్-ఎంకే1, జేఎఫ్-17ల విషయంలో లక్ష గంటల ఫ్లైట్ అవర్స్ ఇంకా నమోదు కాలేదు. మన తేజస్ ఎంకే1కు సంబంధించి 24 ఏళ్ల వ్యవధిలో జరిగినవి రెండే ప్రమాదాలు.

-సెంట్రల్‌డెస్క్



తగ్గుతున్న నమ్మకం?


తేజస్ యుద్ధవిమానం కూలిపోవడం వల్ల మన వాయుసేనకు హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హాల్)పై ఉన్న విశ్వసనీయత మరింత తగ్గే ముప్పుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. హాల్‌పై భారత వాయుసేనకు నమ్మకం కలగట్లేదని ఫిబ్రవరిలో ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ బహిరంగంగా వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. 2025 ఫిబ్రవరి నాటికే 11 'తేజస్-ఎంకే1ఏ' యుద్ధవిమానాలను సరఫరా చేస్తామన్న హాల్ ఒక్క విమానాన్ని కూడా సిద్ధం చేయలేకపోయిందని గుర్తుచేశారు. విమానాల తయారీలో ఆలస్యానికి కారణం.. జీఈ సంస్థ నుంచి ఎఫ్404 ఇంజిన్లు రాకపోవడమేనని హాల్ సంస్థ చెబుతూ వచ్చింది. అక్టోబరు 17కు రెండు తేజస్-ఎంకే1ఏ విమానాలను సరఫరా చేస్తామని తెలిపింది. జీఈ కంపెనీ నుంచి ఇంజిన్లు వచ్చాయి. 4ఇంజిన్లు సిద్ధంగా ఉన్నాయి. కానీ.. నవంబరు ముగుస్తున్నా విమానాలు మాత్రం వాయుసేనకు అందలేదు. మరోవైపు.. మిగ్ విమానాలను కూడా ఈ ఏడాదే సేవల నుంచి తొలగించడంతో వాయుసేన వద్ద స్క్వాడ్రన్ బలం బాగా తగ్గిపోయింది. ఇలాంటి సమయంలో.. తేజస్-ఎంకే1 విమానం కూలిపోవడం ఆందోళన కలిగిస్తోంది.

బిజినెస్

అదానీకనెక్స్ చేతికి ట్రేడ్ క్యాజిల్ టెక్ పార్క్

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్‌కు చెందిన జాయింట్ వెంచర్ అదానీకనెక్స్..ముంబైకి చెందిన మౌలిక వసతుల అభివృద్ధి కంపెనీ ట్రేడ్ క్యాజిల్ టెక్ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్‌ను (టీసీటీపీపీఎల్) రూ. 231.34 కోట్లకు చేజిక్కించుకున్నట్లు ప్రకటించింది. దేశంలో డేటా సెంటర్ల రంగంలో భారీ విస్తరణకు సిద్ధమవుతున్న అదానీకనెక్స్.. ఈ మేరకు టీసీటీపీపీఎల్ వాటాదారులైన అయిన శ్రీ నమాన్ డెవలపర్స్, జయేస్ షాలతో కొనుగోలు ఒప్పందం (ఎస్‌పీఏ) కుదుర్చుకుంది. ఈ డీల్ ఈ నెల 25 నాటికి పూర్తయ్యే అవకాశముంది. వచ్చే పదేళ్లలో 1 గిగావాట్ జాతీయ డేటా సెంటర్ నెట్‌వర్క్‌ను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్న అదానీకనెక్స్ హైదరాబాద్, చెన్నై, నవీ ముంబై, నోయిడా, పుణేలో డేటా సెంటర్లను నిర్వహిస్తోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



24వ తేదీ			
హైదరాబాద్	650	విజయవాడ	660
వరంగల్	652	గోదావరి	645
చిత్తూరు	673	విశాఖపట్నం	635
		డజను గుడ్లు రూ. 90	

ఫామ్‌గేట్ ధర వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	విజయవాడ	103
వరంగల్	107	గుంటూరు	108
కరీంనగర్	107	ఒంగోలు	108
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	106
కర్నూలు	107	నెల్లూరు	111
విశాఖపట్నం	100	అనంతపురం	111
గోదావరి	103		

ఈ ఏడాది చివరికి బ్రేక్ ఈవెన్

చైనా ప్లాంటు నష్టాలపై అరబిందో ఫార్మా సీఎఫ్‌ఓ

- పెన్సిలిన్-జీకి కనీస దిగుమతి ధర ఉండాలి



న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న అరబిందో ఫార్మా చైనాలో ఏర్పాటు చేసిన ఓరల్ సాలిడ్ డోసేజి (ఓఎస్‌డీ) ప్లాంటు ఇంకా నష్టాల్లోనే నడుస్తోంది. ఈ త్రైమాసికంలో నష్టం 10 లక్షల డాలర్ల (సుమారు రూ.8.9 కోట్లు) వరకు ఉంటుందని కంపెనీ సీఎఫ్ఓ ఎస్ సుబ్రమణియన్ తెలిపారు. అయితే ఈ ఆర్థిక సంవత్సరం చివరికల్లా చైనా ప్లాంటు లాభ-నష్టాలు లేని స్థితికి (బ్రేక్ ఈవెన్) చేరే అవకాశం ఉందన్నారు. కంపెనీ స్థూల లాభాలు పెంచడంలో ముందు ముందు చైనా ప్లాంటు పాత్ర కూడా ఉంటుందన్నారు. విశ్లేషకుల ప్రశ్నలకు సమాధానంగా ఆయన ఈ విషయాలు వెల్లడించారు.

చైనా ప్లాంటు ప్రత్యేకతలు: చైనాలో ఈ ప్లాంటు ఏర్పాటు కోసం అరబిందో ఫార్మా 14.5 కోట్ల డాలర్లు (సుమారు రూ.1,290 కోట్లు) ఖర్చు చేసింది. ఏటా 200 కోట్ల డోసుల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్ గత ఏడాది నవంబరులో ఉత్పత్తి ప్రారంభించింది. ఈ ప్లాంటులో తయారుచేసే 10 ఉత్పత్తులకు యూరోపియన్ యూనియన్, మూడు ఉత్పత్తులకు చైనా ఔషధ నియంత్రణ సంస్థల ఆమోదం ఉంది. దీంతో ముందు ముందు ఈ ప్లాంటు తమ లాభాల వృద్ధికి చెప్పుకోదగ్గ స్థాయిలో సహకరిస్తుందని అరబిందో ఫార్మా భావిస్తోంది.

దేశీయ వ్యాపారం: దేశీయ వ్యాపారం పైనా అరబిందో ఫార్మా సుబ్రమణియన్ మాట్లాడారు. ఏటా 15,000 టన్నుల పెన్సిలిన్-జీ ఉత్పత్తి సామర్థ్యంతో కాకినాడ సెజ్‌లో ఏర్పాటు చేసిన ప్లాంటులో ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో 1,050 టన్నుల పెన్సిలిన్ జీ ఉత్పత్తి చేసినట్టు సుబ్రమణియన్ చెప్పారు. ఇది ప్లాంటు మొత్తం ఉత్పత్తి సామర్థ్యంలో 40 నుంచి 50 శాతం మాత్రమే. ప్రభుత్వం ఈ ఉత్పత్తికి కనీస దిగుమతి ధర (ఎంఐపీ) నిర్ణయిస్తే తప్ప, పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో ఈ ప్లాంటు పనిచేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. దేశంలో పెన్సిలిన్ జీ ఉత్పత్తి చేసే అనేక కంపెనీలు ఇప్పటికే దీనిపై ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

అమెరికా, ఈయూ బేష్: అమెరికా, ఈయూ దేశాలు అరబిందోఫార్మాకు కీలక మార్కెట్లని సుబ్రమణియన్ చెప్పారు. ఈయూ దేశాలు వ్యూహాత్మకంగా మరింత కీలకమన్నారు. అక్కడ తమ ఆదాయ వృద్ధి అద్భుతంగా ఉందన్నారు. అమెరికాలోని డేటన్‌లో ఏర్పాటు చేసిన ప్లాంటులోనూ వాణిజ్య స్థాయి ఉత్పత్తి ప్రారంభమైందన్నారు. వచ్చే జనవరి నుంచి ఈ ప్లాంటు ఉత్పత్తులు మార్కెట్‌లో విడుదలవుతాయన్నారు. దీంతో 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి ఈ ప్లాంటు కంపెనీ ఆదాయ వృద్ధికి గణనీయంగా తోడ్పడుతుందని ఆశిస్తున్నట్టు చెప్పారు. వచ్చే రెండేళ్లలో పెన్సిలిన్ జీ ఉత్పత్తి సామర్థ్య విస్తరణ, బయోసిమిలర్స్, బయోలాజిక్ సీఎంఓ కార్యకలాపాలు కంపెనీ ఆదాయాలు, లాభాల వృద్ధికి పెద్ద ఊతం కానున్నాయన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం 20–21 శాతం మార్జిన్ల లక్ష్యాన్ని అందుకోగలమని సుబ్రమణియన్ విశ్వాసం వ్యక్తం చేశారు.

మళ్లీ తెరపైకి బీమా కంపెనీల విలీన ప్రతిపాదన

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని మూడు బీమా కంపెనీల విలీన ప్రతిపాదన మళ్లీ తెరపైకి వచ్చింది. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ప్రభుత్వం ఇందుకు సంబంధించిన బిల్లును సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఆర్థిక పరిసితి మెరుగైనందున ఓరియంటల్ ఇన్సూరెన్స్, నేషనల్ ఇన్సూరెన్స్, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీలను విలీనం చేసి ఒకే కంపెనీగా చేయాలని ప్రభు త్వం యోచిస్తున్నట్టు సమాచారం. నిజానికి 2018-19 ఆర్థి క సంవత్సరంలోనే అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఈ ప్రతిపాదన తెచ్చారు. ఈ లోగా తీవ్ర ఆర్థిక కష్టాల్లో ఉన్న ఈ కంపెనీలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభు త్వం 2019-22 మధ్య కాలంలో రూ.17,450 కోట్ల నిధులు కూడా సమకూర్చింది. ప్రైవేటు పరం చేస్తే ఉద్యోగ సంఘా ల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చే అవకాశం ఉన్నందున, ఈ మూడు ప్రభుత్వ రంగ బీమా కంపెనీలను ఒకటిగా విలీనం చేయడమే మంచిదని ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలుస్తోంది.

26,375 పైన బుల్లిష్

(నవంబరు 24-28 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

గత వారం నిఫ్టీ : 26068 (+158)

నిఫ్టీ గత వారం 26246-25864 పాయింట్ల మధ్యన కదలాడి 158 పాయింట్ల లాభంతో 26068 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 26375 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

● 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25844, 25452, 25192, 25415 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి : 26350 **బ్రేక్‌డౌన్ స్థాయి :** 25700

నిరోధ స్థాయిలు : 26275, 26375, 26475 (26175 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు : 25875, 25775, 25675 (25975 దిగువన బేరిష్)

రియల్టీలో లిస్టెడ్ కంపెనీల అమ్మకాల జోరు

ఆరు నెలల్లో రూ.92,437 కోట్లు

న్యూఢిల్లీ: వర్తమాన ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలలు దేశంలోని 28 లిస్టెడ్ రియల్టీ కంపెనీలకు బాగానే కలిసొచ్చింది. ఈ కాలంలో ఈ కంపెనీలు రూ.92,437 కోట్ల విలువైన ఇళ్ల అమ్మకాలు నమోదు చేశాయి. ఇందులో టాప్-5 కంపెనీల వాటానే రూ.63,000 కోట్లకు (70%) పైగా ఉంది. కొవిడ్ తర్వాత అన్ని వసతులు ఉన్న నివాస గృహాలకు గిరాకీ పెరగడం, చిన్న చిన్న బిల్డర్ల వద్ద కొని ఇబ్బందులు పడేందుకు కొనుగోలుదారులు ఇష్టపడకపోవడం ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. రెరా వచ్చినా చిన్న చిన్న బిల్డర్లపై నమ్మకం లేకపోవడం సైతం ఇందుకు దోహదం చేసింది.

టాప్-5 లిస్టెడ్ సెల్లర్స్

కంపెనీ పేరు	అమ్మకాలు(రూ.కోట్లలో)
ప్రెస్టీజ్ గ్రూప్	రూ.18,147.7
డీఎల్ఎఫ్	రూ.15,757
గోద్రెజ్ ప్రాపర్టీస్	రూ.15,587
లోధా డెవలపర్స్	రూ.9,020
సిగ్నేచర్ గ్లోబల్	రూ.4,650

జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో పరీక్ష



వి. సుందర్ రాజా

గత వారం నిఫ్టీ కీలక స్థాయి 26,000 వరకు వెళ్లి రియాక్షన్‌లో పడినప్పటికీ గురువారం తిరిగి కోలుకుని జీవితకాల గరిష్ఠ స్థాయి 26,300 వరకు వెళ్లింది. శుక్రవారం నాటి రియాక్షన్‌లో కూడా 26,000 కన్నా పైనే నిలదొక్కుకుని 26,070 వద్ద ముగిసింది. గరిష్ఠ స్థాయిల్లో ప్రతిఘటన ఎదురవుతోందనేందుకు ఇది సంకేతం. టెక్నికల్‌గా మార్కెట్ అప్‌ట్రెండ్‌లోనే ఉంది. గత వారం 26,000 వద్ద బ్రేకౌట్ సాధించినందు వల్ల ఈ వారంలో పుల్‌బ్యాక్ రియాక్షన్ ఏర్పడవచ్చు. సుమారు ఏడాది తర్వాత మార్కెట్ మరోసారి జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో పరీక్షకు సమాయత్తం అవుతోంది. అప్రమత్తంగా ఉండాలి.

బుల్లిష్ స్థాయిలు: మరింత అప్‌ట్రెండ్ కోసం మార్కెట్ ప్రధాన నిరోధం 26,300 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఆ పైన మరిన్ని ఉన్నత శిఖరాల దిశగా ప్రయాణం సాగిస్తుంది.

బేరిష్ స్థాయిలు: మార్కెట్ ప్రస్తుతం 26,000 కన్నా స్వల్పంగా పైన ఉంది. ఇక్కడ విఫలమైతే స్వల్పకాలిక బలహీనత ఏర్పడవచ్చు. ప్రధాన మద్దతు స్థాయిలు 25700, 25450.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత శుక్రవారం రియాక్షన్‌కు గురికావడం గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్త సంకేతం. పాజిటివ్ ట్రెండ్‌లో ప్రవేశించినట్టయితే నిరోధ స్థాయి 59,300 కన్నా పైన నిలదొక్కుకోవాలి. రియాక్షన్‌లో పడినా ప్రధాన మద్దతు స్థాయి 58,700 వద్ద నిలదొక్కుకోవాలి. విఫలమైతే మరింత బలహీనపడుతుంది. మరో ప్రధాన మద్దతు స్థాయి 58,000.

పాటర్న్: నిఫ్టీ గత శుక్రవారం రివర్స్ డౌన్‌సైడ్ బ్రేకౌట్ సాధించింది. గరిష్ఠ స్థాయిల్లో కన్సాలిడేషన్ లేదా రియాక్షన్ ఏర్పడవచ్చుననేందుకు ఇది సంకేతం. 26,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది. గత వారం 26,300 వద్ద డబుల్ టాప్ పాటర్న్ ఏర్పడడం కూడా ఆ స్థాయిలో నిరోధం ఎదురవుతోందనేందుకు సంకేతం.

టైమ్ : ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	26,200, 26,300
మద్దతు	26,000, 25,900

గ్లోబల్ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు..

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా కదలాడవచ్చు. క్రితం వారం ప్రారంభంలో రాణించిన సూచీలు గ్లోబల్ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో ఆఖరిలో చతికిలపడ్డాయి. రూపాయి పతనం, యెన్, డాలర్ బాండు రాబడుల పెరుగుదల, అనిశ్చితి, యూఎస్ ఫెడ్ నిర్ణయాలు కీలకమవుతాయి. ప్రస్తుతం ఐటీ, ఆటో, ఫార్మా, ఫైనాన్స్ రంగాల షేర్లు జోరు ప్రదర్శిస్తున్నాయి.

స్టాక్ రికమెండేషన్స్

ఎస్‌బీఐ కార్డ్: ప్రస్తుతం ఈ షేర్లు మధ్యకాలిక అప్‌ట్రెండులో ఉన్నాయి. తాజా ఫలితాల తర్వాత 12% వరకు దిద్దుబాటుకు లోనయ్యాయి. కీలకమైన రూ.880 స్థాయిలో మరోసారి మద్దతు లభించింది. గత శుక్రవారం రూ.878 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.990 టార్గెట్ ధరతో రూ.850పై స్థాయిలో పొజిషన్ తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ.830.

ఐటీసీ: గత ఏడాది సెప్టెంబరు నుంచి ఈ షేర్లు దాదాపుగా 20% మేర కుంగాయి. కీలక మద్దతు స్థాయి రూ.400కి చేరడంతో టర్న్ అరౌండ్ సూచనలు కనిపిస్తున్నాయి. గత శుక్రవారం రూ.407 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో ఇన్వెస్టర్లు రూ.455/470 టార్గెట్ ధరతో రూ.400పై స్థాయిలో ప్రవేశించవచ్చు. స్టాప్‌లాస్ : రూ.385.

టెక్ మహీంద్రా: ప్రస్తుతం ఐటీ రంగం టర్న్ అరౌండ్ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. దీంతో టెక్ మహీంద్రా షేర్లపై ఆసక్తి పెరిగింది. 52 వారాల గరిష్టం నుంచి 25% మేర పతనమైన ఈ షేర్లలో ఇప్పుడిప్పుడే మూమెంటమ్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.1461 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో ఇన్వెస్టర్లు రూ.1650 టార్గెట్ ధరతో రూ.1450 పై స్థాయిలో పొజిషన్లు తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ. 1420.

హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్: ఈ షేర్లలో గరిష్ఠ స్థాయుల్లో కన్సాలిడేషన్ కొనసాగుతోంది. మరోసారి ఇవి 10, 20, 50 డీఎంఏల పైన మద్దతు తీసుకున్నాయి. రిలేటివ్ స్ట్రెంత్ సైతం క్రమంగా పెరుగుతోంది. గత శుక్రవారం రూ.764 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.820 టార్గెట్ ధరతో రూ.750 శ్రేణిలో ప్రవేశించాలి. స్టాప్‌లాస్ : రూ.730

ఎస్కార్ట్స్: ఈ షేర్లు మధ్యకాలిక అప్‌ట్రెండ్‌లో కన్సాలిడేషన్ ట్రెండ్‌లో కొనసాగుతున్నాయి. వాల్యూమ్ తక్కువగా నమోదవ్వడాన్ని బట్టి ఇన్వెస్టర్ల ఆసక్తి కనిపిస్తోంది. గత శుక్రవారం రూ.3617 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.3850 టార్గెట్ ధరతో రూ.3600 పై స్థాయిలో పొజిషన్ తీసుకోవాలి. స్టాప్‌లాస్ : రూ. 3565.



- మూర్తి నాయుడు పాదం, మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.



పొగమంచులో శ్రీవారి ఆలయం

తిరుమలలో వర్షం

తిరుమల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆదివారం విడతలవారీగా వర్షం కురిసింది. శనివారం నల్లటి మేఘాలు తిరుమలను కప్పేయగా, ఆదివారం వేకువజాము నుంచే చిరుజల్లులు మొదలయ్యాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు చిరుజల్లులు అప్పుడప్పుడు కురవగా, సాయంత్రం జోరు వర్షం కురిసింది. దట్టమైన పొగమంచు తిరుమలను కప్పేసింది. చలితీవ్రత పెరిగింది.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



శ్రీవారి ఆలయం ఎదుట జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్

తిరుమల, నవంబరు23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్ రాయ్ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అంతకుముందు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. వీరిని రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వదించగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

నేడు ఐ.ఎస్. జగన్నాథపురానికి ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ఏలూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలం ఐ.ఎస్.జగన్నాథపురంలోని నరసింహస్వామి క్షేత్రంలో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమవారం శ్రీకారం చుట్టనున్నారు. ఇటీవల ఆలయానికి ప్రభుత్వం మంజూరు చేసిన 30 ఎకరాల భూమి కేటాయింపు పత్రాలను అధికారులకు అందజేసి, అక్కడే అభివృద్ధి పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారు. అలాగే ఐ.ఎస్.జగన్నాథపురం గ్రామంలో 120 మీటర్ల మేర అభివృద్ధి చేసిన పంచాయతీరాజ్ మ్యాజిక్ డ్రెయిన్‌ను పరిశీలిస్తారు.

సింహాద్రి ఎన్టీపీసీ మొదటి యూనిట్ షట్‌డౌన్

- 500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం

పరవాడ (అనకాపల్లి జిల్లా), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా పరవాడ మండలంసింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)లోని 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మొదటి యూనిట్‌ను అధికారులు శనివారం అర్ధరాత్రి షట్‌డౌన్ చేశారు. వార్షిక నిర్వహణ పనుల నిమిత్తం చేపట్టిన చర్యల్లో భాగంగా ఈ యూనిట్‌లో రెండు నెలల పాటు విద్యుదుత్పత్తికి అంతరాయం ఉంటుందన్నారు. యూనిట్‌లోని అన్ని విభాగాల్లో మరమ్మతులు చేపట్టడం కోసం అదనంగా 200 మంది కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకున్నారు. ప్రస్తుతం ప్లాంట్‌లో రెండు, మూడు, నాలుగు యూనిట్లలో మాత్రమే ఉత్పత్తి జరుగుతున్నదని వెల్లడించారు.

దూసుకొచ్చిన మృత్యువు!

రెండు ప్రమాదాల్లో ఆరుగురు బలి



నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ సమీపంలో జరిగిన ప్రమాదంలో దెబ్బతిన్న ప్రైవేటు బస్సు, లారీ

- నంద్యాలలో ప్రైవేట్ బస్సును ఢీకొన్న లారీ.. ఇద్దరు టెకీలు మృతి
- సిక్కోలులో లారీని ఢీకొన్న కారు
- నలుగురు మధ్యప్రదేశ్‌వాసుల దుర్మరణం
- మొత్తం 15 మందికి గాయాలు.. నలుగురి పరిస్థితి విషమం
- డ్రైవర్ల నిద్రమత్తు, అతివేగమే ప్రమాదాలకు కారణం!




ఆళ్లగడ్డ వద్ద జరిగిన ప్రమాదంలో మృతులు హరిత, బద్రీనాథ్

ఆళ్లగడ్డ, కోటబొమ్మాళి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రహదారులు రక్తమోడాయి. నంద్యాల, శ్రీకాకుళం జిల్లాల్లో ఆగి ఉన్న వాహనాలను వేరే వాహనాలు మృత్యువులా దూసుకొచ్చి ఢీకొనడంతో ఆరుగురు బలయ్యారు. మృతుల్లో నలుగురు మధ్యప్రదేశ్‌వాసులు కాగా, హైదరాబాద్‌కు చెందిన.. స్నేహితులైన ఇద్దరు యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. రెండు ఘటనల్లోనూ డ్రైవర్లు నిద్రమత్తులో, వాహనాలను అతివేగంగా నడపడంతో ప్రమాదాలకు గురైనట్లు పోలీసులు చెబుతున్నారు. వివరాలివీ.. మైత్రి ట్రావెల్స్‌కు చెందిన ప్రైవేటు బస్సు హైదరాబాద్ నుంచి 33 మంది ప్రయాణికులతో శనివారం పుదుచ్చేరికి బయలు దేరింది. ఆదివారం తెల్లవారుజామున నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం పేరాయిపల్లె మెట్ట వద్దకు రాగానే ఇద్దరు ప్రయాణికులు బహిర్భూమికి వెళ్లాలని డ్రైవర్‌ను కోరడంతో ఆయన బస్సును హైవే పక్కన నిలిపారు. ఇంతలో వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ.. బస్సును ఢీకొట్టింది. దీంతో బస్సులో వెనుక సీట్లలో కూర్చున్న పుదుచ్చేరికి చెందిన పి.హరిత(23), జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన గడ్డం బద్రీనాథ్ (25) అక్కడికక్కడే మృతి చెందారు. మరో తొమ్మిదిమంది గాయపడగా ఆళ్లగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో హైదరాబాద్‌కు చెందిన బండ్ల శ్రావ్య, రాయచోటికి చెందిన ఖాదర్‌వలీ, ఆశాబేగం, లారీ డ్రైవర్ సురేశ్ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో నంద్యాల ఆసుపత్రికి తరలించారు.

సీటు మారిన వ్యక్తి సేఫ్.. ఆ స్థానంలో కూర్చొన్న యువతి బలి

గడ్డం బద్రీనాథ్, హరిత స్నేహితులు. వీరు హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. పుదుచ్చేరిలో ఉన్న స్నేహితులను కలిసి.. అక్కడ విహార యాత్రకు వెళ్లాలని హైదరాబాద్ నుంచి మైత్రి ట్రావెల్ బస్సులో బయలుదేరారు. సీటు నంబరు ఎఫ్-6 బద్రీనాథ్‌కు, ఎఫ్-2 హరితకు రిజర్వ్ అయింది. అయితే తనకు రిజర్వ్ అయిన ఎఫ్-2 సీట్‌లో కూర్చోవాలని హరిత ఎఫ్-4 సీటులో కూర్చున్న హైదరాబాద్‌కు చెందిన నరసింహారెడ్డిని కోరింది. దీంతో ఇద్దరూ తమ సీట్లను ఎక్స్ఛేంజ్ చేసుకున్నారు. స్నేహితులిద్దరూ సమీపంలోని సీట్లలో కూర్చున్నారు. ప్రమాదంలో ఇద్దరూ మృతి చెందగా, నరసింహారెడ్డి ప్రాణాలతో బయటపడ్డారు.

దక్షిణాది తీర్థయాత్రలకు వస్తూ..

శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలంలో హైవేపై ఆగి ఉన్న లారీని ఓ తుఫాన్(ట్రావెల్ కారు) వాహనం ఢీకొంది. ఈ ఘటనలో మధ్యప్రదేశ్‌కు చెందిన బోరో సింగ్ పవర్(60), విజయ్‌సింగ్ తోమర్(65), ఉషీర్‌సింగ్(62), సంతోషీబాయి(62) మృతి చెందారు. శకుంతల బాయి, సుమన్‌బాయి, సంతోషి బాయి, సావిత్రిబాయి, సహస్రబాయితో పాటు వాహన డ్రైవర్ సునీల్ సింగ్ పటేల్ తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ సమీప ఖండవ జిల్లా నేతన్య గ్రామానికి చెందినవారు. ఈ నెల 10న ఉత్తర, దక్షిణాది యాత్రల కోసం తుఫాన్ వాహనంలో బయలుదేరారు. నేపాల్, కాశీ, గోరక్‌పూర్, మధుబనీ, గయా పుణ్యక్షేత్రాలను దర్శించుకున్న తర్వాత శనివారం పూరి చేరారు. అక్కడ జగన్నాథుడిని దర్శించుకుని శ్రీశైలం వెళ్లేందుకు పయనమయ్యారు. శనివారం రాత్రి 2.30 గంటల సమయంలో కోటబొమ్మాళిలోని ఎత్తురాళ్లపాడు వద్ద హైవేపై ఆగిఉన్న లారీని వీరి వాహనం ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. వాహన డ్రైవర్ సునీల్ సింగ్ పటేల్ కారు వేగంగా నడుపుతుండగా.. నిద్ర ముంచుకురావడంతో అదుపు తప్పి లారీని ఢీకొన్నట్లు ప్రాథమిక సమాచారం.

మధ్యప్రదేశ్ సీఎంవో కార్యాలయం నుంచి ఫోన్..!

మధ్యప్రదేశ్ రాష్ట్ర ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధుల సమాచారం మేరకు నరసన్నపేటలోని ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు స్పందించారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స చేయించడంతోపాటు అన్నపానీయాలు అందజేశారు. ఘటనపై మధ్యప్రదేశ్ సీఎంవో కార్యాలయం నుంచి ఆంధ్రా సీఎంవో కార్యాలయానికి సమాచారం వచ్చింది. దీంతో సీఎంవో కార్యాలయ అధికారులు జిల్లా ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీచేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని స్పష్టం చేశారు.

బయోడీజిల్ ప్లాంట్లో అగ్నిప్రమాదం

- మంటల్లో చిక్కుకుని వ్యక్తి మృతి... మరొకరికి గాయాలు

రెంటచింతల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బయోడీజిల్ ప్లాంట్‌లో అగ్నికీలలు ఎగిసిపడి ఓ వ్యక్తి అగ్నికి ఆహుతి కాగా, మరో వ్యక్తి మంటల్లో కాలి ప్రాణాలతో బయట పడ్డాడు. పల్నాడు జిల్లా రెంటచింతల మండలం పాలువాయిజంక్షన్‌లో ఆదివారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గురజాలకు చెందిన షేక్ షరీఫ్ అలియాస్ శివయ్య తన లారీలకు బయోడీజిల్ నింపడానికి రహదారి పక్కన ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఒకటిన్నర నెల నుంచి ఆ ప్లాంట్ మూతపడింది. మళ్లీ బయో డీజిల్ షాపు తెరవాలనుకున్నారు. శనివారం రాత్రి నల్గొండ జిల్లా కోదాడ నుంచి బయోడీజిల్ లోడ్ లారీ రాగా, తన సమీప బంధువైన షేక్ రషీద్ (29)ను ప్లాంట్ వద్దకు వెళ్లాలని కోరారు. రషీద్‌కు తోడుగా భాగ్యరావు అనే వ్యక్తి కూడా వెళ్లి విద్యుత్ మోటార్ ద్వారా తెల్ల బ్యారల్స్‌లో బయోడీజిల్‌ను నింపుతున్నారు. ఈ సమయంలో మోటార్ ఆగిపోవడంతో భాగ్యరావు స్విచ్ ఆఫ్ చేసి మళ్లీ ఆన్ చేశాడు. సమీపంలో ఇన్వర్టులుండడంతో ఒక్కసారిగా చిటపట అంటూ నిప్పురవ్వలు పడి డీజిల్‌కు అంటుకుంది. మంటలు చెలరేగి గాయాలపాలైన భాగ్యరావు తప్పించుకుని బయటకు రాగా బ్యారల్ల దగ్గర ఉన్న రషీద్ బయటపడే మార్గం లేక అగ్నికీలల్లో మాడి మసైపోయాడు. ఒళ్లంతా పూర్తిగా కాలిపోగా కొద్ది పాటి అస్తిపంజరానికి సంబంధించిన ఎముకల గూడు మాత్రమే ఘటనా స్థలంలో లభ్యమైంది. మాచర్ల నుంచి వచ్చిన అగ్నిమాపక యంత్రం మంటలను ఆర్పడానికి గంట పాటు శ్రమించింది. భాగ్యరావును మెరుగైన చికిత్స కోసం గుంటూరుకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగార్జున చెప్పారు.

తిరుపతిలో ప్రత్యేక సంస్కృత అకాడమీ

- తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ విల్సన్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ప్రత్యేకంగా సంస్కృత అకాడమీ ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్టు తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్.డి.విల్సన్ (శరత్‌చంద్ర) తెలిపారు. తిరుపతిలోని తెలుగు, సంస్కృత అకాడమీ కార్యాలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి, విజయవాడలో తెలుగు, సంస్కృత అకాడమీ కార్యాలయాలు కొనసాగుతాయని, వాటిని తరలిస్తున్నారనే ప్రచారాన్ని ఎవ్వరూ నమ్మవద్దని అన్నారు. గతంలో నిలిచిపోయిన తెలుగు అకాడమీ జర్నల్‌ను పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్‌ను తీసుకొస్తామని, 1 నుంచి 10వ తరగతి వరకూ పాఠ్య పుస్తకాల ప్రచురణ బాధ్యతను అకాడమీ చేపట్టే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని వివరించారు. పాఠ్య పుస్తకాలను సొంతంగా ప్రచురించి, వ్యాపారం చేస్తున్న ప్రైవేటు కళాశాలలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు తెలుగులో చదవడం, మాట్లాడటం, రాయడం వంటి నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ అందించాలని భావిస్తున్నట్టు విల్సన్ ఈసందర్భంగా తెలిపారు. తెలుగు, సంస్కృత అకాడమీ పరిధిలో చాలా ఏళ్లుగా పనిచేస్తున్న వారికి టైంస్కేల్ వర్తింపజేయాలని ఆలోచిస్తున్నామన్నారు. ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగాలు భర్తీ చేయాలని ప్రణాళిక రూపొందిస్తున్నట్టు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో అకాడమీ అభివృద్ధికి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని, అప్పట్లో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై విచారణ చేపడతామని వెల్లడించారు.

అన్ని జిల్లాల్లో గనుల శాఖ కార్యాలయాలకు భవనాలు

- మంత్రి కొల్లు రవీంద్ర

ఒంగోలు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గనుల శాఖ కార్యాలయాలకు భవనాలు నిర్మిస్తామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు. ప్రకాశం జిల్లా కేంద్రం ఒంగోలులో రూ.2.14 కోట్లతో నిర్మించనున్న గనుల శాఖ కార్యాలయానికి ఆదివారం ఆయన మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామితో కలిసి శంకుస్థాపన చేశారు. గ్రానైట్ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకొంటున్నట్టు మంత్రి కొల్లు రవీంద్ర ఈసందర్భంగా చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలకు అనుగుణంగా మైనింగ్ పాలసీని అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయ్‌కుమార్, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అడవుల నుంచి ఆదివాసీల గెంటివేతను వ్యతిరేకించాలి: రైతుకూలీ సంఘం

విజయవాడ (గాంధీనగర్), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పేరుతో అడవుల నుంచి ఆదివాసీల గెంటివేతను వ్యతిరేకించాలని రైతుకూలీ సంఘం (ఏపీ) రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. గిరిజన ప్రాంతాల్లో ప్రజలపై ప్రభుత్వం కొనసాగిస్తున్న నిర్బంధకాండను ఖండించింది. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ...సంయుక్త కిసాన్‌మోర్చా పిలుపు మేరకు ఈనెల 26న దేశవ్యాప్త నిరసన ప్రదర్శనలు, కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. అన్ని పంటల మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, రుణమాఫీ చేయాలని, వ్యవసాయ కూలీల సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలుపుదల చేయాలన్నారు.

రబ్బరు డ్యాంలో ముగ్గురు గల్లంతు


పార్వతీపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం రాజలక్ష్మీపురం వద్దనున్న రబ్బరు డ్యాంలో ఆదివారం ముగ్గురు గల్లంతయ్యారు. కొమరాడ మండలం సివిని గ్రామానికి చెందిన అరసాడ ప్రదీప్, రాయగడ శరత్, అధికారి గోవిందనాయుడుతో పాటు మరికొందరు యువకులు పిక్నిక్ కోసం రబ్బరు డ్యాం వద్దకు వెళ్లారు. అక్కడ స్నానం కోసం నీటిలో దిగగా ముగ్గురూ ప్రవాహానికి కొట్టుకుపోయారు. వారి కోసం వెతికినా జాడ కనిపించలేదు. ప్రదీప్ ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. శరత్ పార్వతీపురంలోని ఆర్కే కాలేజ్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. గోవిందనాయుడు తన గ్రామంలోనే వెల్డింగ్ షాప్ నిర్వహిస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నల్లకొండ నీడలో అనువాదాల పండగ

అమెరికాలో ఎక్కడికైనా వెళ్ళడం వేరు, అరిజోనాలోని టూసన్ (Tucson) అనే నగరానికి వెళ్ళడం వేరు. మరీ తెలియని భాషలో అసలేమీ తెలియని రచయిత రాసిన పుస్తకం ఏదో చదువుతున్నట్టే అనిపించింది. ఎయిర్ పోర్టులో దిగగానే ఎంతో ఎత్తయిన బలిష్టమైన కొండ బ్రహ్మజెముడు వృక్షాలు చూపుని కట్టిపడేస్తాయి. చుట్టూ వున్న ఎడారిని ధిక్కరించి నిలబడే ఈ వృక్షాలు వాటికవే శిల్పాల్లా కనిపించాయి. ఎయిర్ పోర్టు నుంచి అరిజోనా యూనివర్సిటీకి తీసుకెళ్లిన డ్రైవర్ అహ్మద్‌కి ఈ వూరంటే మహా ఇష్టం. ఎప్పుడో ముప్ఫయేళ్ల కిందట అఫ్గన్ దేశం నుంచి తిన్నగా ఇక్కడికే చేరుకున్నాడు అహ్మద్. "అప్పుడు ఇదంతా ఇంకా కొంత ఎడారిలానే వుండేది," అని అతను వచ్చీ రాని ఉర్దూలో అఫ్గానీ యాసలో చెప్తున్నాడు. అప్పటికే ఈ వూరు గురించి కొంత చదివాను కాబట్టి, నాకు వెంటనే అరిజోనా కవి డాన్ హిగిన్స్ కవిత గుర్తొచ్చింది. 'టూసన్' అంటే నల్ల కొండ పాదాల కింది ఊరు అనే అర్థం వుందట. చుట్టూ నల్లగా ఎత్తయిన కోటగోడల్లా నిలబడి వున్న కొండల్ని చూస్తే అలాగే అనిపించింది.

దిగంతంలోకి సూర్యాస్తమయం
కొంత నెత్తురోడుతుంది.
టూసన్, నువ్వు ఎడారి కలల కాన్వాస్ కదా,
బ్రహ్మజెముడు వృక్షాలు నిటారుగా నిలబడే వుంటాయి
పురాతన కాలాల సైనికుల్లా
వాటి ముళ్ళ దేహాలు
గాలితో ఏదో గుసగుసలాడుతూ వుంటాయి ఎప్పుడూ

నేను కవిత్వాన్ని తలచుకుంటున్నప్పుడు రోజువారీ జీవితంలోని సంఘర్షణ ఏదో చెప్పుకొస్తున్నాడు డ్రైవర్ అహ్మద్.



"నేను వచ్చినప్పటి నుంచీ ఇప్పటిదాకా చాలా మారిపోయాయి. తప్పదు కానీ, వ్యత్యాసాలు బాగా పెరిగాయి" అంటున్నాడు. పేదరికం ఎక్కువగా వుండే ఫిలాడేల్ఫియా నగరం నుంచి వచ్చిన వాణ్ని కాబట్టి అదేమీ విశేషంగా అనిపించలేదు. చూస్తూ వుండగానే మాకు బస ఏర్పాటు చేసిన యూనివర్సిటీ కాంపస్ లోని హోటల్ వచ్చేసింది.

అప్పటికే అక్కడొక మేళా జరుగుతున్నంత సందడి వుంది. పండగ వాతావరణమే అంతా నిజానికి అక్కడ వున్న మూడు రోజులూ, ఆ తరవాత అనువాద సభల రెండో భాగం జరిగిన చికాగో యూనివర్సిటీ కాంపస్‌లో వున్న మూడు రోజులూ అదే పండగ వాతావరణం. దేశదేశాల రచయితలు ఈ అమెరికా అనువాద ఉత్సవాలకి వచ్చారని వాళ్ళ వాళ్ళ ముఖాలు చూస్తేనో, భాషలు వింటేనో తెలుస్తూనే వుంది. ఇన్ని దేశాలూ, భాషల మధ్య 'తెలుగు' అంటే ఏమిటన్న ప్రశ్న ఎప్పటిలానే నన్ను నిలదీస్తోంది.

2

దాదాపు యాభై యేళ్లుగా ఎక్కడా ఆగకుండా అనువాదాల మీద పనిచేస్తున్న సంస్థ – అమెరికన్ లిటరరీ ట్రాన్స్‌లేటర్స్ అసోసియేషన్ (ఆల్టా). ఈ ఏడాది మొట్టమొదటిసారి వాళ్ళు వాళ్ళ భాషల జాబితాలో తెలుగుని కలిపారు. అనువాదకులు మాత్రమే కాకుండా, యూనివర్సిటీ స్థాయిలో అనువాదాల చుట్టూ కోర్సులు చెప్తున్న వాళ్ళని నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ రెండింటిలోనూ నా పాత్ర పరిమితమే.





ఆ విషయమే నిర్వాహకులకు చెప్పాను. "మా దృష్టిలో మీరే వున్నారు. రావాల్సిందే" అని వాళ్ళు ఏర్పాట్లు చేశారు.

టూసన్‌లో జరిగిన సదస్సుల్లో ఎక్కువ భాగం యూరోపియన్ భాషలే. దక్షిణాసియా నుంచో, ఇండియా నుంచో వచ్చిన వాళ్ళని వేళ్ళ మీద లెక్కపెట్టాల్సిందే. ఆ కొద్ది మంది కూడా బంగ్లాదేశ్ లేదా పాకిస్తాన్. ఇండియా నుంచి వచ్చిన వాళ్ళలో కన్నడ నుంచి వివేక్ షాన్ బాగ్ అనువాదాలు చేసిన శ్రీనాథ్ పేరూర్, కాశ్మీరీ రచయిత అజర్ వాని, తెలుగు నుంచి నేను మాత్రమే వున్నాం. ఒకరు బంగ్లా నుంచి, మరొకరు పాకిస్తాన్ నుంచి, హిందీ భాష కోసం ప్రసిద్ధ అనువాదకురాలు డైసీ రాక్ వెల్ వున్నారు. అందువల్ల, మూడు రోజుల పాటు జరిగిన ప్రతి సెషన్ లోనూ ఎంతో కొంత మాట్లాడక తప్పలేదు. తెలుగు మాత్రమే కాకుండా, దక్షిణాసియా సాహిత్య పాఠాలు చెప్పే అధ్యాపకుడిగా హిందీ, ఉర్దూ భాషల అనువాదాల ప్రాముఖ్యాన్ని కూడా చెప్పాలని నిర్వాహకులు ముందే చెప్పారు. ఇది అంత తేలిక కాదు కానీ, చాలా మటుకు తెలుగు కేంద్రంగానే ఎక్కువ మాట్లాడాను.

3

ఈ వారం రోజుల సభల్లో నా మొదటి ప్రతిపాదన: లిఖిత సాహిత్యాల మీద వున్న శ్రద్ధ మౌఖిక సాహిత్యాల మీద లేనే లేదని! ఇదేమీ కొత్తది కాదు కానీ, అక్కడ వున్న ఎక్కువ మందికి ఆ విషయం అంత బలంగా చెప్పడం నచ్చినట్టుంది. కీలకోపన్యాసాలిచ్చిన ఇద్దరు ముగ్గురు ప్రసిద్ధులు వాళ్ళ వాళ్ళ ప్రసంగాల్లో నా ప్రతిపాదనని హాయిగా ప్రస్తావించడమే కాకుండా, ఈ మూడు రోజులూ నేను ఎక్కడ కనిపిస్తే అక్కడ చాలా సేపు మాటల్లోకి దింపారు. నా అభిప్రాయాల్లోంచి చాలా శ్రద్ధగా తీసుకున్న నోట్సులు చూపిస్తూ, ఒక్కో విషయం ఆరాతీశారు. తెలుగుకి సంబంధించినంత వరకూ తెలంగాణ సాయుధ పోరాటం తరవాత మౌఖిక సాహిత్యాల మీద పెరిగిన ఆసక్తి గురించి వివరంగా చెప్పాల్సి వచ్చింది. అలాగే, రాయలసీమ, ఆంధ్ర ప్రాంతాల్లో వివిధ స్థానిక ఉద్యమాల చరిత్రలో ఈ మౌఖిక సాహిత్యం ఎలా భాగమైందో కూడా చెప్పుకొచ్చాను.

సాహిత్య సృజనలో వుండే అనేక భాషల జమిలి (హైబ్రిడ్) తత్వాన్ని అనువాదాల్లోకి తీసుకురావాల్సిన అవసరం వుందన్నది నా రెండో ప్రతిపాదన. ఇది కూడా మంచి చర్చకి తావిచ్చింది. శ్రోతలు దీనికొక ఉదాహరణ అడిగినప్పుడు తెలుగు దఖనీ ఉర్దూతో పాటు, రాయలసీమలో తెలుగూ, కన్నడ భాషల హైబ్రిడ్ సృజనలోంచి కొంత వివరించాను.

ఇక మూడో ముఖ్యమైన ప్రతిపాదన: ప్రపంచ భాషల పటంలో తెలుగు కానీ, దఖనీ కానీ ఎక్కడ నిలుస్తాయో, కలుస్తాయో చెప్పడం! మొదటి నించీ ఈ రెండు భాషలకూ ఒక అంతర్జాతీయ నెట్‌వర్క్ వుందని నా వాదన. సంస్కృతం నుంచి విడివడ్డాక తెలుగులో, అలాగే పర్షియన్ నుంచి విడివడ్డాక దక్షిణాది ఉర్దూలో ఇది బలంగా కనిపిస్తుంది. సాహిత్య సంస్కృతికి ప్రపంచం అనే ఇరుసు కాకుండా, స్థానికత అనే కేంద్రం నుంచి చూసినప్పుడే ఈ ప్రాపంచికత అర్థమవుతుంది. ఆ దృష్టి నుంచి చూస్తే ప్రపంచ భాషల నుంచి అనువాదాలు ఎంత అవసరమో, మరీ స్థానిక భాషల నుంచి ఇంగ్లీషులోకి, ఇతర పెద్ద యూరోపియన్ భాషల్లోకి కూడా అనువాదాలు వెళ్ళాల్సిందే.

ఈ అనువాదాల్లోంచి టూసన్ లాంటి కొత్త ప్రదేశమైనా, ఆఫ్ఘన్ లాంటి ఇతర భాష అయినా చిరపరిచితమయ్యే కొత్త పుస్తకాలే అవుతాయి. ముఖ్యంగా చికాగో యూనివర్సిటీ కాంపస్‌లో జరిగిన సదస్సుకి ముగింపు మాటలు చెప్పే అవకాశం నాకు దొరికింది. "సాహిత్యంలో సృజన ఎంత ముఖ్యమో, అనువాద సృజన అంతే ముఖ్యం. అప్పుడు సరిహద్దుల మధ్య గోడలు కూలిపోతాయి. భాషల మధ్య వంతెనలు గట్టిగా నిలబడతాయి."

■ అఫ్సర్



చివరికి ఇలాగే, నీలాగే?

సోఫాలో పడుకుని ఉన్నావు నువ్వు. మునుపు ఎన్నడో, ఎన్నేళ్ల క్రితమో పగిలిన పాత కిటికీ అద్దంలోంచి వెలుతురు, దుమ్ము పట్టి పాలిపోయిన కాగితంలాగా! సోఫాలో, ఎవరో ఉండగా చేసి విసిరి కొట్టిన ఆదే కాగితంలాగా, ముడతలు పడి ఉన్నావు నువ్వు! లొట్టపోయి స్ప్రింగులు బయట పడుతున్న, దుప్పటి లేని ఆ మురికి సోఫాలో దగ్గరగా ముడుచుకుని, గుప్పెడంత ఎముకల పోగులాగా, తడిచిన గోడల అరలలో మగ్గిపోయిన పుస్తకాల వాసనలాగా, ఎన్నో ఏళ్లుగా మార్చని కర్టెన్స్ లాగా, పాలిపోయిన వాటి రంగుల్లాగా, ఆ గదుల్లో తిరుగాడే నల్లని నిశ్శబ్దం లాగా. తుడవని పాత ఫొటోలాగా. మసి పట్టిన స్టవ్ లాగా, వంట గదిలోనే ఒక అరలో నూనె మరకలతో నువ్వు ఇక పూజించని వెలసిపోయిన దేవుని పటంలాగా

మరి ఎప్పుడైనా నేను ఆ కాగితపు ఉండను విప్పితే, లోపల వంకర టింకరగా పిల్లలు దిద్దుకున్న చిన్న అక్షరాలు ఏవో. వాళ్ళు వేసుకున్న పెన్సిల్ బొమ్మలు ఏవో: తెల్లగా, నల్లగా! ఇల్లు, చెట్టు, గూడూ, పిట్టలూ. వాటి అన్నిటి మధ్యగా ఒక ముద్దలాగా, ఎండిన ఇంకు. దాని మరక! నీ చేయే తొణికి ఇంకు బుడ్డీ జారిందో, లేక నీ హృదయమే నేల రాలి, చిట్లి, ముక్కలయి నెత్తురు ముద్దగా చిందిందో కానీ, నీలో నల్లగా కమిలిన ఆ ఇంకు మరక! పోదు అది! నువ్వు కాలి, పట పటా నీ బొమికలు విరిగి, చివరికి నిన్ను బూడిదగా మిగిల్చిన ఆ ప్రేమ మరక. పోదు అది, బాల్యంలో అమ్మవారు వస్తే పోడానికి, నీ నుదిటిన వాళ్ళు కాల్చిన మచ్చలాగా: అది! పోదు అది, నిన్ను స్థబ్దుగా మార్చిన ఆ పచ్చి గాయం మరక! ప్రేమ మరక –

+++

సోఫాలోనే పడుకుని ఉన్నావు నువ్వు. పగిలిన నీ శరీరంలోంచి చిన్నగా మసక వెలుతురు. ఈదురు గాలి: ఈలలాగా. మరి ఎక్కడో రెక్కలు కొట్టుకునే సవ్వడి. కొట్టుకునే రెక్కలు విరిగి, విలవిలలాడి, ఇక అవి నెమ్మదిగా ఆగిపోయే చప్పుడు. ఆనక నిశ్శబ్దం. చీకటే గదులుగా మారి ఉన్న ఆ ఇంట్లో, అనంతమైన నీ ఒంటరితనంలో, ఇటువంటి వృద్ధాప్యంలో నీలో ఒక మూలుగు, అప్పుడు! "అమ్మా" అని అన్నావా? ఏదో గొణుగుతావు: "నానీ" అని పిలిచావా? "నీళ్లు" అని అడిగావా? నీ చేతిని చాచావా? సోఫా పక్కగా, పల్చటి శాలువాలోంచి నిస్సత్తువతో ఎముకలు బయటపడిన నీ చేయి! ఎవరినో పిలుస్తున్నట్లు, ఎవరినో ఉండమన్నట్లుగా... ఆ చేయి... "ముట్టుకో" అని చిన్నగా గుసగుసగా అన్నట్లుగా! అన్నావా లేక నేనే భ్రమ పడ్డానా? నువ్వు నాకు తెలుసు అనీ, నిన్ను అర్థం చేసుకున్నాననీ...

సోఫాలోనే ఇంకా పడుకుని నువ్వు: అట్లా. ఇన్నాళ్లూ తిన్నావో లేదో, పడుకున్నావో లేదో ఎవరికీ తెలియదు. అన్నీ మరొకరికే అయ్యి, అన్నీ మరొకరికే చేసి – నిన్ను నువ్వు మరచి – చివరికి ఎవరూ లేక ఒక్కదానివే అయ్యి, ఏ చేతిలోంచో – విసిరి వేయబడో, లేక క్రమేణా చేజారిపోయో, నీలోంచి నువ్వే తప్పిపోయి, ప్రేమ ఉందని కడ దాకా నమ్మీ నమ్మీ, ఏమీ లేకుండా, ఎవరికీ ఏమీ కాకుండా చివరికి ఇలా చివికిపోయి మిగిలి, నిద్ర మాత్రలతో, diabetic మందులతో, నిరంతరం నీతో ఉంచుకునే జండూ బామ్‌తో, పోగా మిగిలిన ఒక కన్నుతో, ఏదీ సరిగ్గా చూడలేక, ఏదీ పూర్తిగా వినలేక, రాత్రిలో రాత్రై, చీకట్లోని ఏడుపై, లీలగా వినిపించే వెక్కిళ్ళై, ఈ డెబ్బై అయిదేళ్ల వయస్సులో – గాలికి ఎటో కొట్టుకుపోయే, ఎంతో ఇష్టంతో నువ్వే రాసుకుని, బొమ్మలు వేసుకుని, ఎందుకో ఏడుపు దిగమింగుకుని చించి ఉండ కట్టి చీకట్లోకే గాలిలోకి విసిరేసుకున్న కాగితానివై, చివరికి ఇలా... చివరికి ఇలాగే, చివరికి ఇలాగే నీలాగే చచ్చిపోతానా నేనూ?

■ శ్రీకాంత్ కె

సోమవారం 24 నవంబరు 2025

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

అందెశ్రీ సంస్మరణ సభ

జాతీయ సంగీత కళాకారుల సంఘం, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త నిర్వహణలో అందెశ్రీ సంస్మరణ సభ నవంబరు 27 సా.5గంటలకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభలో ఏనుగు నరసింహారెడ్డి, కె. శ్రీనివాస్, ఎం. ప్రభాకర్, నాళేశ్వరం శంకరం, సిద్ధార్థ తదితరులు పాల్గొంటారు. వివరాలకు: 98492 45137.

ఎల్. వి. చెన్నారావు

'అభిరుచి' సాహిత్య వ్యాసాలు

తెలంగాణ రచయితల సంఘం, జంటనగరాలు – సోమవారం కవి సమ్మేళనం ఆధ్వర్యంలో కొండపల్లి నీహారిణి సాహిత్య వ్యాసాల పుస్తకం 'అభిరుచి' ఆవిష్కరణ సభ నవంబరు 24 రాత్రి 7.30 నుంచి ఇంటర్నెట్ జూమ్ మీటింగ్‌లో జరుగుతుంది. ఇందులో ఏనుగు నరసింహారెడ్డి, రూప్ కుమార్ డబ్బీకార్, నెల్లుట్ల రమాదేవి, బెల్లంకొండ సంపత్ కుమార్ తదితరులు పాల్గొంటారు.

కందుకూరి శ్రీరాములు

ఈ తరానికి హిచ్‌కాక్


ఎక్కడో లండన్‌లో పుట్టి, హాలీవుడ్‌లో మెరిసి సినీ ప్రపంచాన్ని మురిపించిన హిచ్‌కాక్ 125వ జయంతి సందర్భంగా తెలుగులో ఒక పుస్తకం వచ్చింది. ఇద్దరు కలిసి, ఎందరిచేతో రాయించి తీసుకొచ్చిన బృహత్తర ప్రాజెక్టు 'మాస్టర్ ఆఫ్ సస్పెన్స్: హిచ్‌కాక్. జర్నలిస్ట్ – సినీ రైటర్ – నంది అవార్డు విన్నర్ పులగం చిన్నారాయణ, ఐ.ఆర్.టి.ఎస్. అధికారి రవి పాడి చేసిన ఈ ప్రయత్నం గురించి వారితో చిరు సంభాషణ ఇది.

ఇంటర్వ్యూ ■ వడ్డి ఓంప్రకాశ్ నారాయణ

వరల్డ్ ఫేమస్ డైరెక్టర్ హిచ్ కాక్‌పై భారతీయ భాషల్లోనే తొలి ప్రయోగం అంటూ ఈ పుస్తకం తెచ్చారు. ఈ ఆలోచన ఎలా వచ్చింది?

పులగం: కోవిడ్ కాలం – బోలెడంత ఖాళీ సమయాన్ని ఇచ్చింది. అంతేకాదు, బోలెడన్ని ఖాళీల్ని నింపుకునే సమయాన్ని కూడా ఇచ్చింది. చాలా పుస్తకాల్ని చదివే తీరికనిచ్చింది. ఎన్నెన్నో సినిమాలు చూసే ఓపికనిచ్చింది. ఏవో దొరికిన సినిమాలు చూసేయడం కాకుండా, ఒక పర్సనాలిటీకి సంబంధించి మొత్తం కలెక్షన్ అంతా గేదర్ చేసి, ఆ వ్యక్తిత్వానికు సృజనాత్మక ప్రపంచంలోకి చొచ్చుకుపోయే ప్రయత్నంలో నాకు హిచ్‌కాక్ దొరికాడు. ఆయనవి మొత్తం 53 సినిమాలు (9 మూకీలు, 45 టాకీలు). ప్రతి దాంట్లోనూ హిచ్‌కాక్ సిగ్నేచర్ స్పష్టంగా కనిపిస్తుంది. ఆ రోజుల్లో తక్కువ లొకేషన్లలో, లోబడ్జెట్‌లో అంత అవుట్‌పుట్ ఎలా ఇచ్చాడా అని ఆశ్చర్యం వేసింది. కోవిడ్ తర్వాత ఫిల్మ్‌మేకింగ్ స్టయిల్ మారిపోతుందేమో, తక్కువ బడ్జెట్‌లో తక్కువ లొకేషన్లలో సినిమాలు తీయాల్సి వస్తుందేమో అనిపించింది నాకు. అందుకే హిచ్‌కాక్ సినిమాల్ని ఈ తరానికి మళ్లీ పరిచయం చేయాలనిపించింది. ఒక్కో సినిమాని ఒక్కో సినీ ప్రముఖుని పాయింట్ ఆఫ్ వ్యూలో ప్రెజెంట్ చేస్తే బావుంటుందనిపించింది. మొదట సుప్రసిద్ధ దర్శకులు సింగీతం గారికి ఈ ఐడియా చెబితే, 'ప్రొసీడ్' అని, వారంలోపే 'రియర్ విండో' సినిమా మీద ఒక ఆర్టికల్ రాసి పంపించారు. దర్శకుడు వంశీ కూడా ఫుల్ సపోర్ట్ చేశారు. ఆయన ఇంటి నిండా హిచ్‌కాక్ పోస్టర్‌లే! ఓ రకంగా హిచ్‌కాక్ పట్ల క్యూరియాసిటీ కలగడానికి కారకుడు, ప్రేరకుడు వంశీ గారే. ఈ ప్రాజెక్టు గురించి రోజూ రవి పాడి గారితో ఫోన్‌లో చర్చిస్తుంటే, ఆయన అలవోకగా ఆయా సినిమాల తెర వెనుక ముచ్చట్లు చెప్పేస్తుండేవారు. ఈ ప్రాజెక్టుకి పరిపూర్ణత రావాలంటే ఆయన భాగస్వామ్యమూ ఉండాలనిపించింది. అలా ఇద్దరం కలిసి ఈ పుస్తకాన్ని తీసుకొచ్చాం.





పులగం చిన్నారాయణ, రవి పాడి

నలభై ఐదు మంది దర్శకులు, ఏడుగురు రచయితలు, పదిమంది జర్నలిస్టులతో మొత్తం 62 వ్యాసాలు... ఇవి రాయించడం కష్టం కాలేదా?

పులగం: ఇంతమందితో ఎక్కడా రిపిటిషన్ లేకుండా ఆర్టికల్స్ రాయించడమంటే చాలా భారమైన వ్యవహారమే. నాకు తెలిసిన దర్శక రచయితలందర్నీ సంప్రదించాను. కొంతమంది మధ్యలో చేతులెత్తేశారు. అయినా ఏం భయపడలేదు. దీన్ని ఎవరు పబ్లిష్ చేస్తారు, పుస్తకాన్ని ఎలా తీసుకురావాలి, ఎన్ని కాపీలు అమ్ముడవుతాయి లాంటి ఆలోచనలు ఏనాడూ పెట్టుకోలేదు. ఓ కొత్త ప్రయత్నం చేస్తున్నాం, ప్రకృతి సహకరిస్తుందనే ధీమా. చివరకు నేనే 'అక్షౌహిణి మీడియా' పేరుతో పబ్లిష్ చేశాను. వారం రోజులకే ఫస్ట్ ఎడిషన్ కాపీలు అమ్మగలిగాం. హిచ్‌కాక్‌కి ఇంకా డిమాండ్ ఉందని అర్థమైంది.

ఏ సమాచారమైనా వికీపీడియాలో, ఇంటర్‌నెట్‌లో దొరికే ఈ కాలంలో ఈ పుస్తకం ప్రత్యేకత ఏమిటి?

రవి పాడి: ఇందులో దర్శకులు, రచయితలు, జర్నలిస్టులు రాసిన సినిమా సమీక్షల్లో ప్రస్తావనకు రాని అంశాలను, తెర వెనుక ముచ్చట్లను చాలా ఇచ్చాం. ఇవేవీ వికీపీడియాలో దొరకవని ఖచ్చితంగా చెప్పగలను. వి.ఎ.కె. రంగారావు, యండమూరి, మల్లాది, సుకుమార్ వంటి ప్రముఖుల ప్రశంసలు అందుకోవడానికి కారణం అదే కారణం. ప్రముఖ రచయిత సత్యానంద్ అయితే ఈ పుస్తకాన్ని తప్పనిసరిగా ఇంగ్లిష్‌లో విడుదల చేయమని సూచించారు. ఆ ప్రయత్నంలో ఉన్నాం.

ఇంకే దర్శకుడు గురించైనా ఇలాంటి ప్రయత్నం చేస్తున్నారా?

రవి పాడి: వంశీ గారు, మల్లాది గారు కొంతమంది ప్రసిద్ధ హాలీవుడ్ దర్శకుల పేర్లు చెప్పి, పుస్తకాలు తీసుకొస్తే బావుంటుందని సూచించారు. స్టీవెన్ స్పీల్‌బర్గ్ పుస్తకం వరుసలో ఉంది. 'ప్రపంచ సినిమా పరిమళం' పేరుతో ఇంకో పుస్తకం సిద్ధమవుతోంది.

పరిశోధనలు విమర్శ కానేరవు!

'ప్రమాణాల్లేని నేటి విమర్శ' పేరుతో సుంకర గోపాలయ్య రాసిన వ్యాసానికి (03.11.2025) సమాధానంగా 'బహుళ స్వరాల నేటి విమర్శ' పేరుతో వెంకట రామయ్య వ్యాసం రాసారు (10.11.2025). ఈ వ్యాసంలో వెంకట రామయ్య– "ఆధునిక (?) విమర్శలో... 'విశ్లేషకుడు' లేదా 'వ్యాఖ్యాత' పాత్ర బలపడింది. ఇది పతనం కాదు, పరిణామం" అన్నారు.

విశ్లేషణా, వ్యాఖ్యానము రెండూ ఈనాటివి కాదు గానీ, నాకిక్కడ ఆయన విమర్శా ప్రక్రియను పరిణత రూపంగా చూడకపోవడమే ఆశ్చర్యం కలిగించింది. సుంకర గోపాలయ్య కొత్త పరికరాలు, నిర్దిష్టమైన నిరూపణలు లేని విమర్శ ప్రబలిపోతోందని వాపోయాడు. విమర్శకు ఉండే ఎటువంటి మౌలిక లక్షణానికయినా ప్రమాదం ఏర్పడుతుందన్న భయం కలిగినప్పుడు ఇటువంటి ఆక్రోశం సహజం. రామయ్య కొత్త సిద్ధాంతాలు ఆకాశం నుండి ఊడిపడవన్నారు గానీ ఆయన కూడా నవీన సిద్ధాంతాలను వేటినీ ఉటంకించలేదు. కొంతమంది పేర్లు ప్రస్తావించి విషయాత్మక చర్చను కాస్తా వ్యక్తిగతం చేసేశారు. సిద్ధాంత అన్వయాలు సిద్ధాంతాలు కానట్టే పరిశోధనలు విమర్శ కానేరవన్న సంగతి తెలుసుకోవాలి.



"పరిశోధన వ్యాసంలో ఒక వినూత్న సిద్ధాంతం గాని, సమన్వయం గాని, విశ్లేషణం గాని ప్రతిపాదించబడుతుంది. విమర్శ వ్యాసంలో ఒక వినూత్న వివేచనం గాని, దృక్పథం గాని సప్రమాణంగా సమర్పించబడుతుంది" అని జీవీ సుబ్రమణ్యం చెప్పారు. ఆయనే కొత్తదనం ప్రయోగం కావచ్చు గానీ, ప్రయోగానికీ విప్లవానికీ తేడా ఉందని అన్నారు కూడా. కనుక Narrative (వివరణాత్మక), Descriptive (వర్ణనాత్మక), Participative (భాగస్వామ్యత), Application (అనువర్తిత)... వంటివి ప్రక్రియా (Genre) విమర్శలో భాగాలే కానీ కొత్త సిద్ధాంతాలు కావు. అలా అయినప్పుడు వ్యాసకర్త ఉదహరించిన పుస్తకాల కన్నా పెద్ద జాబితానే తయారు చేయవచ్చు. ముందుమాటలు, పుస్తక సమీక్షలు, సదస్సుల్లో సమర్పించిన పరిశోధనా వ్యాసాలను గుదిగుచ్చి విమర్శ పేరుతో సంకలనాలు తెచ్చినంత మాత్రాన అవి సాహిత్య విమర్శ అనిపించుకోవు. ఆయా సమీక్షకులను, పరిశోధకులను విమర్శకులుగా గుర్తించడంలో మనకు మరింత పర్యాలోచన, సంయమనం అవసరం.

వర్తమాన విమర్శ అభిరుచి స్థాయిలోనే ఉండిపోతోందన్న గోపాలయ్య మనసులో మాటను రామయ్య తెలుసుకోలేకపోయారు. అందుకు గోపాలయ్య వాడిన "గత పదిహేను సంవత్సరాల" అన్న తొందరపాటు ప్రస్తావన కారణం కావచ్చు. అయితే ఇద్దరూ సాహిత్య విమర్శలో అంబేద్కర్, బౌద్ధం వంటి సిద్ధాంతాల ప్రవేశాన్ని, గణనీయ ప్రభావాన్నీ విస్మరించారు. వర్తమాన సాహిత్య విమర్శకు కొత్త సిద్ధాంతాల అవసరం ఉందన్నది ఎంత నిజమో, అసలు అటువంటి ప్రమేయమే మన్నించలేని ఒక వింత కాలంలోకి మనం నడచి వెళ్తున్నామన్నది అంతే నిజం. అదే ఇక్కడ అతి ముఖ్యమైన ప్రమాణ చర్చ. ప్రస్తుతం తెలుగు సాహిత్యంలో, ముఖ్యంగా విమర్శలో అంతటి స్తబ్ధత కొనసాగుతోందన్న బాధగానే గోపాలయ్య వ్యాసం నాకు అర్థమయ్యింది.

వర్తమాన సాహిత్య విమర్శకు కొత్త సిద్ధాంతాల అవసరం ఉందన్నది ఎంత నిజమో, అసలు అటువంటి ప్రమేయమే మన్నించలేని ఒక వింత కాలంలోకి మనం నడచి వెళ్తున్నామన్నది అంతే నిజం. అదే ఇక్కడ అతి ముఖ్యమైన ప్రమాణ చర్చ.

సామాజిక మాధ్యమాలను ఎంత శక్తివంతంగా వాడుకోవచ్చో 'కవిసంగమం' వంటి ప్రయోగాలు నిరూపించినప్పటికీ– ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో వస్తున్న అన్ని వ్యాసాలనూ లోతైన చర్చలుగా భావించినట్లైతే తెలుగునాట విమర్శకులు లేరని దిగులు చెందవలసిన పని లేదు. గోపాలయ్య కలతపడ్డ ప్రమాణాలు అవి కాదు, పత్రికల్లో వచ్చే సమీక్షలు కూడా కాదు. విమర్శలో కోల్పోతున్న సృజనాత్మక విలువల గురించి ఆయన రాశారు. రామయ్య పరిశోధనకూ లంకె వేశారు గనుక ఇప్పుడు 'మరొకమారు' దాని ఉపజ్ఞత గురించి కూడా అని భావించాలి. విమర్శకు ఆలంబన దృక్పథమే.

రామయ్య "బహుళ ప్రమాణాల వైపు పరిణామం" అన్న మాటను చాలా ఆలోచించే వాడారు. ఆధునికోత్తరవాద (పోస్ట్ మాడర్నిజం) ప్రస్తావన కూడా తెచ్చారు. కానీ గోపాలయ్య గోసపడ్డ అప్రమాణికత ఏకత్వమో, బహుళత్వమో కాదు. అధ్యయనశీలత, ప్రాసంగిక స్వభావము మాత్రమే. అయినప్పటికీ Heterogeneity (వైధర్మ్యము), Hybridity (మిశ్రితత్వం), Multiplicity (బహుళత్వము) వంటి ధోరణులు ప్రక్రియకుండే శాస్త్ర మూలాన్ని మార్చలేవు. వర్తమాన సాహిత్యంలో ఈ బహుళ తాత్వికత వరమా శాపమా ఇంకా తేలవలసి ఉంది. కొప్పర్తి, బి. తిరుపతి రావు, సుంకిరెడ్డి, జిలుకర శ్రీనివాస్, అఫ్సర్ వంటివారు ఆ దిశగా ఎంతో కృషి చేస్తున్నారు కూడా. అయితే గతాన్ని ఆదర్శీకరిస్తున్నారని తేలిగ్గా తీసిపారేస్తున్నారు గానీ కట్టమంచి, రాళ్ళపల్లి, రారా, టీఎమ్మెస్ వంటి వారికి తెలుగు సాహిత్య విమర్శలో క్లాసిక్ స్థానం ఇవ్వడం సముచితమే. వీళ్ళే కాదు విమర్శకున్న ప్రయోగశీలతను, దార్శనికతను, విలక్షణతను నిలబెట్టిన మహానుభావులెందరినో ఈ తరం స్ఫూర్తిగా తీసుకోని అధ్యయనం చేయాలి.

■ శ్రీరామ్ పుప్పాల

✆ 99634 82597

తొలిజాడలు

నా పూర్వీకులు నడిచిన దారుల్ని
వెతుకుతూ పోతాను...
రాతిపై అతుక్కుపోయిన రక్తపు మరకల్ని
గుర్తుపట్టి మృదువుగా హత్తుకుంటాను.
గరుకుపాదాలు హృదయాన్ని వెచ్చగా తాకాయి...
నా పూర్వీకులు విడిచిపెట్టిన
గ్రామాల్ని చేరుకుంటాను.
భూమిలో ఇంకిపోయిన కన్నీటి మడుగులు,
మట్టిలో నిద్రిస్తున్న మరణించిన వారి స్వప్నాలు...
ద్రిమ్మరులై, ముసాఫిరులై ఏ కొండలపైకో,
ఏ నదీ తీరాలవైపో సాగిపోతూ...
పచ్చిక బయళ్ళలో ఆలమందలను,
బోడగుట్టల్లో గొర్రెపిల్లలను
అక్కున చేర్చుకుని ఉంటారు.
నా పూర్వీకుల పాటలు వింటాను
పాటల్లో ప్రవహించిన దుఃఖం,
పాటల్లో గాయపడిన జీవితం,
రాగాల్లో తాండవమాడిన ఆనందం...
అవి పాడుతూ, వింటూ,
వారి గుండెల్ని హత్తుకుంటాను.
పాటలనిండా పర్చుకున్న
విస్తార జీవితాన్ని దర్శిస్తాను.



నా పూర్వీకులు చెప్పుకున్న కథలు వింటాను..
అన్నం మెతుక్కోసం యుద్ధాలు ఎలా చేశారు,
ఆత్మాభిమానం కోసం
ప్రాణాల్ని ఎట్లా సమర్పించుకున్నారు,
మనిషిగా చూడలేని రాజ్యంలో ఆయుధాలుగా
ఎట్లా మారారో వింటాను.
వారి కథలే చరిత్రగా,
వారి పోరాటమే యుద్ధాలుగా,
వారి పనితనమే నాగరికతగా,
వారి సమూహ సంస్కృతియే వారసత్వంగా
ఎట్లా వర్ధిల్లిందో తెలుసుకుని పులకించిపోతాను.
యోధులు నడిచిన కాలి బాటలే రహదారులని...
అడుగుల్లో అడుగులు వేస్తాను.
నా పూర్వీకుల మాటలు వింటాను..
శ్రమలో, చెమటలో, నిప్పును రాజేయడంలో,
మట్టిని పిసకడంలో పుట్టిన శబ్దాలు...
పదాలుగా కలబోసుకుని భాషగా మారడం,
అవి కావ్యాలై, నాటకాలై, ఇతిహాసాలై
భూమిమీద పలుకు సుగంధాలై
ఎట్లా పరవశించాయో విని ఆనందిస్తాను.
నా పూర్వీకుల దారుల్లో
ఒక మొక్క నాటి, ఒక శిల భద్రపరిచి,
నేను ఒకనాడు వారిలో కలిసిపోతాను!

■ తుమ్మల దేవరావ్

కథాసంపుటిపై చర్చ

జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి కథాసంపుటి 'నాగేటి సాళ్లలో'పై చర్చా కార్యక్రమం నవంబర్ 30న పలమనేరులోని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి కళామందిరంలో జరుగుతుంది. సభలో టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి, మాధవరెడ్డి, పలమనేరు బాలాజీ, కవితశ్రీ, పల్లిపట్టు నాగరాజు, పుష్ప తదితరులు పాల్గొంటారు.

పి. తులసీనాథం నాయుడు

రాయలసీమ మహాకవిసమ్మేళనం

రాయలసీమ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో డల్లాస్ ఏరియా రాయలసీమ అసోషియేషన్ సౌజన్యంతో తొమ్మిదవ రాయలసీమ మహాకవి సమ్మేళనం నవంబర్ 30న డి.పి.ఆర్.సి జిల్లాపరిషత్ హాల్ అనంతపురంలో జరుగుతుంది. రాయలసీమ ప్రసిద్ధ ప్రదేశాలపై 175 మంది కవులు కవితాగానం చేస్తారు. వివరాలకు: 99639 17187.

అప్పిరెడ్డి హరినాథరెడ్డి







చేనేత కార్మికులందరి కుటుంబాలకు ప్రతి నెలా 200 యూనిట్ల చొప్పున ఉచిత విద్యుత్ ఇస్తున్నాను. అది ఈ ఆగస్టు 7 నుంచే అమల్లోకి వస్తుంది.

అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ఏడాది ఆగస్టు 7న మంగళగిరిలో నిర్వహించిన చేనేత దినోత్సవంలో నేతన్నలకు హామీ ఇచ్చారు. హామీ ఇచ్చి మూడున్నర నెలలు కావస్తున్నా నేతన్నలకు విద్యుత్ ఊరట మాత్రం లభించలేదు. ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన తొలినాళ్లలో కాస్త హడావుడి చేసిన అధికారులు ఆ తరువాత ఆ ఊసే ఎత్తడం మానేశారు. పథకం గురించి సచివాలయాల చుట్టూ తిరుగుతున్న కార్మికులకు వారు చెప్పే సమాధానాలతో వారంతా నిరాశ చెందుతున్నారు. ఈ నేపథ్యంలో పథకం అమలు విషయంలో నేతన్నలో అనుమానం, ఆందోళన కనిపిస్తోంది.

నేతన్నల్లో నిరాశ

- మూడున్నర నెలలుగా ఊసే లేని ఉచిత విద్యుత్
- అమలు కాని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన

- తొలుత హడావుడి.. ఆ తర్వాత ఊసే మరిచిన అధికారులు
- పథకం అమలుపై చేనేతల్లో అనుమానం, ఆందోళన

10 వేలమంది గుర్తింపు

- గుంటూరు జిల్లాలో ఇప్పటికే 2,460 మందిని అర్హులుగా గుర్తించి జాబితాను సిద్ధం చేశారు.
- పల్నాడు జిల్లాలో 280 మందిని మాత్రమే అర్హులుగా గుర్తించారు.
- బాపట్ల జిల్లాలో లబ్ధిదారుల సంఖ్య 7 వేల పై చిలుకు ఉంది. ఇదంతా సొంత ఇల్లు,మగ్గం కలిగినవారి జాబితా మాత్రమే.

(గుంటూరు - ఆంధ్రజ్యోతి)

నేతన్నకు ఉచిత విద్యుత్ పథకం లబ్ధిదారుల జాబితాను సచివాలయ ఉద్యోగులు రెండు నెలల క్రితమే పూర్తి చేశారు. చేనేత, జౌళి శాఖ జిల్లా కార్యాలయ పర్యవేక్షణలో చేనేత గుర్తింపు కార్డు కలిగి ఉండడం, ఇళ్లలో చేనేత మగ్గం ఉండడం ప్రామాణికంగా తీసుకుని లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేశారు. గుంటూరు జిల్లాలోని మంగళగిరి, తెనాలి, బాపట్ల జిల్లాలోని చీరాల, వేటపాలెం, ఈపూరుపాలెం సహా చుట్టుపక్కల ఉన్న చేనేత గ్రామాలు, చెరుకుపల్లి, పేటేరు, ఇసుకపల్లి, వరపర్ల పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట, సత్తెనపల్లి గ్రామాల్లో పెద్ద సంఖ్యలో చేనేత కార్మికులు ఉచిత విద్యుత్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇలా మూడు జిల్లాల పరిధిలో సుమారు 10 వేల మంది వరకు చేనేత కార్మికులు ఉచిత విద్యుత్‌కు అర్హత ఉన్నట్లు అధికారులు గుర్తించి జాబితాను సిద్ధం చేశారు. కాగా మంగళగిరి, పరిసర ప్రాంతాల్లో ఎక్కువ మంది షెడ్డులో నేసే కార్మికులు ఉన్నారు. వారిని కూడా లబ్ధిదారుల జాబితాలో చేర్చాలన్న డిమాండు వినిపిస్తోంది. దీనిపై మంత్రి లోకేశ్ కూడా (మిగతా 6లో)

అన్నదాతకు.. అండగా

ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొని.. చెమట చిందించి.. రెక్కల కష్టంతో సాగు చేసి.. అందరికీ అన్నం పెట్టే అన్నదాతలకు అండగా ప్రభుత్వం కదిలేందుకు సిద్ధమైంది. ఏడాదిన్నర పాలనలో ప్రభుత్వం ఏమి చేసింది.. రైతులకు వివిధ పథకాల ద్వారా ఎంత లబ్ధి చేకూర్చింది.. రాబోయే రోజుల్లో వారి సంక్షేమానికి ఏ విధంగా కట్టుబడి ఉందో వివరిస్తూ రైతన్నా.. మీ కోసం కార్యక్రమం పేరిట సోమవారం నుంచి యంత్రాంగం రైతుల ఇంటి బాట పట్టనున్నది. అన్నదాతల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తోన్న ప్రభుత్వం.. వారి సాదకబాధకాలు తెలుసుకోవడంతో పాటు పథకాలు అందడంలో ఏమైనా జాప్యం జరుగుతోందా, ఇంకా ప్రభుత్వం వైపు నుంచి ఏం చేయాల్సి ఉంది.. అనే అంశాలపై స్వయంగా వారితోనే చర్చించనున్నారు. రైతు సేవా కేంద్రాలు యూనిట్‌గా సోమవారం నుంచి ఈ నెల 29 అంటే శనివారం వరకు ఆరు రోజుల పాటు ఈ కార్యక్రమం జరగనున్నది. ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని ఇప్పటికే ప్రభుత్వం ఆదేశించింది. కార్యక్రమ షెడ్యూల్‌ను కూడా విడుదల చేసింది. కార్యక్రమ అమలుకు వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యేలు.. ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు రైతుల ఇళ్లకు వెళ్లి స్వయంగా కలవనున్నారు.

నేటి నుంచి రైతన్నా.. మీ కోసం

- ఆరు రోజులు నిర్వహణకు ప్రణాళికలు
- రైతుల ఇళ్లకు అధికారులు.. ప్రజాప్రతినిధులు
- ఒక్కో ఆర్ఎస్కే పరిధిలో రోజుకు 90 ఇళ్ల సందర్శన

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం అన్నదాతల సంక్షేమంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తోంది. ఇప్పటికే సూపర్ సిక్స్ హామీలు అమలులో భాగంగా అన్నదాత సుఖీభవ పథకం అమలు చేసింది. సాగు పెట్టుబడి ఖర్చుల కోసం రెండు విడతల్లో రూ.14,000 రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేసిన విషయం తెలిసిందే. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలని ప్రభుత్వం సంకల్పించింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరువ చేసేందుకు మరో వినూత్న ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. రైతన్నా.. మీకోసం పేరుతో సోమవారం నుంచి నేరుగా రైతులను వారి ఇళ్ల వద్ద కలిసేందుకు సిద్ధమైంది. పంటల సాగులో పంచసూత్రాల అమలుపై అన్నదాతలకు అవగాహన కల్పించడమే రైతన్నా.. మీకోసం కార్యక్రమ లక్ష్యంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సీఎం రాసిన లేఖతో పాటు ప్రభుత్వ పథకాలను వివరించే కరపత్రాన్ని రైతులకు అధికారులు అందించనున్నారు. ఆరు రోజులు జరిగే ఈ కార్యక్రమంలో సాగు పద్ధతులు, వ్యవసాయ యాంత్రీకరణ, సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలపై రైతుల కు అవగాహన కల్పించి వారి నుంచి అభిప్రాయాలను సేకరిస్తారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వం ప్రత్యేకంగా ఓ బృందాన్ని నియమించింది. రైతు సేవా కేంద్రం వ్యవసాయ అసిస్టెంట్ టీమ్ లీడర్‌గా ఉంటారు. వీఆర్వో, గ్రామ ఇంజనీరింగ్ సహాయకుడు, గ్రామశక్తి సహాయకుడు, ప్రగతిశీల రైతులు, పీఏసీఎస్, డబ్ల్యూయూఏ, ఎంఎంసీ సభ్యులు ఈ బృందంలో సభ్యులుగా ఉంటారు. రోజుకు 90 రైతు కుటుంబాలను ఆయా బృందాలు కలిసేలా ప్రణాళిక రూపొందించారు.అంటే ఆరు రోజులకు ఒక్కో రైతు సేవా కేంద్రం యూనిట్‌గా 540 రైతు కుటుంబాలను ఆయా బృందాలు (మిగతా 6లో)

ఆధునికంగా.. మంగళగిరి రైల్వేస్టేషన్

- రూ.12.06 కోట్లతో అమృత్ స్టేషన్‌గా అభివృద్ధి
- పలు రైళ్లకు స్టాపింగ్.. మెరుగైన సౌకర్యాల కల్పన



విద్యుత్ కాంతులతో మెరిసిపోతున్న మంగళగిరి రైల్వేస్టేషన్

గుంటూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి.. రాజధాని అమరావతి ప్రాంతంలోని రైల్వేస్టేషన్ అయినా.. ఒకప్పుడు అక్కడకు చేరుకోవడానికి సరైన దారి ఉండేది కాదు. లోలెవల్ ప్లాట్‌ఫాంతో రైలు ఎక్కాలన్నా, దిగాలన్నా ఇక్కట్లే. అలాంటిది అమృత్ స్టేషన్ స్కీమ్ కింద అత్యాధునిక డిజైన్, మెరుగైన సదుపాయాలతో నేడు అందర్నీ కట్టి పడేస్తున్నది. ప్రయాణికులకు ఆహ్లాదకరమైన అనుభూతిని పంచుతోన్న రైల్వేస్టేషన్‌గా మంగళగిరి రైల్వేస్టేషన్‌ని తీర్చిదిద్దారు. రాజధాని పరిధిలో ఉన్న ఈ రైల్వేస్టేషన్‌ను రైల్వే శాఖ కూడా ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని స్థానిక సంస్కృతిని ప్రతిబింబిస్తూ తీర్చిదిద్దింది. అమరావతి రాజధాని, ఎయిమ్స్, డీజీపీ, టీడీపీ కేంద్ర కార్యాలయాలకు మంగళగిరి రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్నది. ఇది ఎన్ఎస్‌జీ-4 కేటగిరీ స్టేషన్ కాగా అమృత్ స్టేషన్ స్కీమ్ కింద ఏడాదిన్నర వ్యవధిలోనే రూ.12.06 కోట్లు వెచ్చించి అనేక అభివృద్ధి పనులు పూర్తి చేశారు. సర్క్యులేటింగ్ ఏరియా, స్టేషన్‌లోకి ఇరువైపుల పచ్చదనం, సెంట్రల్ డివైడర్‌తో అప్రోచ్ రోడ్డు, పార్కింగ్ ఏరియాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. స్టేషన్ రీ డెవలప్‌మెంట్ స్కీమ్ కింద అత్యాధునిక డిజైన్‌తో అభివృద్ధి చేశారు. ఫుట్ బ్రిడ్జి, ప్లాట్‌ఫాంల ఎత్తు, కవర్ ఓవర్ పనులు పూర్తి చేశారు. వాహనాల రాకపోకలకు సులువుగా అప్రోచ్ రోడ్డు అభివృద్ధి చెందింది. వెయిటింగ్ హాల్, టిక్కెట్ కౌంటర్స్, ఫుడ్‌స్టాల్స్, ఆరోగ్యకరమైన టాయ్‌లెట్స్ వంటి సదుపాయాలన్నీ కల్పించారు. స్టేషన్‌కు ఇరువైపులా ప్రవేశించేలా మార్గాన్ని అభివృద్ధి చేశారు. రాత్రిళ్లు రంగు రంగుల ఎల్ఈడీ కాంతులతో స్టేషన్ అంతా దగదగా మెరిసిపోతున్నది. అమరావతి రాజధాని, ఇతర జాతీయ సంస్థల కారణంగా ఇక్కడ నరసపూర్, ఇంటర్‌సిటీ, రాయగడ, సర్కారు, గోల్కొండ, సింహాద్రి, కాజీపేట మార్గంలో ప్రయాణించే ఇంటర్‌సిటీ, హుబ్లీ ఎక్స్‌ప్రెస్‌లతో పాటు గుంటూరు - విజయవాడ మధ్య రాకపోకలు సాగించే మెమూ రైళ్లు ఈ స్టేషన్‌లో హాల్టింగ్ కల్పించారు. ప్రయాణికుల సంఖ్య, ఆదాయం పెరిగే కొద్దీ ఈ స్టేషన్ కేటగిరీ ఎన్ఎస్‌జీ-4 నుంచి 3, 2కి మారే అవకాశం ఉన్నది. దాంతో మరిన్ని రైళ్లకు ఇక్కడ నిలుపుదల కల్పిస్తారు.


విద్యుత్ కాంతులతో మెరిసిపోతున్న మంగళగిరి రైల్వేస్టేషన్


గుండ్లపాలెంలో జరిగిన సభలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ఆదుకుంటాం అధైర్యపడకండి

- కౌలు రైతులతోనే వ్యవసాయం బాగు
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

మేడికొండూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించి ఆదుకుంటామని.. ఎవరూ అధైర్య పడొద్దని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. మేడుకొండూరు, గుండ్లపాలెం గ్రామాలలో నిర్మించనున్న సీసీ రోడ్లకు ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌తో కలిసి ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా గుండ్లపాలెం గ్రామంలో జరిగిన సభలో పెమ్మసాని ప్రసంగిస్తూ కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కౌలు రైతులు బాగుంటేనే వ్యవసాయం బాగుంటుందని తెలిపారు. అన్నదాత సుఖీభవ నుంచి అందే లబ్ధిని కౌలు రైతులకు అందజేసేలా చొరవ తీసుకుంటే వారి జీవన విధానం బాగుంటుందని చెప్పారు. అధికారంలోకి వచ్చిన మొదటి సమావేశంలోనే ఎమ్మెల్యేలు రామాంజనేయులు, శ్రావణ్‌కుమార్‌లు కౌలు రైతుల గురించి చర్చించారన్నారు. రైతు సమస్యల పరిష్కారానికి ఖచ్చితంగా ఒక పరిష్కారాన్ని సూచించే బాధ్యత తీసుకుంటామన్నారు. గ్రామాలలో ప్రజలు తమ అభిప్రాయాలకు, రాజకీయాలకు అతీతంగా ఆలోచించి మంచి నాయకులను గెలిపించుకుంటే అభివృద్ధి జరుగుతుందని చెప్పడానికి గుండ్లపాలెం గ్రామమే ఒక ఉదాహరణ అన్నారు. బిల్లులు సకాలంలో రాకపోయినా సొంత ఖర్చుతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న సర్పంచ్ పాములపాటి కృష్ణయ్య వంటి నాయకులు చాలా అరుదుగా ఉంటారని కొనియాడారు. కొండమోడు - పేరేచర్ల రోడ్డు నిర్మాణానికి సంబంధించిన ఇబ్బందులను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. వైసీపీ హయాంలో ఒక్కటంటే ఒక్క పరిశ్రమ కూడా ఆంధ్రప్రదేశ్ వైపు కన్నెత్తి చూడలేదన్నారు. ఇప్పుడు సీఎం చంద్రబాబు, లోకేశ్‌ల ఆధ్వర్యంలో వందలాది పరిశ్రమలు లక్షలాది కోట్ల పెట్టుబడులతో వస్తున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ వైసీపీ హయాంలో రౌడీయిజం, దౌర్జన్యాలు, బెదిరింపులతో ఎందరో ఇబ్బంది పడ్డారన్నారు. పంచాయతీ ఉద్యోగులు జీతాలు అందక బిక్షాటన చేసిన రోజులు ఉన్నాయని, పవన్ కల్యాణ్ చేతుల్లోకి వెళ్లాక ఉద్యోగులందరూ గర్వంగా పనిచేయగలుగుతున్నారని తెలిపారు. మేడికొండూరులో శంకుస్థాపన అనంతరం పెమ్మసాని, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ తదితరులను గుండ్లపాలెం గ్రామం వరకు భారీ ఊరేగింపుతో తీసుకువచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పాములపాటి శివన్నారాయణ, సర్పంచ్ పాములపాటి వెంకట కృష్ణయ్య, ఫిరంగిపురం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నార్నె శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు మల్లిపెద్ది రమేష్, నాయకులు షేక్ అబ్దుల్ ఘని, గుత్తా చంద్రశేఖర్, రామాంజనేయులు, నూతలపాటి రామారావు, కంచర్ల శివరామయ్య, ఎంపీటీసీలు షేక్ ముంతాజ్ బేగం, పాములపాటి సురేష్, మహిళా నాయకురాలు జానీబేగం, ఏఈ అజయ్, ఎంపీడీవో డేవిడ్ ప్రభాకర్, పూర్ణశంకరరావు పాల్గొన్నారు.

నిత్య స్ఫూర్తి.. సత్యసాయి

- కలెక్టర్ తమీమ్‌అన్సారియా నివాళి

గుంటూరు(తూర్పు), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మనిషి వికాసానికి శాస్త్ర విజ్ఞానం, దైవవిశ్వాసం రెండూ ముఖ్యమేనని చెప్పిన సత్యసాయిబాబా అందరికీ స్ఫూర్తిప్రదాత అని కలెక్టర్ తమీమ్ అన్సారియా కొనియాడారు. కలెక్టరేట్‌లో ఆదివారం జరిగిన బాబా శత జయంతి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. తొలుత బాబా చిత్రపటానికి అధికారులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక సేవతో ప్రజల హృదయాల్లో సత్యసాయి గొప్ప స్థానం సాధించుకున్నారని గుర్తుచేసుకున్నారు. విద్యా, వైద్య రంగాలు, నీటి ప్రాజెక్టులు ఇతర సేవా కార్యక్రమాలను నిర్వహించి మానవ సేవే మాధవ సేవ అని


సత్యసాయి బాబాకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా, జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తదితరులు

ఆయన నిరుపించుకున్నారన్నారు. బాబా బాట ను అనుసరించి, ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీదా రులతో ఆప్యాయతగా మాట్లాడాలని అధికారులకు సూచిం చారు. ఏటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ సర్వ మతాల సారం ప్రేమే అని బాబా చాటి చెప్పారని కొనియాడారు. నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ సమాజా నికి నైతిక విలువలు నేర్పిన వ్యక్తి బాబా అని అన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ అశుతోష్, సత్య సాయి సేవా సమితి అధ్యక్షుడు నరసింహరాజు, సభ్యుడు సాయిశంకర్, డీఆర్వో ఖాజావలి, డీపీవో నాగసాయికుమార్, పశు సంవర్థక శాఖ జేడి కేవీవీ సత్యనారాయణ, డీఆర్డీఏ, డ్వామా పీడీలు విజయలక్ష్మి, శంకర్, జిల్లా మత్స్య శాఖ అధికారి కిరణ్ కుమార్, సత్యసాయి సేవా సమితి సభ్యులు పీవీఎస్ రాజు, మహంకాళి శ్రీనివాస్, సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.


లంకన్నకు ప్రాణ ప్రతిష్ట చేసి గంగధారమడుగుకు తీసుకెళ్తున్న పీఠాధిపతి

కనుల పండువగా కల్లిపాడు

- లంకన్నకు ప్రాణప్రతిష్ట చేసిన పీఠాధిపతి
- ముగిసిన వీరారాధన ఉత్సవాలు

6

వీరారాధన ఉత్సవాల్లో అపశ్రుతి

విద్యుత్ వైరు తెగిపడి ఒకరు మృతి.. మరొకరికి గాయాలు

6

బయోడీజిల్ ప్లాంట్‌లో అగ్నిప్రమాదం

- మంటల్లో చిక్కుకుని వ్యక్తి మృతి... మరొకరికి గాయాలు

-వివరాలు 3లో

కార్మికుల సామాజిక భద్రతే ధ్యేయం

- కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



తాడేపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సామాజిక భద్రతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. ఆదివారం కుంచనపల్లిలోని ఓ హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేతనాలు, సామాజిక భద్రత, ఉద్యోగ భద్రత, వివాదాల పరిష్కారం పేరుతో నాలుగు కోడ్లను కార్మికుల కోసం తీసుకొచ్చామన్నారు. తండ్రి, తల్లి, భార్య, పిల్లలతో పాటు అత్తమామలకు కూడా ఈఎస్ఐ కింద వైద్యం అందిస్తామన్నారు. ఫ్యాక్టరీ నుంచి ఇంటికి వెళ్లేలోపు ఏం జరిగినా ఈఎస్ఐ వర్తిస్తుందని చెప్పారు. గర్భిణులకు వర్క్ ఫ్రమ్ హోమ్ అలాగే 26 వారాల లీవ్‌లు ఇస్తున్నామన్నారు. అసంఘటిత కార్మికుల రక్షణ కోసం బోర్డు ద్వారా అన్ని పథకాలు అందేలా చేస్తున్నామన్నారు. డిజిటల్ మీడియా వర్కర్లకు సోషల్ సెక్యూరిటీ ఇస్తామన్నారు. విధి నిర్వహణ తర్వాత యాజమాన్యాలే వారిని ఇళ్ల వద్దకు చేర్చేలా సంస్కరణలు తెస్తున్నామన్నారు. కార్మికుడి ఇష్టప్రకారం పది గంటలు కుదరకపోతే 8 గంటలు పని చేయవచ్చని చెప్పారు. కార్మికులు ఇబ్బందులు పడకుండా పని సాగించేలా ప్రభుత్వం సహకరిస్తుందని చెప్పారు.

వీసా రాలేదని వైద్యురాలు ఆత్మహత్య

- గుంటూరులో ముగిసిన అంత్యక్రియలు

లోపలి పేజీల్లో

కనుల పండువగా కల్లిపాడు

● లంకన్నకు ప్రాణప్రతిష్ట చేసిన పీఠాధిపతి
●ముగిసిన వీరారాధన ఉత్సవాలు

కారంపూడి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పల్నాటి వీరారాధన ఉత్సవాల్లో చివరిరోజైన ఆదివారం కల్లిపాడును కనుల పండువగా నిర్వహించారు. కల్లిపాడులో భాగంగా లంకన్నకు ప్రాణ ప్రతిష్ట చేసే ఘట్టాన్ని జరిపారు. యుద్ధ భూమిలో ఒరుగు బండపై యాదవ సామాజిక వర్గానికి చెందిన వీరాచారవంతుడు శవంగా తెల్ల బట్టలు కప్పుకొని పడుకొని ఉండగా పైన బాణాలు ఉంచారు. పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారు వీరుల సేవా స్థానానికి ఊరేగింపుగా వచ్చి తొలుత కొణతములకు ఊరేగింపు జరిపారు. లంకన్న ఒరిగిన ప్రదేశానికి చేరుకొని ఆనాడు బ్రహ్మనాయుడు తులసితీర్థమిచ్చి ప్రాణ ప్రతిష్ట చేసిన విధంగా నాటకీయంగా నిర్వహించారు. వీర విద్యావంతులు లంకన్న ఒరుగు కథను గానం చేస్తుండగా, కొందరు వీరాచార వంతులు కత్తిసేవ చేశారు. వీరాచారవంతుడు వేకువ జామున 4 గంటలకే శవంగా పడుకోగా, మధ్యాహ్నం 2 గంటల వరకు అంతే శవంలా కదలకుండా ఉండడం ఈ కార్యక్రమంలో విశేషం. ఆవుల మంద కాపరి అయిన లంకన్నను నాగమ్మ సైన్యం మట్టుబెట్టగా విష్ణు సంభూతుడైన బ్రహ్మనాయుడు లంకన్నకు తులసితీర్థం ఇచ్చి ప్రాణప్రతిష్ట చేసే ఘట్టం నిర్వహించారు. అనంతరం లంకన్నగా ఉన్న వీరాచారవంతుడ్ని నాగులేటిలోని గంగధార మడుగు వద్దకు తీసుకెళ్లి స్నానమాచరింపజేశారు. అనంతరం కొణతములకు గ్రామోత్సవం జరిపారు. చెన్నకేశవస్వామి, అంకాళమ్మ ఆలయాల్లో తీర్థం స్వీకరించారు. వీర్ల దేవాలయం వద్ద కత్తిసేవ చేశారు. ఇలా కల్లిపాడు కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. వీరాచార పీఠం నిర్వాహకుడు బొగ్గరం విజయ్‌కుమార్ అయ్యవారు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.


లంకన్నకు ప్రాణప్రతిష్ట చేస్తున్న పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారు


లంకన్నకు ప్రాణ ప్రతిష్ట చేసి గంగధారమడుగుకు తీసుకెళ్తున్న పీఠాధిపతి

ముగిసిన వీరారాధన ఉత్సవాలు

నాలుగు రోజులుగా రాచగావు, రాయభారం, మందపోరు, కోడిపోరులతో నిర్వహించిన వీరారాధన ఉత్సవాలు ఆదివారం కల్లిపాడుతో ముగిశాయి. రాత్రి వేళ బ్రహ్మనాయుడు నృసింహకుంతంతో పాటు దైవాలు (కొణతములు) గ్రామోత్సవంలో చివరిగా ఊరేగింపు నిర్వహించి ఇంటింటి వద్ద హారతులు అందుకున్నారు. కొణతాలకు నూతన వస్త్రాలు, నైవేద్యాలు సమర్పించారు. పోతురాజు గుట్ట వద్ద తంగెడ మండలపై కొణతములన్నీ ఒరిగాయి. ఈ తంగెడ మండలను ప్రజలు తమ గృహాల గడపల వద్ద కట్టుకున్నారు. దీంతో ఉత్సవాలు ముగిశాయి.

నేటి నుంచి జిల్లా అస్మిత అథ్లెటిక్స్ లీగ్

ఏఎన్‌యూ, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం క్రీడా మైదానంలో గుంటూరు జిల్లా అస్మిత అథ్లెటిక్స్ లీగ్ ఎంపికలు సోమవారం నుంచి జరుగుతాయని సంఘం కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 16 విభాగంలో పతిభ కనబరిచిన బాలికలను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీకి ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనదలిచిన వారు ఉదయం 9 గంటలకు వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు తీసుకొని ఏఎన్‌యూ సింథటిక్ ట్రాక్‌లో రిపోర్టు చేయాలని కోరారు.

కృష్ణానదిలో వ్యక్తి మృతదేహం


నది ఒడ్డున మృతదేహం

విజయపురిసౌత్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మండలం నాగార్జున సాగర్ దిగువ కృష్ణా నదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు విజయపురిసౌత్ ఎస్‌ఐ అశోక్ ఆదివారం తెలిపారు. సాగర్ నూతన వంతెన కింద సుమారు 45 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి మృతదేహం కుళ్లిపోయి ఉండగా.. స్థానికులు సమాచారం ఇచ్చారన్నారు. తెల్లని చొక్కా, ఖాకీ రంగు ప్యాంటు ఉన్న మృతుని కుడి చేతికి వెంకటేశ్వరస్వామి ఉంగరం ఉన్నట్లు పేర్కొన్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు 94409 00884, 94407 96229 నంబర్లను సంప్రదించాలన్నారు.

చేపకేసిన గాలం.. కనురెప్పకు గుచ్చుకుని..


కంటిపై గుచ్చుకున్న గాలం

బాపట్ల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరుప్రోలువారిపాలెం గ్రామానికి చెందిన 8వ తరగతి విద్యార్థి నక్కల సందీప్ ఆదివారం సెలవుదినం కావడంతో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపలు పట్టే సమయంలో గాలం లాగటంతో ముల్లు వచ్చి కంటి రెప్పపై భాగాన లోతుగా దిగబడింది. స్నేహితులు గమనించి ఏరియా వైద్యశాలకు తీసుకొచ్చారు. సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ ఆపరేషన్ చేసి గాలం ముల్లు తొలిగించారు. కంటికి ఎటువంటి సమస్య లేదని డాక్టర్ తెలిపారు. పిల్లలు ఆడుకునే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని ఈ సందర్భంగా సూచించారు.

వైద్యశాల ఎదుట మహిళ మృతదేహంతో ఆందోళన

వినుకొండటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వైద్యం వికటించి మహిళ మృతి చెందిందంటూ బాధిత బంధువులు ఆర్టీసీ సమీపంలోని ఓ ప్రైవేట్ హాస్పటల్ వద్ద ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. బాధితులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే... ప్రకాశం జిల్లా.. కురిచేడు మండలం పొట్లపాడు గ్రామానికిచెందిన యాదగిరి యోగయ్య భార్య శ్రీలక్ష్మి(19)కి ఓవర్ బ్లీడింగ్ కావడంతో శనివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో హాస్పటల్‌కు తీసుకొచ్చారు. సాయంత్రం 4 గంటల సమయంలో మందులు ఇచ్చి వారిని ఇంటికి పంపించారు. ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్లిన యోగయ్య భార్య శ్రీలక్ష్మిని నూజెండ్ల మండలం చింతలచెరువులోని పుట్టింటి వద్ద ఉంచారు. రాత్రికి టిఫిన్ చేసిన శ్రీలక్ష్మి వైద్యులు ఇచ్చిన మందులు వేసుకుంది. మందులు వేసుకున్న కొద్ది నిమిషాలకే చేతులు, కాళ్లు గుంజుకుపోవడంతో ఆమెను మళ్లీ వినుకొండలోని చికిత్స అందించిన వైద్యశాలకు వద్దకు తీసుకొస్తున్న సమయంలో మార్గ మధ్యంలో మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న బంధువులు వైద్యశాల వద్దకు చేరుకొని వైద్యురాలి తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకొని మృతురాలి బంధువులతో చర్చించారు. వైద్యం అందించడంలో పొరపాటు లేదని, అవసరమైతే కేసు పెట్టుకోవచ్చని వైద్యులు ఖరాఖండిగా చెప్పడంతో.. వైద్యురాలిపై కేసు నమోదు చేయాలని పోలీసులను డిమాండ్ చేశారు. పోస్టుమార్టం నిమిత్తం శ్రీలక్ష్మి మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి.. మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. బాధితురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ ప్రభాకర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.


పధాన గేటు వద్ద మృతదేహాన్ని ఉంచి బంధువుల నిరసన

అన్నదాతకు.. అండగా

(5వ పేజీ తరువాయి)

కలవనున్నాయి. రోజుకు 90 ఇళ్ల చొప్పున బాపట్ల జిల్లాలో 326 ఆర్ఎస్‌కేల పరిధిలో 29,340 రైతు కుటుంబాల ఇంటికి సిబ్బంది వెళ్లనున్నారు. పల్నాడు, గుంటూరు జిల్లాలను కూడా కలుపుకుంటే రోజుకు దాదాపుగా లక్ష మంది అన్నదాతల కుటుంబాల ఇంటి గడప ప్రభుత్వ యంత్రాంగం తొక్కనుంది. ఆయా నియోజకవర్గాల పరిధిలో ఉన్న ప్రజాప్రతినిధులు కూడా రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో భాగస్వామ్యం కానున్నారు.

పంచ సూత్రాలపై అవగాహన

నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వాల మద్దతు అనే పంచసూత్రాల విధానాన్ని ప్రభుత్వం అమలు చేయాలని సంకల్పించింది. వీటిపై రైతులకే కాకుండా వారి కుటుంబ సభ్యులకు కూడా రైతన్నా మీకోసం బృందం అవగాహన కల్పించనున్నది. పాడి రైతులు, ఫౌల్ట్రీ, గొర్రెల పెంపకందారులు, ఆక్వా ఉద్యాన, సెరికల్చర్ రైతులకు కూడా అవగాహన కల్పించనున్నారు. వ్యవసాయ యాంత్రీకరణ, నేల పరీక్ష, సూక్ష్మ నీటి పారుదలలో ఆటోమేషన్, తెగుళ్ల పర్యవేక్షణ, ముందస్తు హెచ్చరిక, లాట్ ఆధారిత వ్యాధి అంచనా, డ్రోన్ వినియోగం, మామిడి, జామలో పండ్ల సంరక్షణ, అరటిలో గుత్తుల స్లీవ్‌లు, కోతకు ముందు.. కోత తర్వాత సాంకేతికత, మౌలిక సందుపాయాలు కోల్డ్ స్టోరేజ్, ప్యాక్ హౌస్‌లు, రవాణా సౌకర్యాలను రైతులకు వివరించనున్నారు. అదేవిధంగా రైతులు ఏ పంట సాగు చేశారు.. వారికి ఎలాంటి సాయం అవసరమనే విషయాల్ని కూడా నేరుగా తెలుసుకోనున్నారు. సాగులో పురుగు మందుల వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించనున్నారు. సమర్థ నీటి నిర్వహణ, భూసార పరీక్షలు, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం ఇస్తున్న మద్దతు వంటి విషయాలను రైతులకు తెలియజేయనున్నారు. ప్రకృతి సేద్యంతో భూసార రక్షణతో పాటు ప్రజల ఆరోగ్యం కూడా బాగుంటుందని ఈ దిశగా రైతులను చైతన్యపరచనున్నారు. వ్యవసాయ రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులను అందిపుచ్చుకుని సాగును లాభసాటి చేసుకునేందుకే పంచ సూత్రాలను ప్రభుత్వం అమలు చేయనుంది.

డిసెంబరు 3న వర్క్‌షాప్

రైతన్నా మీ కోసం కార్యక్రమం అనంతరం డిసెంబరు 3న ఆర్ఎస్‌కేల పరిధిలో వర్క్‌షాప్ నిర్వహించనుంది. రైతుల నుంచి వచ్చిన అభిప్రాయాలు, ప్రస్తుతం ఉన్న దిగుబడులు, ఏయే పంటల విస్తీర్ణం ఎక్కువగా జరిగింది అనే అంశాల ఆధారంగా ప్రస్తుత రబీ యాక్షన్‌ప్లాన్‌తో పాటు వచ్చే ఖరీఫ్, రబీపై రైతులను ఏ విధంగా సన్నద్ధపరచాలనే ప్రణాళికలను ఈ వర్క్‌షాప్‌లో రూపొందించనున్నారు. వ్యవసాయశాఖ సిబ్బందితో అన్నదాతలను కూడా పూర్తి స్థాయిలో ఈ వర్క్‌షాప్‌లో భాగస్వామ్యం చేయనున్నారు. వినూత్న సేద్యంతో లాభాట బాటలో ఉన్న రైతుల విజయగాథలను కూడా వివరించి రైతులకు ప్రేరణ అందించనున్నారు.

నేతన్నల్లో నిరాశ

(5వ పేజీ తరువాయి)

సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

ప్రభుత్వ ఆమోదం ఎప్పుడు?

మూడు జిల్లాలకు చెందిన 10 వేల మంది కార్మికులను గుర్తించి వారి జాబితాను ఆయా జిల్లాల చేనేత, జౌళి శాఖ అధికారులు రాష్ట్ర కమిషనర్ కార్యాలయానికి పంపించారు. ఈ ప్రక్రియ పూర్తై దాదాపు మూడు నెలలు కావస్తోంది. కానీ కమిషనర్ కార్యాలయంలో ఫైలు మాత్రం ముందుకు కదలలేదు. అధికారుల నిర్లక్ష్యమా? ప్రభుత్వ సాచివేత ధోరణా? కారణమేదైనప్పటికీ నేతన్నలు విద్యుత్ భారాన్ని మోయాల్సి వస్తోంది. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాల కారణంగా చేనేత కుటుంబాలు బాగా దెబ్బతిన్నాయి. మూడు నెలలపాటు పనులు లేక అప్పులపాలయ్యారు. ఈ విద్యుత్ ఊరట లభిస్తే వారికి కొంతలో కొంత ఉపశమనం లభించే అవకాశం ఉంది.

వీరారాధన ఉత్సవాల్లో అపశృతి

● విద్యుత్ వైరు తెగిపడి ఒకరు మృతి.. మరొకరికి గాయాలు


జాలయ్య మృతదేహం

కారంపూడి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా కారంపూడిలో జరుగుతున్న వీరారాధన ఉత్సవాల్లో ఆఖరి రోజు ఆదివారం అపశృతి చోటు చేసుకుంది. వీరుల ఆయుధాలను గంగధారమడుగులో శుద్ధి చేసే కార్యక్రమం చేపట్టిన వీరాచారవంతుల్లో ఒకరు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందారు. మరొకరు గాయపడ్డారు. వీరాచారవంతులు 22 మంది పట్టణంలో కొణతముల ఊరేగింపు అనంతరం నాగులేటిలోని గంగధార మడుగులో కొణతములను శుద్ధి చేసేందుకు దిగారు. తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లైన్ వైరు ప్రమాదవశాత్తూ తెగి గంగధారమడుగులో పడింది. విద్యుత్ షాక్‌కు గురైన.. చిలకలూరిపేటకు చెందిన జాలయ్య (38) మృతిచెందగా.. పుల్లలచెరువు మండలం నీలగంగారం గ్రామానికి చెందిన అంకమ్మరావు గాయపడ్డారు. ఇది గమనించిన మరో వ్యక్తి హుటాహుటిన ట్రాన్స్‌ఫార్మర్ ఫీజు తొలగించడంతో పెనుప్రమాదం తప్పింది. లేకపోతే.. ఊహకందని ప్రాణనష్టం జరిగి ఉండేది. గాయపడిన అంకమ్మరావును 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. గురజాల డీఎస్పీ జగదీష్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా బందోబస్తు చేపట్టారు.

4 పళ్ల విభాగంలో విజేత ప్రకాశం జిల్లా ఎడ్లు


బండ లాగుతున్న ప్రకాశం జిల్లా ఎడ్లు

కారంపూడి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పల్నాటి వీరారాధన ఉత్సవాలను పురస్కరించుకొని స్థానిక నూతన బస్టాండ్ సమీపంలో తెలుగు రాష్ట్రాలస్థాయి ఎడ్ల బండ లాగుడు పోటీలు ఆదివారం ఉత్సాహం సాగాయి. 4 పళ్ల విభాగంలో ప్రకాశం జిల్లా కురిచేడు మండలం పోట్లపాడుకు చెందిన మేడగం హర్షవర్ధన్‌రెడ్డి ఎడ్ల జత నిర్ణీత సమయంలో బండను 4,521 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. తెలంగాణలోని మేళ్ల చెరువుకు చెందిన కొప్పుల గోవర్ధన్‌రెడ్డి, ప్రవలీష్‌రెడ్డి ఎడ్ల జత 4,117 అడుగులతో రెండో స్థానం, పల్నాడు జిల్లా క్రోసూరు మండలం బయ్యవరానికి చెందిన కడియం మణికంఠ ఎడ్ల జత 4,113 అడుగులతో మూడోస్థానం, నరసరావుపేట మండలం రావిపాడుకు చెందిన మనోజ్ చౌదరి ఎడ్లజత 4,053 అడుగులతో నాలుగో స్థానం, హైదరాబాద్‌కు చెందిన రోహన్‌బాబు ఎడ్లజత 3,232 అడుగులతో ఐదోస్థానం, బాపట్ల జిల్లా మార్టూరు మండలం నాగరాజుపల్లికు చెందిన హర్షవర్ధన్ ప్రభాకర్, పల్నాడు జిల్లా కారంపూడికి చెందిన బొమ్మిన శివమణినాయుడు సంయుక్త ఎడ్లజత 2,610 అడుగులతో ఆరోస్థానం, గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కొరగల్లుకు చెందిన దారం శ్రీలత ఎడ్లజత 2,151 అడుగులతో ఏడోస్థానంలో నిలిచాయి. కాపు సంఘ నేత సంగినేని బాలకృష్ణ బహుమతులను ప్రదానం చేశారు. సొసైటీ చైర్మన్ నాగారపు రామకృష్ణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు శేషగిరిరావు, జక్కా నరసింహారావు, అమరయ్య, మాజీ ఎంపీపీ నాగుల్ నాయక్, పలిశెట్టి కొండ, తోట శ్రీను పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం

విజయపురిసౌత్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటి మట్టం ఆదివారం నాటికి 583.70 అడుగులు ఉంది. ఇది 293.70 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,500 , ఎడమ కాలువ ద్వారా 4034 , ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 15634 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 15,634 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలలో..

అచ్చంపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 43.25 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి ఎనిమిది వందల క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 3,600, లీకుల ద్వారా 400, మొత్తం నాలుగు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

దైద అమరలింగేశ్వరస్వామిని దర్శించుకున్న జడ్జిలు

గురజాలటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దైద బిలంలో వేంచేసియున్న శ్రీఅమరలింగేశ్వరస్వామిని ఆదివారం గురజాల కోర్టు పదో అదనపు జడ్జి ప్రియదర్శిని, సబ్ జడ్జి వై.శ్రీనివాసరావు, సివిల్ జూనియర్ జడ్జి సత్యనారాయణలు దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో కండక్టర్ల సస్పెన్షన్‌ల రగడ

● మగ వారికి ఉచిత టిక్కెట్ల జారీపై చర్యలు
● ఇప్పటికే 8 మందిపై వేటు
● 2019 సర్క్యులర్‌కు విరుద్ధమని ఉద్యోగ సంఘాల ఆందోళన

గుంటూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఇటీవల డిపోల్లో కండక్టర్‌ల వరుస సస్పెన్షన్‌లతో జిల్లాలోని ఆర్టీసీలో రగడ నెలకొంటోంది. స్త్రీ శక్తి పథకంతో రద్దీ నేపథ్యంలో మగ వారికీ జీరో టిక్కెట్లు జారీ చేయడంతో కండక్టర్లపై వరుసగా సస్పెన్షన్‌ల వేటు పడుతోంది. దీనిపై ఆర్టీసీలోని పలు ఉద్యోగ సంఘాల నాయకులు భగ్గు మంటున్నారు. ఇటువంటి వ్యవహారాల్లో పల్నాడు, బాపట్లతో పాటు ఇతర జిల్లాల్లో లేని సస్పెన్షన్‌లు ఇక్కడ అమలు చేయడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కొన్ని రోజులుగా నిరసనలు తెలిపిన సంఘాల నాయకులు.. డీపీటీవోకు విజ్ఞాపనపత్రాలు కూడా అందజేశారు. త్వరలో పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతున్నట్లు ఇటీవల ప్రకటించడంతో.. డిపో మేనేజర్లు వర్సెస్ ఉద్యోగ సంఘాల నాయకులుగా పరిస్థితి మారింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంతో.. పల్లె వెలుగు సర్వీసుల్లో మగవారు 20శాతం ఉంటే మహిళా ప్రయాణికులు 80శాతం ఉంటున్నారు. మహిళలకు జీరో టికెట్లు ఇచ్చే క్రమంలో మగ వారికి కూడా పొరపాటున కండక్టర్లు ఇచ్చేస్తున్నారు. టీటీఐ తనిఖీల్లో వీటిని పట్టుకొని కేసులు నమోదు చేస్తున్నారు.

డిపోల్లో వరుస సస్పెన్షన్‌లు

ఇలా మగ ప్రయాణికులకు ఉచిత టిక్కెట్లు ఇవ్వడంతో.. గుంటూరు-1 డిపోలో ఇద్దరిని, తెనాలి డిపోలో ఇద్దరిని, అత్యధికంగా గుంటూరు-2 డిపోలో నలుగురు కండక్టర్లను సస్పెండ్ చేస్తూ డిపో మేనేజర్లు ఆదేశాలు జారీ చేశారు. విధి నిర్వహణలో కండక్టర్లు పొరపాటుగా వ్యవహరించినా సస్పెన్షన్ చేయడంపై.. ఉద్యోగ సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఇది 1/2019 సర్క్యులర్ విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కండక్టర్లు కావాలని ఉచిత టికెట్లు మగవారికి ఇవ్వరని చెబుతున్నారు. అధికారులు నిబంధనలు పాటించాలని, విరుద్ధంగా వ్యవహరిస్తే ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరిస్తున్నారు.

గుర్తింపు కార్డులివ్వాల్సిందే

ఆర్టీసీలో ఉచిత ప్రయాణంపై మహిళలకు గుర్తింపు కార్డులిస్తే సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉంటాయని ఉద్యోగ సంఘాల నాయకులు కోరుతున్నారు. ఇటీవల మంగళగిరి డిపో పరిధిలో ఓ మహిళకు ఉచిత ప్రయాణ టికెట్ ఇవ్వడంపై టీటీఐ తనిఖీల్లో తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాకు చెందిన ఆధార్ కార్డు బయటపడింది. ఇలా అనేక పొరపాట్లు దొర్లుతున్నాయని, భవిష్యత్తులోనూ ఇబ్బందుల్లేకుండా గుర్తింపు కార్డులు జారీ చేస్తే బాగుంటుందని విజ్ఞప్తి చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వంలో సంతోషంగా ప్రజలు

పిడుగురాళ్ల నవంబర్ 23 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తోందని, రాష్ట్రంలో పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందడంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని.. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. ఆదివారం రాత్రి పిడుగురాళ్లలో తన నివాసానికి వర్ల రామయ్య ఆహ్వానించగా.. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు వెళ్లారు. ఈ సందర్భంగా వారిద్దరూ రాష్ట్రంలో అభివృద్ధి పథకాలు, ఇంటింటికి ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ, కూటమి ప్రభుత్వంపై ప్రజల అభిప్రాయంపై తదితర అంశాలపై చర్చించుకున్నారు.

బీసీలకు 52శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

● ఏఐ బీఎస్పీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ బి.పరంజ్యోతి

గుంటూరు(తూర్పు), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఆల్ ఇండియా బహుజన్ సమాజ్ పార్టీ(ఏఐ బీఎస్పీ)రాష్ట్ర కో-ఆర్డినేటర్ బి. పరంజ్యోతి పేర్కొన్నారు. పాతగుంటూరు, నాయీ బ్రాహ్మణ కల్యాణ మండపంలో ఆదివారం ఏఐబీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి పీవీ రమణయ్య అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పరంజ్యోతి మాట్లాడుతూ విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు తగు ప్రాధాన్యం కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేయాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే 52శాతం కల్పించేలా చట్టాలను మార్పు చేయాలన్నారు. బీసీ కులాల జేఏసీ నాయకుడు ఎల్ వెంకటేశ్వర్లు, బీసీ మహాజన సభ రాష్ట్ర అధ్యక్షుడు ఉగ్గం సాంబశివరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి లక్ష్మి, నారాయణ, ప్రకాష్, విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

నాగార్జున కొండపై పర్యాటకుల సందడి

● లాంచీ స్టేషన్ ఆదాయం రూ. 50 వేలు

విజయపురిసౌత్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండను ఆదివారం పర్యాటకులు భారీగా సందర్శించారు. నాగసిరి, శాంతిసిరి, అగస్త్య లాంచీలలో కొండకు చేరుకున్నారు. కొండపైన మ్యూజియంలోని బుద్ధుని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టి కుండలు సందర్శించారు. అనంతరం అనుపు, ఎత్తిపోతలను పర్యాటకులు వీక్షించారు. లాంచీల ద్వారా రూ.50 వేల ఆదాయం వచ్చిందని లాంచీ యూనిట్ మేనేజర్ మస్తాన్‌బాబు తెలిపారు.


నాగార్జున కొండను సందర్శించిన పర్యాటకులు

బాపట్ల తీరంలో..

బాపట్ల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : సూర్యలంక సముద్రతీరంలో ఆదివారం పర్యాటకులతో సందడిగా మారింది. పంజాబ్, ఛత్తీస్‌ఘడ్, రాజస్థాన్, బీహార్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పర్యాటకులు సూర్యలంక తీరానికి చేరుకుని సేదతీరారు. ఇక్కడ వాతావరణం కనుల విందుగా ఉందని.. ఏర్పాట్లు బాగున్నాయని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు.


సూర్యలంక తీరంలో పర్యాటకులు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	117, 124, 136
చికెన్ విత్ స్కిన్(కిలో)	222.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	232.00

పనుల నాణ్యతలో రాజీ పడొద్దు

● తూర్పు ఎమ్మెల్యే నసీర్
● మాయాబజార్‌లో సీసీ డ్రెయిన్ నిర్మాణాల పరిశీలన

గుంటూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులు వేగంగా పూర్తిచేయాలని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అధికారులను ఆదేశించారు. మాయాబజార్‌లోని జీటీ రోడ్డులో నిర్మాణంలో ఉన్న సీసీ డ్రెయిన్‌ను ఆదివారం ఆయన పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ, వర్షాలు కురిస్తే మాయాజజారు జీటీ రోడ్డులో వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేదని, ఇప్పుడు సీసీ డ్రెయిన్ నిర్మాణం పూర్తయితే ఆ సమస్య ఉండబోదని అన్నారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం చేపట్టామని, మారుమూల ప్రాంతాలను కూడా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. పనులు నిర్దిష్ట సమయంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే నసీర్ పేర్కొన్నారు.


సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నసీర్


సత్య సాయిబాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు, అధికారులు

సత్య సాయిబాబా చూపిన మార్గంలో నడవాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరుకార్పొరేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజలు శ్రీ సత్య సాయిబాబా చేసిన సేవలను స్మరించుకుంటూ, ఆయన చూపిన ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో సత్య సాయిబాబా జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీనివాసులు సత్య సాయిబాబా చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, సత్య సాయి బాబా వెనుకబడిన రాయల సీమ ప్రాంతంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని, ఎన్నో గ్రామాలకు తాగు నీటి సరఫరా, విద్య, వైద్య సేవలను అందించారని తెలియచేశారు. ప్రజలు ఆయన్ను స్ఫూర్తిగా తీసుకొని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని కమిషనర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్, సీఎంవోహెచ్ డాక్టర్ శాంతికళ, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, మేనేజర్ బాలాజీ బాషా, పీవో సింహాచలం, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, వేములు జ్యోతి పద్మజ, ఇర్రి ధనలక్ష్మి, సాదు రాజేష్, వివిధ విభాగాల సూపరిటెండెంట్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బహుజనులు రాజ్యాధికారమే లక్ష్యంగా పోరాడాలి

● బీసీవైపీ రాష్ట్రాధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్

గుంటూరుకార్పొరేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): దోపిడీ శక్తులను, రాష్ట్రానికి పట్టిన గ్రహణాలను వదిలించి, బహుజనులకు రాజ్యాధికారాన్ని అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని భారత చైతన్య యువజన పార్టీ (బీసీవైపీ) రాష్ట్ర అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ అన్నారు. అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో నిర్వహించిన యాదవ కార్తిక వన సమారాధనలో రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ, యాదవ సంఘం నిర్వహిస్తున్న సమారాధనకు వెళితే తాను ఒక వర్గానికి చెందిన వ్యక్తిననే ముద్ర పడుతుందని కొంత మంది తనతో అన్నారని చెప్పారు. అయితే సొంత వర్గానికి విలువ ఇవ్వాలని, లేదంటే ఇతర వర్గాలకు న్యాయం చేయలేమని వారికి తాను చెప్పినట్లు తెలియజేశారు. రాష్ట్రంలోని 80-85 శాతం మంది బహుజనులను ఓటు బ్యాంకు రాజకీయాలకు ఉపయోగించుకుంటూ, కేవలం ఉత్సవ విగ్రహాల్లాంటి పదవులను ఎర వేస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ చైర్మన్ బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, టీటీడీ సభ్యుడు జంగా కృష్ణమూర్తి యాదవ్, క్రాంతి కుమార్ యాదవ్, పేరయ్య, బాలయ్య యాదవ్, తాళ్ల నాగరాజు యాదవ్ పాల్గొన్నారు.


చేతులు పైకెత్తి ఐక్యత రాగం చాటిన యాదవ సంఘం నాయకులు

30న ఎస్ఎఫ్ఐ 50వ జిల్లా మహాసభలు

● రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.కిరణ్

గుంటూరు (విద్య), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా మహా సభలు ఈ నెల 30న నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.కిరణ్ వెల్లడించారు. ఆదివారం బ్రాడీపేటలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో కిరణ్ మాట్లాడుతూ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి మహాసభల్లో చర్చిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా విద్యార్థుల సమస్యలు పరిష్కారం కాలేదని, ఫీజు రీయింబర్స్‌మెంటును, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లలోని సమస్యలను పరిష్కరించాలని, మెస్ చార్జీలు పెంచాలని కోరారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన శాఖ మినహా అన్ని శాఖల పనులు చేస్తున్నారని, విద్యారంగాన్ని పూర్తిగా గాలికి వదిలేశారని ఆరోపించారు. యువగళం పాదయాత్రలో తాను ఇచ్చిన హామీల గురించి ఆలోచించడం లేదని అన్నారు. యూనివర్సిటీలలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, జూనియర్ డిగ్రీ కళాశాలల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ సమీర్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు యశ్వంత్, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష కార్యదర్శులు కిరణ్ దాసరి,సౌమ్య, నగర ఉపాధ్యక్షులు సుర్జిత్, నవీన్, నగర సహాయ కార్యదర్శి రాజ్, వెంకీ, కమిటీ సభ్యులు గోపి, జిష్ణు, లోకేష్, నసీర్, ఫరాన్ తదితర విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిరణ్ తదితరులు

ప్రజలకు సామాజిక చైతన్యం కల్పించాలి

● ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు దివితేజ మూర్తి సూచన

గుంటూరు(విద్య), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొని ప్రజల్ని చైతన్యవంతం చేయాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ దివితేజ మూర్తి సూచించారు. పలకలూరులో విజ్ఞాన్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా శిబిరాన్ని ఆయన ఆదివారం సందర్శించారు. వలంటీర్లు, అధ్యాపకులు ఆరోగ్య సంరక్షణ, స్వచ్ఛభారత్ తదితర అంశాలపై చర్చించారు. వ్యాధుల నియంత్రణ, పారిశుద్ధ్య అంశాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు సేమాజ అభివృద్ధికి సేవ చేయాలనే భావనను పెంపొందిస్తాయని ఆచార్య దివితేజమూర్తి అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సీహెచ్ అంకపనాయుడు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

పలు గూడ్స్ వాహనాలపై కేసులు నమోదు

గుంటూరు (తూర్పు), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఓవర్‌లోడ్‌తో తిరుగుతున్న గూడ్స్ వాహనాలపై ఆదివారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్టు డీటీసీ సీతారామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కొల్లిపర, రాజాధాని ఇతర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి మొత్తం 9 కేసులు నమోదు చేసి, రూ.4 లక్షల జరిమానాలు వసూలు చేసినట్లు చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 193 ఓవర్‌లోడ్ కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, గూడ్స్ వాహన యజమానులందరూ నియమాలను పాటించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పవన్‌కుమార్ తదితరులు

జీవన శైలి మార్పులతో సంపూర్ణ ఆరోగ్యం

● న్యూరాలజిస్టు డాక్టర్ పవన్‌కుమార్

గుంటూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొంత జీవనశైలి మార్పులతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని న్యూరాలజిస్టు డాక్టర్ చెరుకూరి పవన్‌కుమార్ తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఆరోగ్యసభలో ఆయన ప్రసంగించారు. అనారోగ్య సమస్యను నివారించుకోవటం కన్నా ఆరోగ్య జాగ్రత్తలు పాటిస్తే మంచిదని సూచించారు. శ్వాసకోశ సంబంధిత వ్యాధులు రాకుండా న్యూమోకోకల్ వ్యాక్సిన్‌ను ఒకసారి, సీజనల్ వ్యాధులు రాకుండా ఇన్‌ఫ్లూయేంజా వ్యాక్సిన్‌ను ముఖ్యంగా పెద్ద వయసు వారు ప్రతి ఏటా జూన్, జూలై మాసాల్లో తీసుకుంటే అనారోగ్య సమస్యలు రాకుండా ఉంటాయన్నారు. డీ3 విటమిన్ లోపం లేకుండా మందులు అందుబాటులో ఉన్నాయని, వారానికి ఒకసారి చొప్పున ఎనిమిది వారాలు తీసుకుంటే మంచిదన్నారు. ముఖ్యంగా పెద్ద వయసు వారు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సాయిరామ్, ఘనశ్యామాచార్యులు, చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు, ముప్పాళ్ళ ప్రసాదరావు పాల్గొన్నారు.

కండరాల సమస్యలకు ఫిజియోథెరపీతో చెక్..!

● ఫిజియోథెరపిస్ట్ షేక్ మస్తాన్‌వలి

గుంటూరు మెడికల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మధుమేహ బాధితుల్లో తరచుగా సంభవించే ఫ్రోజెన్ షోల్డర్ వంటి కండరాల సమస్యలకు ఫిజియోథెరపీ చక్కటి పరిష్కారమని ఫిజియోథెరపిస్ట్ షేక్ మస్తాన్‌వలి తెలిపారు. ఆదివారం బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌వో మీటింగ్ హాల్‌లో నిర్వహించిన ఫిజియోథెరపీ అవగాహన శిబిరంలో ఆయన మాట్లాడారు. ఐఎఫ్‌టీ, అల్ట్రా సౌండ్, ఎలక్ట్రో థెరపీ, హాట్ ప్యాక్ లాంటి ఫిజియోథెరపీ పద్ధతుల ద్వారా కండరాల నొప్పులను అధిగమించవచ్చని అన్నారు. మధుమేహ బాధితులు క్రమం తప్పకుండా మట్టి రోడ్డుపై నడక కొనసాగించాలని, సర్వైకల్ స్పాండిలైటిస్, నడుం నొప్పితో బాధపడేవారు బల్లపరుపుపై నిద్రించాలని, బరువులు ఎత్తకుండా ఉండాలని, ముందుకు వంగేటప్పుడు జాగ్రత్త వహించాలని ఆయన సూచించారు. పలు రకాల కండరాల సమస్యలకు తగినంత విశ్రాంతి అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో టి.ధనుంజయ రెడ్డి, పి.నిర్మలా రాణి, డాక్టర్ చల్లా చైతన్య, టీవీ సాయిరాం, చావా శివాజీ, మేకల రామారావు, శివప్రసాద్ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఫిజియోథెరపిస్ట్ మస్తాన్‌వలి

దంత వ్యాధులను నిర్లక్ష్యం చేయకండి

● డెంటిస్ట్ డాక్టర్ అప్పయ్య చౌదరి


గుంటూరు మెడికల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): దంత వ్యాధులను నిర్లక్ష్యం చేయకుండా వైద్య నిపుణులను కలిసి తగిన చికిత్సలు పొందాలని అపోలో డెంటల్ కేర్ యూనిట్ వైద్యనిపుణులు అప్పయ్య చౌదరి తెలిపారు. ఆదివారం అపోలో డెంటల్ ఆధ్వర్యంలో తురకపాలెంలో నిర్వహించిన ఉచిత దంత వైద్యశిబిరంలో ఆయన మాట్లాడారు. ఈహెచ్ఎస్ కార్డు ఉన్న వారికి గుంటూరు లక్ష్మీపురంలో, ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్2లో గల తమ అపోలో దంత వైద్యశాలల్లో అత్యుత్తమ దంత వైద్యసేవలు ఉచితంగా లభిస్తాయని తెలిపారు. కట్టుడు పళ్లు, ఫిక్స్‌డ్ డెంచర్స్‌తో పాటు అన్ని రకాల ఆధునిక దంత వైద్యచికిత్సలు అపోలోలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అనంతరం ఉచిత వైద్య శిబిరంలో పలువురికి దంత వైద్య పరీక్షలు నిర్వహించి వైద్య సలహాలు అందజేశారు.



దంత పరీక్షలు చేస్తున్న డాక్టర్ అప్పయ్య చౌదరి

అలరించిన వయోలిన్ కచేరి

గుంటూరు (తూర్పు), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేట త్యాగరాజ కళావేదికలో ఆదివారం నాగార్జున సాంస్కృతి కేంద్రం, నాగార్జున స్కూల్ ఆఫ్ మ్యూజిక్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వయోలిన్, కీబోర్డ్, వీణ గాత్ర కచేరీలు ఆకట్టుకున్నాయి. పెరవల్లి నందకుమార్ ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన వయోలిన్ కచేరి ఆకట్టుకుంది. వారికి మృదంగంపై శాస్త్రి, వయోలిన్‌పై రాజ్యలక్ష్మి వాయిద్య సహకారం అందించారు. ప్రముఖ వైద్యుడు కె.సూర్యనారాయణ ఈ కార్యక్రమాలనకు అధ్యక్షత వహించారు. నిర్వాహకులు ఎంఎస్ శ్రీధర్, మూర్తి, శ్రీనివాస్ చిన్నారులను ఘనంగా సత్కరించారు.


వయోలిన్ వాయిస్తున్న చిన్నారులు

విద్యార్థులకు ఉచితంగా పుస్తకాల పంపిణీ

గుంటూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏటుకూరు రోడ్డులోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం వాసవీ మిత్ర మండలి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకుడు కొనకళ్ళ సత్యం మాట్లాడుతూ, వాసవీ మిత్ర మండలి సేవలను మరింత విస్తృతం చేయాలని అన్నారు. సహాయం పొందిన విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకొని సమాజానికి సాయపడాలని కోరారు. మిత్ర మండలి అధ్యక్షుడు అన్నా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ, 23 ఏళ్ళుగా ఈ సేవలు చేస్తున్నామని భవిష్యత్తులోనూ కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో మిత్ర మండలి సభ్యులు కూనిశెట్టి చంద్రశేఖరరావు, త్రిపురమల్లు అశోక్‌కుమార్ తదితరులున్నారు.


పుస్తకాలు పంపిణీ చేస్తున్న సత్యం, పూర్ణచంద్రరావు తదితరులు

వెల్ఫేర్ సెంటర్ స్థలాన్ని అభివృద్ధి చేయాలి

గుంటూరు (తూర్పు), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాకుమానువారి తోటలోని కార్మిక శాఖకు చెందిన సుమారు 14.80 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని అభివృద్ధి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోటా మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఆదివారం ఆ స్థలం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ, స్థలాన్ని అభివృద్ధి చేయాలని ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లిన ఫలితం లేకుండా పోయిందన్నారు. సెంటర్‌లో గ్రంథాలయం, స్విమ్మింగ్ పూల్, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అకిటి అరుణ్‌కుమార్, షేక్ వలి, రాగం నాగరాజు, కల్లూరి తిరుపతయ్య, మేడసాని కేశవ, కొండలు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

పేకాట స్థావరంపై దాడి

వట్టిచెరుకూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చింతపల్లిపాడు గ్రామ వెలుపల రేకుల షెడ్డులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై స్పెషల్ టాస్క్ ఫోర్సు సిబ్బంది దాడులు నిర్వహించారు. ఎస్బీ సిఐ-1 సూచనలు, వట్టిచెరుకూరు సీఐ రమానాయక్ ఆదేశాల మేరకు పేకాట ఆడుతున్న ఐదుగురిని ఆదుపులోకి తీసుకుని, రూ. 33,720, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్టు సీఐ రమానాయక్ తెలిపారు.

ముగిసిన వైద్యురాలి అంత్యక్రియలు


కాకు రోహిణి (ఫైల్)

గుంటూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకున్న వైద్యురాలి అంత్యక్రియలు ఆదివారం గుంటూరులో ముగిశాయి. గుంటూరు వెంకటరావుపేటకు చెందిన వైద్యురాలు కాకు రోహిణి కజకిస్థాన్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. అమెరికాలో పీజీ చేయాలనే సంకల్పంతో అందుకు అవసరమైన పరీక్షలను పట్టుదలతో చదివి 96 శాతం స్కోర్ చేసి అక్కడ పీజీ చేసేందుకు అర్హత సాధించారు. దీనికి సంబంధించిన ప్రక్రియ అంతా పూర్తి చేసుకుని వీసాకు దరఖాస్తు చేసుకునే సమయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్1, ఏ1 వీసాల విషయంలో నిబంధనలు విధించారు. అయితే అందుకు సంబంధించిన డాక్యుమెంట్స్‌ను రోహిణి సమయానికి అందజేయలేకపోయారు. దాంతో ఆమె వీసా రిజెక్ట్ అయింది. ఇన్నేళ్లు కష్టపడి చదివి యూఎస్‌లో పీజీ చేయాలనే ఆశయం నెరవేరకపోవడంతో డాక్టర్ రోహిణి తీవ్ర మనస్తాపానికి గురై హైదరాబాదులోని తన నివాసంలో నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. డాక్టర్ రోహిణి భౌతికకాయాన్ని గుంటూరు తీసుకొచ్చి ఆదివారం అంత్యక్రియలు పూర్తి చేశారు. ఆమె మృతితో కుటుంబసభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

మీడియా ప్రతినిధి అరుణ్ కోసం గాలింపు

గుంటూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తన కారును అనుచరులతో పగలగొట్టించుకొని ఆ నెపం తుళ్ళూరు-2 సీఐ మాతంగి శ్రీనివాసరావుపై మోపిన కేసులో నిందితుడైన మీడియా ప్రతినిధి కన్నెగంటి అరుణ్ బాబు కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు. మూడు ప్రత్యేక బృందాలు తెలుగు రాష్ట్రాల్లో అరుణ్ కోసం వేట సాగిస్తున్నాయి. అయితే అరుణ్ రెండు రోజులకో సిమ్ కార్డును మారుస్తూ, రెండు రోజులకో కొత్త ప్రదేశానికి వెళుతూ పోలీసులకు ఎటువంటి ఆధారం లభించకుండా తెలివిగా తప్పించుకు తిరుగుతున్నాడు. మరోవైపు తనపై నమోదైన కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ హైకోర్టును ఆశ్రయించగా అతనిపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో నోటీసులు జారీ చేయాలని హైకోర్టు ఆదేశించింది. అరుణ్ బాబుతో పాటు మరో ముగ్గురు ఆ కేసులో నిందితులుగా ఉండగా వారికీ నోటీసులు ఇవ్వాలని పేర్కొంది. కాగా, అరుణ్ ఉపయోగించే స్కార్పియో వాహనాన్ని రెండు రోజుల క్రితం పోలీసులు అనంతపురంలో స్వాధీనం చేసుకొని గుంటూరు తీసుకొచ్చారు.



అనంతపురంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న స్కార్పియో వాహనం

పశ్చిమ డెల్టాకు 3,712 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకు 3,712 క్యూసెక్కుల నీటిని ఆదివారం విడుదల చేస్తున్నట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 12 అడుగుల నీటిమట్టం ఉంది. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ చానల్‌కు 212 క్యూసెక్కులు, రేపల్లెకాల్వకు 316 క్యూసెక్కులు, తూర్పుకాల్వకు 112 క్యూసెక్కులు, నిజాంపట్నంకాల్వకు 85 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 2200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

డిసెంబరు 10న సీపీఎస్ ఉద్యోగుల ఆత్మగౌరవ సభ

గుంటూరు(తూర్పు), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరణ చేయాలని కోరుతూ డిసెంబరు 10వ తేదిన కలెక్టరేట్ ఎదుట సీపీఎస్ ఉద్యోగుల ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నట్టు ఏపీ సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమల రెడ్డి తెలిపారు. స్థానిక ఎన్జీవో కల్యాణ మండపంలో ఏపీఎన్జీజీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగూర్ షరీఫ్‌తో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. తిరుమలరెడ్డి మాట్లాడుతూ, ఎన్నికలో ప్రచారంలో భాగంగా సీపీఎస్ రద్దు చేస్తామని నారా లోకేశ్, పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీలను ఇంత వరకు నెరవేర్చలేదని గుర్తుచేసుకున్నారు. ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, సీపీఎస్ రద్దు చేసి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 3.5 లక్షల ఉద్యోగుల్లో కుటుంబాల్లో వెలుగులు నింపాలని కోరారు. ఈ కార్యక్రమంలో దయనంద కుమార్, వెంకట్, విజయ్, నరసింహారెడ్డి, ప్రదీప్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏపీ సీపీఎస్ ఉద్యోగులు

సమాజ చైతన్యంలో కవులు, కళాకారుల పాత్ర కీలకం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు (తూర్పు), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సమాజ చైతన్యంలో కవులు, కళాకారులు కీలక పాత్ర పోషిస్తారని నగర తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహమ్మద్ అన్నారు. స్థానిక అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన భారతి సాంస్కృతిక సంగీత కళా వేదిక, సేవ సదన్ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పేద, ప్రతిభ కల్గిన కళాకారులను వెలుగులోకి తీసుకొచ్చేందుకు గత పదేళ్లుగా భారతి సాంస్కృతిక సంగీత కళా వేదిక చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. సామాజిక సేవల్లో ముందున్న సేవా సదన్ మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. అనంతరం మిరియాల ప్రసాదరావు, మిరియాల గోపిని ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, బండ్లమూడి గాంధీ, మేకల రవీంద్రబాబు, డేగల వెంకటేశ్వరరావు, రాజశేఖర్ ఆచారి, ఏపీ పాఠశాల విద్యాశాఖ అదనపు డైరెక్టర్ రాసం శెట్టి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.


మిరియాల ప్రసాదరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే నసీర్

నిరసనలను జయప్రదం చేయండి

గుంటూరు (తూర్పు), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల పోరాటాలతో సంపాదించుకున్న హక్కులను రద్దు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం విధానాలకు వ్యతిరేఖంగా ఈనెల 26న తలపెట్టిన నిరసనలను జయప్రదం చేయాలని కార్మిక, ప్రజా సంఘాలు పిలుపునిచ్చాయి. కొత్తపేట సీపీఐ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో సంఘాల నేతలు మాట్లాడుతూ, కార్మిక చట్టాల రద్దు, ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణను పూర్తిగా ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్థానిక హిమని సెంటర్ వద్ద నిర్వహించే ధర్నాలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మేడా హనుమంతరావు, పచ్చల శివాజీ, కోట మాల్యాద్రి, ఆకిటి అరుణ్ కుమార్, కూరపాటి కోటయ్య, పివి జగన్నాథం, పుప్పాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో పాల్గొన్న కార్మిక, రైతు సంఘాల నాయకులు

కోర్ ప్లస్ ఉంటేనే కొలువు

క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్



క్యాంపస్ నియామకాలు జోరందుకుంటున్నాయి. ఆకర్షణీయమైన వేతనాలతో విద్యార్థులు ఆఫర్లు అందుకుంటున్నట్టు వార్తలు వినవస్తున్నాయి. తొలగింపులే కాదు, ఈ ఏడాది నియామకాలు కూడా ఉంటాయని మెగా ఐటీ కంపెనీలు ప్రకటిస్తున్నాయి. ఈ నేపథ్యంలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్‌కు సంబంధించి ఇప్పుడు కొనసాగుతున్న ట్రెండ్స్‌ను పరిశీలిస్తే, అకడమిక మెరిట్‌కు తోడు ఇతర నైపుణ్యాల విషయంలో హైరింగ్ కంపెనీలు, అభ్యర్థిని సమగ్రంగా జల్లెడ పడుతున్నాయి. వాటి లోతుల్లోకి వెళితే.....

చదివిన కోర్సులో సాధించిన సీజీపీఏకు మించి విద్యార్థి ఏమి చేయగలడని హైరింగ్ కంపెనీలు చూస్తున్నాయి. కోర్సులో భాగంగా చేపట్టిన ప్రాజెక్టులు, సాధించిన వ్యక్తిగత నైపుణ్యాలకు ఇతోధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి.

- సాంకేతికంగా పురోగమిస్తున్న ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, క్లౌడ్ వంటి వాటిని త్వరితగతిన నేర్చుకునే సామర్థ్యం అభ్యర్థికి ఉండాలి.
- బట్టీపట్టి నేర్చుకోవడం కాదు, ప్రాబ్లెమ్ సాల్వింగ్, క్రిటికల్ థింకింగ్ సామర్థ్యాలు ఉండాలి. క్లిష్టమైన పరిస్థితిని విశ్లేషించి తార్కికంగా ఒక పరిష్కారాన్ని కనుగొనగలగాలి.
- కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్ ఉండాలి. ఆలోచనలో స్పష్టత, బృందాల్లో పనిచేయగలిగే చొరవ, సాంకేతిక కర్తవ్య నిర్వహణలోనూ తిరుగులేని వృత్తి నైపుణ్యం తప్పనిసరి.
- సానుకూల ధోరణికి తోడు శిక్షణతో నేర్చుకునే తత్వం ఉన్న అభ్యర్థులకు కంపెనీలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. సానుకూల, క్రియాశీల, సహకార ధోరణి గల అభ్యర్థుల కోసం కంపెనీలు ఎదురుచూస్తున్నాయి.

సన్నద్ధతలో భాగంగా

క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో ప్లేస్‌మెంట్ కోరుకునే అభ్యర్థి ఈ రోజుల్లో ముఖ్యంగా కోర్సు కాలవ్యవధినిబట్టి రెండో లేదంటే మూడో ఏడాదిలోనే సన్నద్ధం కావాలి. అందుకోసం...

- మొదటి రెండేళ్లలో కనీసం 7.5 శాతం సీజీపీఏ సాధించి ఉండాలి. టాప్ కంపెనీలైతే 8.5కు మించి సీజీపీఏను కోరుకుంటున్నాయి. దీనికి తోడు చేయాలనుకుంటున్న వృత్తి - సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, డేటాసైన్స్, కోర్ ఇంజనీరింగ్, ఫైనాన్స్, మార్కెటింగ్‌ను బట్టి సంబంధిత ఆన్‌లైన్ కోర్సులు చేయాలి. లేదంటే కనీసం లోతుగా తెలుసుకుని ఉండాలి.
- ఐటీ లేదంటే ఐటీ ఎనేబుల్డ్ సర్వీసులైతే ప్రోగ్రామింగ్ లాంగ్వేజీలకు తోడు డేటా స్ట్రక్చర్స్ అండ్ అల్గోరిథమ్స్ తెలుసుకోవాలి. కోర్ బ్రాంచీలకు సంబంధిత సాఫ్ట్‌వేర్ టూల్స్(ఆటోకాడ్, ఎంఏటీల్యాబ్ వంటివి) తెలుసుకోవాలి. కాలేజీలో ఉండే వివిధ క్లబ్బుల్లో చేరి నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి.



టీ ఆకృతి - ప్రొఫెషనల్స్‌ను కంపెనీలు కోరుకుంటున్నాయి. అంటే అడ్డంగా ఒకటి, నిలువుగా మరొకటి గీతలతో టి అక్షరం ఏర్పడుతుంది. ఇక్కడ అడ్డంగా - కోర్ ఏరియాలో - తను చదువుకున్న సబ్జెక్టులో విద్యార్థికి ఉన్న పరిజ్ఞానం. నిలువుగా అంటే మిగిలినవైన కమ్యూనికేషన్, ప్రాబ్లెమ్ సాల్వింగ్, బిజినెస్‌పై అవగాహన వంటివి వస్తాయి.

- చివరి సంవత్సరాల్లో సాంకేతికంగా లోతైన పరిజ్ఞానాన్ని సముపార్జించాలి. టెక్నికల్ ప్లేస్‌మెంట్స్ కోసం లీట్‌కోడ్, గీక్స్‌ఫర్‌గీక్స్, హ్యాకర్‌ర్యాంక్, కోడ్‌చెఫ్ వంటి ప్లాట్‌ఫారాలపై ప్రాక్టీస్ చేయాలి. 250 నుంచి 400 వరకు నాణ్యమైన ప్రాబ్లెమ్స్‌ను సాల్వ్ చేయగలగాలి.
- ఐటీయేతర సబ్జెక్టులైతే కోర్ సబ్జెక్టుపై పట్టుకు తోడు ప్రాక్టికల్ ప్రాబ్లెమ్స్‌ను సాల్వ్ చేసి ఉండాలి. కేస్ స్టడీస్‌ని చేపట్టాలి. ప్రత్యేకత అంటే వెబ్ డెవలప్‌మెంట్ కోసం ఎంఈఆర్ఎన్ లేదా పైథాన్ లైబ్రరీలతో ఎంఎల్/ఏఐ లేదా ఆండ్రాయిడ్/ ఐఓఎస్ డెవలప్‌మెంట్ తెలుసుకోవాలి.
- కాలేజీ అసైన్‌మెంట్లు, టెక్నికల్ ప్రాజెక్టులు, రియల్ వరల్డ్ ప్రాబ్లమ్ సాల్వింగ్, టెక్నికల్ బ్లాగ్ రూపకల్పన, గిట్‌హబ్ ఉపయోగించి టెక్నికల్ రెజ్యూమె రూపకల్పన తప్పనిసరి.
- కమ్యూనికేషన్ స్కిల్స్, పబ్లిక్ స్పీకింగ్, బిజినెస్ ఈమెయిల్ రైటింగ్, సొంత ఆలోచనలను స్పష్టంగా తెలియజేయగలగడం తప్పనిసరి. అడ్జాసెంట్ స్కిల్స్ అంటే ఉదాహరణకు మెకానికల్ ఇంజనీర్‌కు 3డి ప్రింటింగ్, డిజైన్ సాఫ్ట్‌వేర్ తెలియాలి.
- రెజ్యూమేను కస్టమైజ్ చేసుకోగలగాలి. ఉదాహరణకు ఎస్‌డీఈ అలాగే డేటా అనలిస్ట్ రెజ్యూమేలకు మధ్య తేడా ఉండాలి. ప్రతి పాయింట్‌కు స్టార్ మెథడ్‌ను అవలంబించాలి.
- ప్రామాణిక పుస్తకాలను ఉపయోగించుకుని క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, వెర్బల్ ఎబిలిటీపై పట్టు సాధించాలి. దాదాపుగా ప్రతి కంపెనీ వీటిపై ఒక టెస్ట్‌ను ఖాయంగా పెడుతోంది.
- హాజరవుతున్న కంపెనీ సమాచారాన్ని బేసిక్స్ నుంచి మరింత లోతుగా తెలుసుకుంటే ప్రయోజనకరం. ఒక కంపెనీలో చేరాలనుకుంటూ దాని గురించి తెలియకపోవడం మంచిది కాదు. కనీస అవగాహన ఉండితీరాలి.
- మాక్ ఇంటర్వ్యూలకు హాజరుకావడం తప్పని సరి. హెచ్ఆర్ రౌండ్‌లో తమగురించి కనీసం ఒకటి నుంచి రెండు నిమిషాలు తడుముకోకుండా చెప్పుకోవాలి. బలాలు, బలహీనతలు, అయిదేళ్ళ తరవాత తమను తాము ఎలా చూసుకోవాలని అనుకుంటున్నారు వంటి వాటిపై పక్కాగా సన్నద్ధం కావాలి.
- ఇప్పటి మార్కెట్ అవసరాల విషయానికి వస్తే ఏఐ, ఎంఎల్ సంబంధిత పరిజ్ఞానం, లోతైన అవగాహన తప్పనిసరి. డేటా అనలిటిక్స్ కూడా తెలిసి ఉంటే మరింత ప్రయోజనకరం. క్లౌడ్ కంప్యూటింగ్ బేసిక్స్ తెలియాలి. ఏడబ్ల్యూఎస్, అజ్యూర్ లేదా గూగుల్ క్లౌడ్ తెలిసి ఉండాలి.
- గిగ్ మైండ్ సెట్ అంటే ఇంటర్న్‌షిప్‌నకు సన్నద్ధంగా ఉండాలి. ప్రాజెక్ట్ బేస్డ్, ఫ్రీలాన్స్‌కు రెడీగా ఉండాలి. రెజ్యూమే, నెట్‌వర్క్‌ను సొంతంగా నిర్మించుకోవాలి.
- చివరాఖరుగా ఒక్క విషయం, చదువుతున్న కోర్సులో అత్యధిక మార్కుల సాధించిన విద్యార్థులు ఈ రోజు ప్లేస్‌మెంట్స్‌లో పెద్దగా రాణించడం లేదు. సమస్యలను ఊహించి పరిష్కరించగలిగే సత్తాకు తోడు కోర్ డొమైన్‌లో పటిష్ఠమైన పునాది, ప్రాక్టికల్ ప్రాజెక్టుల్లో అనుభవం, తమ ఆలోచనలను స్పష్టంగా చెప్పగలిగే చాకచక్యం, బృందంలో పనిచేయగలిగే చొరవ ఉన్న వారికే అవకాశాలు లభిస్తున్నాయి. రెజ్యూమేకు బదులు పటిష్ఠమైన ప్రొఫైల్‌ను సొంతంగా రూపొందించుకోగలిగే వారికి ఎదురు ఉండదని గట్టిగా చెప్పవచ్చు.



ప్రొఫెసర్ ఎన్.వి. రమణారావు
డైరెక్టర్, ఎన్ఐటీ రాయపూర్

దిక్సూచి

బ్యాంక్ ఆఫ్ బరోడా

బ్యాంక్ ఆఫ్ బరోడాకు చెందిన బ్రాంచీల్లో 2700 గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ఖాళీలు ఉన్నాయి. ఏపీలో 38, తెలంగాణలో 154 ఖాళీలు కూడా వాటిలో కలిపి ఉన్నాయి.
అర్హత: డిగ్రీ ఉత్తీర్ణత
ఎంపిక: ఆన్‌లైన్‌లో పరీక్ష, లోకల్ లాంగ్వేజ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా.
ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 1
వెబ్‌సైట్: portal https://nats.education.gov.in (Navigate to the "Student Register/Login" section) and NAPS portal https://www.apprenticeshipindia.gov.in

జనరల్ ఇన్సూరెన్స్

జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఇండియా 20 యాక్చూరియల్ అప్రెంటిస్‌ల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: కనీసం 60 శాతం మార్కులతో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యాక్చూరీస్ ఆఫ్ ఇండియా లేదా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాకల్టీ ఆఫ్ యాక్చూరీస్ నిర్వహించే పరీక్షలో కనీసం రెండు యాక్చూరియల్ సబ్జెక్టులు పాసై ఉండాలి.
స్టయిపెండ్: మొదటి ఏడాది నెలకు రూ.40,000, రెండో ఏడాది నెలకు రూ.45.00 చెల్లిస్తారు. (కనీసం ఏడు యాక్చూరియల్ సబ్జెక్టులు పాసైతే రెగ్యులర్ ప్రాతిపదికన అసిస్టెంట్ మేనేజర్‌గా తీసుకుని రెగ్యులర్ స్కేల్, ఇతర అలవెన్స్‌లు చెల్లిస్తారు.)
ఎంపిక: గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు: ఈ మెయిల్ RecruitmentAA@gicre.in ద్వారా
ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబర్ 7
వెబ్‌సైట్: www.gicre.in/images/2025/ Detailed_Advertisement.pdf

మిథానీ

హైదరాబాద్ - కంచన్‌బాగ్‌లోని మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ 30, టెక్నీషియన్ డిప్లొమా అప్రెంటిస్ 20, ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్ 160 ఖాళీలు ఉన్నాయి.
అర్హత: పోస్టునుబట్టి సంబంధిత విభాగం/ ట్రేడ్‌లో డిప్లొమా/ గ్రాడ్యుయేట్/ ఐటీఐ ఉత్తీర్ణత
ఎంపిక: విద్యార్హతలో పొందిన మార్కులు, ధ్రువపత్రాల పరిశీలన, వైద్యపరీక్షల ఆధారంగా
దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 10
వెబ్‌సైట్: https://nats.education.gov.in

అప్రెంటిస్‌షిప్

సౌత్ ఈస్ట్రన్ రైల్వే



కోల్‌కతాలోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ) - సౌత్ ఈస్ట్రన్ రైల్వే పరిధిలో యాక్ట్ అప్రెంటిస్ శిక్షణ కోసం దరఖాస్తులు కోరుతోంది.
పోస్టులు: 1785(ట్రేడులు: ఫిట్టర్ వెల్డర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, పెయింటర్, మెషినిస్ట్, టర్నర్, మెకానికల్ డీజిల్, ట్రిమ్మర్, ఎంఎంటీఎం, ఫోర్జర్ అండ్ హీట్ ట్రీటర్, రిఫ్రిజిరేటర్ అండ్ ఏసీ మెకానిక్, లైనమన్ వంటివి)
వయస్సు: వచ్చే ఏడాది జనవరి 1 నాటికి 15-24 సంవత్సరాల మధ్య వయస్కులై ఉండాలి.
ఎంపిక: టెన్త్, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామ్ ఆధారంగా
ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 17
వెబ్‌సైట్: www.rrcser.co.in.

నార్తరన్ రైల్వే

ఢిల్లీలోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ) - నార్తరన్ రైల్వే పరిధిలో యాక్ట్ అప్రెంటిస్ శిక్షణ కోసం దరఖాస్తులు కోరుతోంది.
పోస్టులు: 4116(ట్రేడులు: ఫిట్టర్ వెల్డర్, ఎలక్ట్రీషియన్, పెయింటర్(జనరల్)/ కార్పెంటర్ మెషినిస్ట్, టర్నర్, మెకానికల్ డీజిల్/మోటార్ వెహికల్, ట్రిమ్మర్, రిఫ్రిజిరేటర్ అండ్ ఏసీ మెకానిక్, ఎలక్ట్రీషియన్/వైర్‌మన్ వంటివి)
వయస్సు: డిసెంబర్ 24 నాటికి 15-24 సంవత్సరాల మధ్య వయస్కులై ఉండాలి.
ఎంపిక: టెన్త్, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామ్ ఆధారంగా
ఆఖరు తేదీ: నవంబర్ 25 నుంచి డిసెంబర్ 24
వెబ్‌సైట్: www.rrcsnr.co.in.

రైట్స్ లిమిటెడ్

గుర్‌గావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్(రైట్స్)లో గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ 146, డిప్లొమా అప్రెంటిస్ 49, ట్రేడ్ అప్రెంటిస్(ఐటీఐ) 57 మొత్తం 252 ఖాళీలు ఉన్నాయి.
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ/ డిప్లొమా/ బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.
ఎంపిక: విద్యార్హతల్లో సాధించిన మెరిట్ ఆధారంగా
ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబర్ 5
వెబ్‌సైట్: https://nats.education.gov.in/ student_type.php; for ITI pass candidates www.apprenticeshipindia.gov.in

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను 'అఖండ 2: తాండవం' చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఆదివారం బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను, నటి సంయుక్త, నిర్మాతలు ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ ఆదిత్యనాథ్‌కి అఖండ త్రిశూలాన్ని బహూకరించారు.

'రెబల్ సాబ్' వచ్చేశాడు



ప్రభాస్ కథానాయకుడిగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న హారర్ కామెడీ 'ది రాజా సాబ్'. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ది కుమార్ కథానాయికలు. బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ కీలకపాత్రలో కనిపించనున్నారు. పీపుల్ మీడియా బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, టీజీ కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం నుంచి 'రెబల్ సాబ్...రెబల్ సాబ్.. రొమాంటిక్ రెబల్ సాబ్... వస్తున్నాడు, స్టెప్ ఎ సైడ్..స్టెప్ ఎ సైడ్' అంటూ సాగే మొదటి పాటను ఆదివారం నిర్వహించిన వేడుకలో మేకర్స్ ఆవిష్కరించారు. తమన్ కంపోజ్ చేసిన ఈ పాటలో ప్రభాస్ స్టైలిష్ స్టెప్పులతో అదరగొట్టారు. ఈ సందర్భంగా దర్శకుడు మారుతి మాట్లాడుతూ 'ప్రేక్షకుల కోసమే ప్రభాస్ గారు 12 ఏళ్ల తర్వాత ఇలాంటి పాటలో నటించారు. ముగ్గురు హీరోయిన్లు, ప్రభాస్ గారి నటన, వారి మధ్య కెమిస్ట్రీ స్ర్కీన్‌పైనే చూడాలి' అని అన్నారు. నిర్మాత టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ 'జనవరి 9న సినిమా వస్తుందా అనే సందేహాలు కొందరిలో ఉన్నాయి. కచ్చితంగా అదే తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతున్నాం' అని చెప్పారు.

నిరీక్షణ ముగిసింది.. పట్టాలెక్కిన స్పిరిట్!



ప్రభాస్ కథానాయకుడిగా 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' చిత్రాల దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించనున్న 'స్పిరిట్' ఎప్పుడెప్పుడు మొదలవుతుందా అని అభిమానులు ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే. వారి నిరీక్షణకు తెరదించుతూ ఆదివారం ఈ చిత్రాన్ని ఘనంగా ప్రారంభించారు. ముహూర్తపు వేడుకకు మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టీ సిరీస్ ఫిల్మ్స్, భద్రకాళి పిక్చర్స్ బేనర్లపై భూషణ్‌కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా, క్రిషన్ కుమార్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో శక్తిమంతమైన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు ప్రభాస్. త్రిప్తీ దిమ్రీ కథానాయిక. ప్రకాశ్‌రాజ్, వివేక్ ఒబెరాయ్, కాంచన కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తొమ్మిది భాషల్లో ఈ భారీ యాక్షన్ ఎంటర్టైనర్ విడుదల కానుంది. ఎలాంటి విజువల్స్ లేకుండా ప్రభాస్ పుట్టినరోజున విడుదల చేసిన సౌండ్ స్టోరీ' ఆడియో టీజర్ సినిమాలపై అంచనాలను రెట్టింపు చేసిన విషయం తెలిసిందే.



పుట్టిన రోజు బహుమతి

చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'మన శంకర వరప్రసాద్ గారు' అనే చిత్రం తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ఆదివారం అనిల్ రావిపూడి పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఆయనకు అందమైన వాచ్‌ను బహుమతిగా ఇచ్చి సర్‌ప్రైజ్ చేశారు మెగాస్టార్. అనంతరం కేక్ కట్ చేసి బర్త్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

'గోదారి గట్టుపైన' తొలి గీతం



సుమంత్ ప్రభాస్, నిధి ప్రదీప్ జంటగా సుభాష్ చంద్ర తెరకెక్కిస్తోన్న చిత్రం 'గోదారి గట్టుపైన'. జగపతి బాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ బేనర్‌పై అభినవ్ రావు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి 'చూడు చూడు..' అంటూ సాగే తొలి గీతాన్ని మేకర్స్ ఆవిష్కరించారు. దినేశ్ కాకర్ల రాసిన పాటను హరి చరణ్ ఆలపించారు. నాగ వంశీ కృష్ణ స్వరాలు సమకూర్చారు. మంచి ప్రేమ కథతో పాటు వాణిజ్య హంగులతో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి సాయి సంతోష్ సినిమాటోగ్రాఫర్‌గా, అనిల్ కుమార్ పి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు.



కార్యసాధకుడిగా నాగచైతన్య

అక్కినేని నాగచైతన్య కథానాయకుడిగా 'విరూపాక్ష' ఫేమ్ కార్తిక్ వర్మ దండు ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఆదివారం నాగచైతన్య పుట్టినరోజు. ఈ సందర్భంగా ఈ చిత్రం టైటిల్‌ను, ఫస్ట్‌లుక్‌ను హీరో మహేశ్‌బాబు సోషల్‌మీడియా ద్వారా విడుదల చేశారు. ఈ సినిమా టైటిల్ 'వృషకర్మ'. అంటే కార్యసాధకుడు అని అర్థం. ఇందులో నిధిని అన్వేషించే సాహసికుడిగా శక్తిమంతమైన పాత్రను పోషిస్తున్నారు నాగచైతన్య. మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్నారు. శ్రీ వేంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్ బేనర్లపై బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. బాపినీడు సమర్పిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటింగ్: నవీన్ నూలి, సంగీతం: అజనీశ్ లోక్‌నాథ్.

నేను గర్వపడే చిత్రమిది

రామ్ పోతినేని



'నా కెరీర్‌లో గర్వపడే సినిమా 'ఆంధ్ర కింగ్ తాలూకా'. ఉపేంద్ర గారితో కలసి పనిచేయడం గౌరవంగా భావిస్తున్నా' అని అన్నారు రామ్ పోతినేని. ఆయన కథానాయకుడిగా మహేశ్ బాబు పి తెరకెక్కించిన చిత్రమిది. మైత్రీ మూవీ మేకర్స్ బేనర్‌పై నవీన్ యెర్నేని, వై.రవి శంకర్ నిర్మించారు. సినిమా ఈనెల 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ వైజాగ్‌లో మ్యూజిక్ కాన్సర్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపేంద్ర మాట్లాడుతూ 'ఈ సినిమాను చూసిన ప్రతి ఒక్కరు థియేటర్ల నుంచి కాలర్ ఎగరేసుకుంటూ బయటికి వస్తారు. మహేశ్ బాబు గారు సినిమాని అంత అద్భుతంగా తీశారు' అని అన్నారు. 'నవంబరు 27న మీరందరూ సినిమాని థియేటర్లలో తప్పకుండా చూడాలి' అని కథానాయిక భాగ్యశ్రీ బోర్సే కోరారు. ఆంధ్రప్రదేశ్ హోం మినిస్టర్ వంగలపూడి అనిత మాట్లాడుతూ ' 'ఆంధ్ర కింగ్ తాలూకా' టైటిల్ వినగానే చాలా కనెక్ట్ అయ్యాను. వైజాగ్ సముద్ర తీరంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు. దర్శకుడు మహేశ్ బాబు మాట్లాడుతూ 'ప్రపంచంలో ఎవర్నో ఒకర్ని అభిమానించకుండా ఎవరూ ఉండరు. జీవితంలో ఉండే అన్ని రకాల భావోద్వేగాలను ఒక అభిమాని కోణంలో చూపించే ప్రయత్నం చేశాం' అని చెప్పారు. నిర్మాత రవి శంకర్ మాట్లాడుతూ 'స్టార్ ఫ్యాన్స్ అందరిని కలిపిన చిత్రమిది. అద్భుతంగా ఉంటుంది. అందరూ తప్పకుండా చూడాలి' అని కోరారు.

థియేటర్లలోకి జనతాబార్



కథానాయిక రాయ్ లక్ష్మి ప్రధాన పాత్రలో రూపొందిన హీరోయిన్ ఓరియంటెడ్ చిత్రం 'జనతా బార్'. రమణ మొగిలి దర్శకత్వం వహిస్తూ, అశ్వర్థ నారాయణతో కలసి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఈ నెల 28న 'జనతా బార్' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు యూనిట్ తెలిపింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'మహిళా అథ్లెట్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన అధికారులకు వ్యతిరేకంగా పోరాడిన ఓ మహిళ కథతో తెరకెక్కిన చిత్రమిది. రాయ్ లక్ష్మి పాత్ర శక్తిమంతంగా ఉంటుంది. అమ్మాయిల్లో చైతన్యం నింపే సినిమా ఇది. వాణిజ్య హంగులతో పాటు మంచి సందేశంతో తెరకెక్కింది. బాలీవుడ్ నటుడు శక్తికపూర్ కీలకపాత్ర పోషించారు' అని చెప్పారు.

రమణ గోగుల సంగీత యాత్ర



సంగీత దర్శకుడు, గాయకుడు రమణ గోగుల తన కెరీర్‌లో తొలి సారి 'ఇన్ కాన్వర్సేషన్స్ విత్ ది ట్రావెలింగ్ సోల్జర్ - రమణ గోగుల ఆస్ట్రేలియా టూర్ ఫిబ్రవరి 2026' పేరిట గ్లోబల్ కాన్సర్ట్ టూర్ నిర్వహించనున్నారు. మెల్‌బోర్న్ మామా క్రియేటివ్ స్పేస్, టాప్ నాచ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఆస్ట్రేలియా సంస్థలు ఈ కార్యక్రమాన్ని సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రమణ గోగుల ఈ యాత్ర వివరాలు వెల్లడించారు. ఈ గ్లోబల్ కాన్సర్ట్ టూర్ తెలుగు సంగీత చరిత్రలో ఒక మైలురాయిగా నిలవనుందని అభిప్రాయపడ్డారు. ఈ టూర్ కేవలం సంగీత కచేరీలకు మాత్రమే పరిమితం కాదనీ, అత్యంత ఆదరణ పొందిన తన సినీ గీతాలు, వాటి వెనుక ఉన్న జ్ఞాపకాలు, తెర వెనుక ఉన్న కథలతో కూడిన ఒక భావోద్వేగభరితమైన అన్వేషణ అని ఆయన తెలిపారు.

ఆకట్టుకునే అమ్మ కథ



ఆద్యంతం వినోద ప్రధానంగా సాగే కుటుంబ కథా చిత్రం 'విచిత్ర'. రవి, శ్రియ తివారి జంటగా నటించారు. సైఫుద్దీన్ మాలిక్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకొని విడుదలకు సిద్ధమైంది. ఆదివారం చిత్ర బృందం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను పంచుకుంది. ఈ సందర్భంగా సైఫుద్దీన్‌మాట్లాడుతూ 'అమ్మ సెంటిమెంట్‌తో రూపొందిన చిత్రమిది. తల్లి ప్రేమ, త్యాగం లాంటి అంశాలతో హృదయాన్ని కదిలించేలా ఉంటుంది. పాత్రల తాలూకు భావోద్వేగాలను ప్రేక్షకులు అనుభూతి చెందుతారు' అని చెప్పారు. సంగీతం: నిజాని, అంజన్, ఎడిటర్: లక్ష్మీ నారాయణ.



బడి కట్టారు

బాలభారతి... వేల మంది మహిళల శ్రమ ఫలితం. కార్పొరేట్ బడుల్లో పిల్లలను చదివించే స్థోమతలేని తల్లులు చిన్నస్థాయిలో ప్రారంభించిన ఈ పాఠశాల... నేడు ఏడు ఎకరాల్లో, మూడు అంతస్తుల్లో, అధునాతన సౌకర్యాలతో పేద విద్యార్థుల్లో విజ్ఞాన జ్యోతులు వెలిగిస్తోంది. ఇది కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం పొదుపు మహిళల విజయ గాథ. వారికి ఆ సంఘం గౌరవ సలహాదారు విజయభారతి అడుగడుగునా ప్రేరణగా నిలుస్తున్నారు.

అది 1995. నెల్లూరు జిల్లా ఉదయగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్న విజయభారతి...యూఎన్‌డీపీ ప్రాజెక్టు ఆఫీసరుగా కర్నూలు జిల్లా ఓర్వకల్లులో అడుగు పెట్టారు. దక్షిణాసియాలో పేదరిక నిర్మూలన కోసం ఐక్యరాజ్య సమితి చేపట్టిన ప్రాజెక్ట్‌లో భాగంగా అక్కడ కార్యక్రమాలు ప్రారంభించారు. ఆమె నేతృత్వంలో కాల్వ, ఉశేనాపురం గ్రామాల్లో మహిళా పొదుపు సంఘాలు ఏర్పడ్డాయి. వారు ఆర్థికంగా ఒక్కొక్క మెట్టు ఎదుగుతూ ఉండడంతో... ఆ స్ఫూర్తి మరో 25 గ్రామాలకు విస్తరించింది. ఆ సంఘాల సభ్యులు ఓ వైపు ఆర్థిక ప్రగతితో పాటు సంఘాలను బలోపేతం చేసుకోవడం, ఇతర సామాజిక అంశాల మీద దృష్టి పెట్టారు. 1998లో 'ఓర్వకల్లు మండలం పొదుపు లక్ష్మి ఐక్య సంఘం' ఏర్పాటు చేసుకున్నారు. దానికి ప్రభుత్వ కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్, యూఎన్‌డీపీ ప్రాజెక్టు సీడ్ క్యాపిటల్ కింద రూ.1.50 కోట్ల నిధి సమకూరింది. సంఘం సభ్యులే సొంతంగా మహిళా బ్యాంకును ఏర్పాటు చేసుకున్నారు. దానికి కేంద్ర ప్రభుత్వం నేషనల్ రిసోర్స్ ఆర్గనైజేషన్ (ఎన్ఆర్) హోదా కల్పించి వారికి మరింత చేయూత ఇచ్చింది. వారు ఆర్థికంగా ఎదుగుతున్నా.. రిసోర్స్ పర్సన్స్ (ఆర్‌పీ)గా రాష్ట్రాలు చుట్టేస్తున్నా... బ్యాంకులకు వెళ్లి నగదు జమ, విత్‌డ్రా చేయాలంటే ఫారాలు పూరించడానికి మరొకరి సాయం తీసుకోవాల్సి వచ్చేది. అందుకు ప్రధాన కారణం నిరక్షరాస్యతే. దాన్ని వారు అవమానంగా భావించారు. 'ఇదే పరిస్థితి మన పిల్లలకు ఎదురైతే?' అనే వేదన వారిని వేధించేది.

సందేహాలను దాటి...

ఆ ప్రాంతంలో పేద కుటుంబాలు పిల్లలను పొలం పనులకు పంపడంతో వారి భవిష్యత్తు నాశనమవుతోంది. ఈ అంశాన్ని ఐక్య సంఘం సమావేశంలో చర్చకు పెట్టారు విజయభారతి. "మన పిల్లలను మనమే చదివించుకుందాం" అని ప్రతిపాదన చేశారు. 'అది సాధ్యమయ్యే పనేనా?' అనే ప్రశ్నలు తలెత్తాయి. ఆమె వారిలో ఆత్మస్థైర్యం నింపారు. ముందుగా కాల్వబుగ్గ గ్రామ పాఠశాలలో వంద మంది పిల్లలతో 'సమ్మర్ క్యాంప్' నిర్వహించారు. దానికి గ్రామ మహిళలు స్వచ్ఛందంగా వంట సరుకులు, సామాగ్రి సమకూర్చారు. వంతులవారీగా పనులు చేశారు. ఆ సమయంలో ప్రపంచ బ్యాంక్ సౌత్ ఆసియా రీజియన్ వైస్ ప్రెసిడెంట్ అనంతపురానికి వెళుతూ... ఆ సమ్మర్ క్యాంప్ చూశారు. యూఎన్‌డీపీ కింద ప్రతి మండలంలో చైల్డ్ లేబర్ క్యాంపుల నిర్వహణకు నిధులు ఇవ్వాలని ఆమె చేసిన ప్రతిపాదనతో 'భవిత బాల కార్మికుల పాఠశాల' ఏర్పాటుకు పునాది పడింది. ఏడాదికి 200-300 మంది చొప్పున ఏడెనిమిదేళ్లలో రెండువేల మంది బాల కార్మికులను విద్యావంతులుగానే కాకుండా జీవితంలో స్థిరపడేలా తీర్చిదిద్దారు. సామాజిక స్ఫూర్తితో మహిళలు సాధించిన తొలి విజయం అది.

ఎందరో హేళన చేశారు...

ఈ క్రమంలోనే... తమ పిల్లల చదువు కోసం 2008లో ఓ చిన్న గదిలో 150 మంది విద్యార్థులతో సంఘం సభ్యులు పాఠశాల ప్రారంభించారు. పొదుపు మహిళలందరినీ ఏకతాటిపైకి తెచ్చి ప్రోత్సహించిన విజయభారతి పేరు వచ్చేలా 'బాల భారతి పాఠశాల' అని దానికి పేరు పెట్టారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా బడి భవనం నిర్మించాలని సంకల్పించారు. వరల్డ్ బ్యాంక్ కన్సల్టెంట్‌గా ఇతర దేశాలకు వెళ్లడం ద్వారా వచ్చిన పారితోషికంతో విజయభారతి నాలుగు ఎకరాలు, పొదుపు సంఘాల మహిళలు మూడు ఎకరాలు కొనుగోలు చేసి ఆ పాఠశాలకు ఇచ్చారు. ఏడు ఎకరాల్లో అధునాత సౌకర్యాలతో పాఠశాల నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వడ్డీల రూపంలో వచ్చిన డబ్బును, రిసోర్స్ పర్సన్లుగా ఇతర రాష్ట్రాలకు వెళ్లడం వల్ల వచ్చిన పారితోషికంలో కొంత వాటాను ఇచ్చి... అవసరమైన నిధులు సమకూర్చుకున్నారు. పొదుపు మహిళలే కూలీలుగా, మేస్త్రీలుగా మారిపోయారు. ఒక్క రూపాయి కూలీ ఆశించకుండా బడి స్థలంలోనే గుడారాలు వేసుకొని వంతులవారీగా శ్రమదానం చేశారు. ఒక దశలో మధ్యలో పనులు ఆగిపోతే... "ఆడవాళ్లేమిటి... స్కూల్ కట్టడమేమిటి? కోటీశ్వరులకే చేతకాలేదు. కార్పొరేట్ స్కూళ్లకు అమ్మేయండి. డబ్బులైనా వస్తాయి" అంటూ ఎందరో హేళన చేశారు. అయినా వారిలో ఆత్మస్థైర్యం సడలలేదు. పది వేల మందికిపైగా మహిళలు... దాదాపు పదేళ్లు శ్రమించారు. అత్యద్భుతమైన పాఠశాల భవనం నిర్మించుకున్నారు. 2017లో రెండు అంతస్తులు పూర్తి చేశారు. అప్పటి సీఎం చంద్రబాబునాయుడు దాన్ని ప్రారంభించారు.

వారి పట్టుదలకు నిదర్శనం...

సెమీ రెసిడెన్షియల్ స్కూల్ తరహాలో నడుస్తున్న ఈ పాఠశాలలో ప్రస్తుతం మూడు అంతస్తుల్లో 42 తరగతి గదులు, ఏడు హాల్స్ ఉన్నాయి. డిజిటల్ క్లాస్ రూమ్స్, లైబ్రరీ, కంప్యూటర్ శిక్షణ హాల్, సైన్స్ ల్యాబ్, కాన్ఫరెన్స్ హాల్ సహా ఆఫీసు, ప్రిన్సిపల్ గది, ఎంఎంఎస్ గది, స్పోర్ట్స్ రూమ్, ఉపాధ్యాయుల గదులు, సువిశాలమైన ఆట స్థలం, ఆట వస్తువులు... ఇలా అధునాతన, సాంకేతిక సదుపాయాలు సమకూర్చుకున్నారు. ఇక్కడ నర్సరీ నుంచి 10వ తరగతి వరకూ 1,070 మంది బాలబాలికలు విద్యాభ్యాసం చేస్తున్నారు. పాఠశాల నిర్వహణ బాధ్యతలు పూర్తిగా మహిళలే నిర్వహిస్తారు. గ్రామాఖ్య సంఘాలు, ఓర్వకల్లు మండల పొదుపు లక్ష్మి ఐక్య సంఘంలో చురుకుగా పని చేస్తున్న ఐదుగురు మహిళలను 'ఎడ్యుకేషన్ కమిటీ' సభ్యులుగా ఎన్నుకుంటారు. ఆ కమిటీ రెండేళ్లు పని చేస్తుంది. అలాగే 1,070 మంది విద్యార్థులకు శ్రీబాల ట్రస్ట్ వ్యవస్థాపకుడు శ్రీనివాసరావు సహకారంతో పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనం అదిస్తున్నారు. అలాగే 1,250 పొదుపు సంఘాలు సభ్యుల నేతృత్వంలో విద్యార్థులకు స్నాక్స్ సమకూరుస్తున్నారు. ఒకప్పుడు "మీకు ఇది సాధ్యం కాదు" అని హేళన చేసినవారే... తమ పిల్లల సీట్ల కోసం అభ్యర్థించే స్థాయికి ఈ పాఠశాలను తీసుకువెళ్లడం ఈ పొదుపు మహిళల కృషికి, పట్టుదలకు నిదర్శనం. వారిని విజయభారతి వెన్నంటి ఉండి నడిపిస్తున్నారు. అందరూ ఆమెను 'అమ్మ' అని ఆప్యాయంగా పిలుచుకుంటారు.

● గోరంట్ల కొండప్ప, కర్నూలు,
ఫొటోలు: ఎస్ఎండీ రఫీ

స్త్రీశక్తి సమష్టి విజయం



మా గురువుగారైన ఐఏఎస్ అధికారి రాజు నెల్లూరు కలెక్టర్‌గా పని చేసే సమయంలో... ఆయన ప్రేరణతోనే సంపూర్ణ అక్షరాస్యత కార్యక్రమం రిసోర్స్ పర్సన్‌గా వెళ్లాను. "డబ్బు లేకపోవడం ఒక్కటే పేదరికానికి కారణం కాదు. సామాజిక సమానత్వం వచ్చినప్పుడే పేదరిక నిర్మూలన సాధ్యం" అని ఆయన పదేపదే చెప్పేవారు. ఆ స్ఫూర్తితో పొదుపు ఉద్యమంలో మహిళలను భాగస్వామ్యం చేశాం. సామాజిక సమస్యలపై పోరాడే తత్వం వారిలో పెంచగలిగాం. ఆ ప్రేరణతో డ్వాక్రా మహిళలు తమ పిల్లల భవిషత్తు కోసం తామే కార్పొరేట్‌కు దీటుగా అద్భుతమైన ఓ పాఠశాలను నిర్మించడమే కాదు, నిర్వహించే స్థాయికి ఎదిగారు. పాఠశాల ఎడ్యుకేషన్ కమిటీ సారథులు అందరూ మహిళలే. వారిలో అక్షరం విలువ తెలిసిన నిరక్షరాస్యులు కూడా ఉన్నారు. స్త్రీశక్తి సాధించిన సమిష్టి విజయం ఇది. 1995లో ఓర్వకల్లు మండలంలో వలసలు, బాలకార్మికులు, బాల్యవివాహాలు, నిరాక్షరాస్యత, మహిళలపై హింస... ఇలాంటి సమస్యలు అధికంగా ఉండేవి. పదో తరగతి చదివిన మహిళలు 5 శాతం కూడా లేరు. తమ పిల్లలనైనా బడికి పంపి ఉన్నతంగా చదివించాలనే వారి ఆలోచనే అద్భుతమైన పాఠశాల నిర్మాణానికి బీజం వేసింది. తక్కువ ఫీజులతో వేలాది మంది పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం వెనుక మహిళల పదేళ్ల శ్రమ ఉంది.

\- బత్తుల విజయభారతి



ఇలా చేస్తే దురద తగ్గుతుంది..!

శీతాకాలంలో వీచే చల్లటి గాలుల వల్ల చర్మం పొడిబారి దురద మొదలవుతుంది. చిన్నపాటి జాగ్రత్తలతో ఈ సమస్యను నివారించుకోవచ్చు.

- చలిగా ఉందంటూ వేడివేడి నీళ్లతో స్నానం చేయకూడదు. స్నానానికి గోరువెచ్చని నీటిని మాత్రమే ఉపయోగించాలి. అలాగే గ్లిజరిన్ సోప్‌ను వాడితే ప్రయోజనం ఉంటుంది.
- చర్మం మీద పేరుకున్న మురికిని తొలగించడంలో ఓట్‌మీల్ ప్రభావవంతంగా పనిచేస్తుంది. స్నానం చేసే నీటిలో కొద్దిగా ఓట్‌మీల్ కలుపుకోవడం మంచిది. లేదంటే దురద అనిపించిన చోట కొద్దిగా ఓట్‌మీల్ పేస్ట్ రాసి ఆరిన తరువాత చేతి వేళ్లతో రుద్దితే సరిపోతుంది.
- స్నానం చేసిన తరువాత ఒళ్లంతా కొద్దిగా కొబ్బరినూనె లేదా బాదం నూనె రాసుకుంటే సమస్య తీరుతుంది. దురదగా అనిపించిన చోట కలబంద జెల్ లేదా షియా బటర్‌తో మసాజ్ చేసినా ఫలితం ఉంటుంది.
- చిన్న గిన్నెలో అయిదు చెంచాల కొబ్బరినూనె, మూడు చెంచాల మింట్ ఆయిల్(పుదీనా నూనె) వేసి బాగా కలపాలి. రాత్రి పడుకునేముందు ఒళ్లంతా ఈ నూనె రాసుకుని ఉదయాన్నే గోరువెచ్చని నీటితో స్నానం చేస్తే చర్మం తేమతో నిండి మృదువుగా మారుతుంది. దురద కూడా తగ్గుతుంది.
- చిన్న గిన్నెలో రెండు చెంచాల యాపిల్ సైడర్ వెనిగర్ వేసి ఒక చెంచా నీళ్లు చిలకరించి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని దురద ఎక్కువగా ఉన్నచోట రాసి పది నిమిషాల తరువాత నీటితో శుభ్రం చేసుకోవాలి. దురద వెంటనే తగ్గుతుంది.
- యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే బ్లూ బెర్రీ, టమాటా, కేరట్, బీన్స్, బఠానీలు, పప్పు దినుసులు, చేపలను ఆహారంలో చేర్చుకోవడం వల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. అల్లం, దాల్చినచెక్క, మిరియాలు లాంటి దినుసులతో తయారుచేసిన హెర్బల్ టీలు తాగడం వల్ల శరీరంలో రక్తప్రసరణ సజావుగా జరిగి దురద సమస్య తగ్గుతుంది.

జుట్టు పల్చబడుతోందా..?

మానసిక అశాంతి, అధిక ఒత్తిడి, పోషకాహార లోపం, హార్మోన్ల అసమతుల్యత, చుండ్రు లాంటి సమస్యల వల్ల జుట్టు పల్చబడుతుంది. జుట్టు రాలడం తగ్గి ఒత్తుగా పెరగడానికి పాటించాల్సిన ఇంటి చిట్కాలు ఇవే...

- చిన్న గిన్నెలో అయిదు చెంచాల భృంగరాజ్ తైలం తీసుకుని కొద్దిగా వేడి చేయాలి. అందులో మూడు చెంచాల ఉసిరి రసం లేదా ఉసిరి నూనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని రాత్రి పడుకునేముందు మాడుకు పట్టించి ఉదయాన్నే గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే జుట్టు రాలడం తగ్గుతుంది.



- ఒక గిన్నెలో షికాకాయ పేస్టు, కుంకుడుకాయ పేస్టులను సమపాళ్లలో తీసుకుని బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని శిరోజాల కుదుళ్లకు పట్టించి అరగంటసేపు ఆరనివ్వాలి. తరువాత గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలి. తలస్నానానికి షాంపూ వాడకూడదు. ఇలా తరచూ చేస్తూ ఉంటే మంచి ఫలితం కనిపిస్తుంది.
- ఒక గ్లాసు నీటిలో నాలుగు చెంచాల మెంతులు వేసి రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే పేస్టులా చేయాలి. అందులో రెండు చెంచాల మందారం పూల పొడి వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని మాడుకు పట్టించి అరగంట తరువాత తలస్నానం చేస్తే జుట్టు ఆరోగ్యంగా ఒత్తుగా పెరుగుతుంది.
- రెండు గుప్పెళ్ల వేపాకులు, గుప్పెడు కరివేపాకును తీసుకుని కొన్ని నీళ్లు చిలకరించి మెత్తటి పేస్టులా చేయాలి. దీన్ని తలంతా పట్టించి అరగంట తరువాత తలస్నానం చేయాలి. వారానికి రెండుసార్లు ఇలా చేస్తూ ఉంటే జుట్టు చక్కగా పెరుగుతుంది.
- కలబంద గుజ్జులో ఓట్స్ పొడి, అరటి పండు గుజ్జులో పెరుగు, గంధం పొడిలో గులాబీ నీళ్ల కలిపిన మిశ్రమాల్లో ఒకదాన్ని శిరోజాల కుదుళ్లకు పట్టించి ఆపైన తలస్నానం చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.
- వారానికి రెండుసార్లు.. ఆముదం, కొబ్బరి నూనె, బాదం నూనె, టీ ట్రీ నూనె, ఆలివ్ నూనెల్లో ఒకదాన్ని తీసుకుని కొద్దిగా వేడిచేసి తలంతా మర్దన చేసినా సమస్య తీరుతుంది. ఉసిరి నూనె, మందారం నూనె, గోరింటాకు నూనెలను తరచూ తలకు రాసుకుంటూ ఉంటే జుట్టు కుదుళ్లు బలోపేతమవుతాయి.



ఒకప్పుడు భయంతో తరగతి గది దాటని అమ్మాయి... ఇప్పుడు వేదికలెక్కి ప్రసంగిస్తోంది. అంతర్జాలాన్నే అభ్యాస కేంద్రంగా మలుచుకొని... ఆ విజ్ఞానాన్ని తోటి విద్యార్థులకు పంచుతోంది. కేవలం పాఠ్యాంశాలకే పరిమితమైపోకుండా... అధునాతన సాంకేతికతపై అవగాహన కల్పిస్తోంది. సమష్టి స్ఫూర్తి నింపి... సృజనకు పదును పెట్టి... ఆత్మవిశ్వాసాన్ని నింపుతోంది. 'లీడ్' కార్యక్రమాల స్ఫూర్తితో అందుకోసం 'ఏక్ లక్ష్యా' పేరున సొంతంగా ఒక వేదిక సైతం రూపొందించిన పదో తరగతి విద్యార్థిని కుష్బూ జైన్... 'నవ్య'తో పంచుకున్న విశేషాలివి.

ఒకటే లక్ష్యం మార్పు కోసం

"రోజూ బడికి వెళతాం. పాఠాలు వింటాం. మంచి మార్కులూ తెచ్చుకొంటాం. కానీ అంతటితో ఆగిపోతే జెట్ వేగంతో దూసుకుపోతున్న నేటి ప్రపంచంలో వెనకబడిపోతాం. సృజనాత్మకంగా ఆలోచించాలి. ఎవరికివారుగా కాకుండా జట్టుగా కలిసి పని చేయడం అలవర్చుకోవాలి. సాంకేతిక నైపుణ్యాన్ని పెంచుకోవాలి. నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవాలి. ఎందుకంటే బాల్యంలో బలమైన పునాది పడితేనే భవిష్యత్తులో ఆత్మవిశ్వాసంతో అడుగులు వేయగలుగుతాం. అనుకున్నది సాధించగలుగుతాం. ఆ ఉద్దేశంతోనే 'ఏక్ లక్ష్యా' అనే లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌ను తీసుకువచ్చాను. ఇది ఒక వెబ్‌సైట్. దీనిద్వారా విద్యార్థుల్లో ఉన్న భయాన్ని, బెరుకును పోగొట్టి, ఇరవై ఒకటో శతాబ్దపు నైపుణ్యాలను పరిచయం చేసేందుకు ప్రయత్నిస్తున్నాను. నాకు ఈ ఆలోచన రావడానికి కారణం... మా పాఠశాలలో 'లీడ్ స్కూల్' నిర్వహించిన కార్యక్రమాలు. ప్రస్తుతం నేను కడప 'నాగార్జున మోడల్ స్కూల్'లో పదో తరగతి చదువుతున్నా. మాది రాజస్థాన్ అయినా నలభై ఏళ్ల కిందట మా తాతగారు ఇక్కడకు వచ్చి స్థిరపడ్డారు. మా నాన్నకు కడపలో ఎలక్ట్రికల్ షాపు ఉంది. అమ్మ గృహిణి. తనే నాకు మార్గదర్శి స్ఫూర్తి.

మూస పద్ధతి నుంచి...

మొదట్లో నేను కూడా చాలా బిడియస్తురాలిని. తరగతి గదిలో సందేహాలు అడగాలన్నా, నలుగురిలో మాట్లాడాలన్నా, వేదికపైకి వెళ్లాలన్నా భయపడేదాన్ని. అయితే కరోనా తరువాత నా జీవితంలో ఊహించని మార్పులు చోటు చేసుకున్నాయి. నేను ఆరో తరగతిలో ఉండగా మా పాఠశాలకు 'లీడ్ స్కూల్'వారు వచ్చారు. వేదికపైకి పిలిచి నచ్చిన అంశంపై అందరి ముందూ మాట్లాడించారు. బృంద చర్చలు పెట్టారు. కలిసికట్టుగా ప్రాజెక్టులు చేయడం నేర్పించారు. మాలో ఆలోచనాశక్తి పెంచేలా ప్రయోగాలు చేయించారు. అప్పటివరకు మేం బోర్డు మీద చూసి నేర్చుకొనేవాళ్లం. కానీ 'లీడ్' తరువాత మా స్కూల్లో మూస పద్ధతి పోయింది. తొలిసారి విజువల్ లెర్నింగ్ ప్రారంభమైంది. నాలో బెరుకు పోయింది. నిర్భయంగా ఎక్కడైనా, ఎంత పెద్ద వేదిక మీద నుంచైనా మాట్లాడటం అలవాటైంది. పాఠాలే కాకుండా చుట్టూవున్న వాటి గురించి కూడా ఆలోచించడం మొదలైంది.

వారిని చూసి...

నేనే కాదు... నా స్నేహితులు చాలామందిలో కూడా ఇలాంటి మార్పే గమనించాను. అదేసమయంలో నాకు నీతి ఆయోగ్ 'అటల్ ఇన్నోవేషన్ మిషన్' నిర్వహించే 'టింకర్‌ప్రెన్యూర్' గురించి తెలిసింది. ఇది విద్యార్థులకు ఇరవై ఒకటో శతాబ్దపు డిజిటల్ స్కిల్స్ నేర్పించి, ఆవిష్కరణలు, వ్యవస్థాపకత వైపు ప్రోత్సహించే జాతీయ స్థాయి కార్యక్రమం. అందులో భాగంగా మనం ఒక ప్రాజెక్ట్ రూపొందించాలి. ఆ ప్రాజెక్ట్ వినూత్నంగా ఉండాలి. సమాజంపై సానుకూల ప్రభావం చూపాలి. నాకు ఎంతో ఆసక్తిగా అనిపించి, రిజిస్టర్ చేసుకున్నా. అప్పటివరకు మొబైల్ ఆపరేటింగ్ కూడా సరిగ్గా తెలియని నేను... ఇంటర్నెట్‌లో శోధించడం మొదలుపెట్టాను. ఏఐ, చాట్ జీపీటీల సాయంతో డిజిటల్ స్కిల్స్ నేర్చుకున్నా. అలాగని చదువును అశ్రద్ధ చేయలేదు. ఎప్పుడూ నేను టాప్‌లోనే ఉంటాను.

ఇంకా ఎన్నో...

ఒకప్పుడు భయంతో వెనకడుగు వేసిన నేను ఇప్పుడు బడిలో జరిగే ప్రతి కార్యక్రమంలో ముందుంటున్నాను. మా స్కూల్ వెబ్‌సైట్ డిజైనింగ్ చేస్తున్నా. మంత్లీ న్యూస్‌లెటర్స్ సిద్ధం చేస్తున్నా. నేను రాసిన కొన్ని పుస్తకాలు 'అటల్ ఇన్నోవేషన్'లో భాగంగా 'టింకర్‌చాంప్స్' కార్యక్రమం ద్వారా తోటి విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇస్తున్నా. 'సీఎస్ఐఆర్-ఎన్ఏఎల్' బెంగళూరులో నిర్వహించిన ఏరోఫెస్ట్‌లో మా టీమ్ రూపొందించిన ప్రాజెక్ట్‌కు మొదటి బహుమతి వచ్చింది. జాతీయ స్థాయిలో జరిగిన ఈ ఫెస్ట్‌లో మేం ఎయిర్‌క్రాఫ్ట్ ప్రొపల్షన్‌పై పేపర్స్ సమర్పించాం. అలాగే 2023లో 'లీడ్ గ్రూప్' నిర్వహించిన 'యంగ్ లీడర్స్ ప్రోగ్రామ్'లో సోషల్‌మీడియా ట్రెండ్స్‌పై అధ్యయనం చేసే అవకాశం లభించింది. నా లక్ష్యం ఒక్కటే... పారిశ్రామికవేత్తగా ఎదగాలని. అప్పుడైతేనే మరికొంతమందికి ఉద్యోగ అవకాశాలు ఇవ్వగలుగుతాం.

తొలి ప్రయత్నం విఫలమైనా...

'టింకర్‌ప్రెన్యూర్' కార్యక్రమంలో పాల్గొన్న వారు రూపొందించిన ప్రాజెక్టుల నుంచి జాతీయ స్థాయిలో టాప్ 100 ఎంపిక చేస్తారు. దానికోసం 2022లో 'డిస్క్యూ' అనే ప్రొడక్ట్ ఒకటి తయారు చేశాను. కరోనా వస్తే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ఇంట్లో వేరేవారికి వైరస్ సోకకుండా ఎలా చూసుకోవాలి? అందుబాటులో ఉన్న ఇంటి చిట్కాలు ఏమిటి? తదితర సమాచారంతో దాన్ని రూపొందించాను. అయితే నా ప్రాజెక్ట్‌కు టాప్100లో చోటు దక్కలేదు. నిరాశచెందలేదు. ఎంపికైన వాటిని పరిశీలించి, ఇంకా ఏఏ అంశాల్లో మెరుగు అవ్వాలో తెలుసుకున్నా.

అనుకున్నది నెరవేరింది...

తొలి ప్రయత్నం విఫలవడంతో మరింత పట్టుదలతో మరుసటి ఏడాది 'టింకర్‌ప్రెన్యూర్'కు సన్నద్ధమయ్యా. కిరణ్‌కుమార్ సర్ మార్గదర్శకత్వంలో 'ఏక్ లక్ష్యా' పేరుతో ఒక ఎడ్యుకేషన్ ప్లాట్‌ఫామ్ రూపొందించాను. ఆ పేరు మా అమ్మ పెట్టింది. 'ఏక లక్ష్యా' అంటే హిందీలో 'ఒకటే లక్ష్యం' అని. ఇది ఒక ఆన్‌లైన్ స్టోర్. మొదట పది ఇ-బుక్స్ పెట్టాను. తోటి విద్యార్థుల్లో ఆధునిక సాంకేతికత నైపుణ్యాన్ని పెంచడం, కొత్తగా ఆలోచించి, కలిసికట్టుగా పని చేసేలా ప్రోత్సహించడం, తద్వారా సమాజంలో మార్పు తేవడం ఈ వేదిక లక్ష్యం. ఈసారి 'టింకర్‌ప్రెన్యూర్' జాతీయ స్థాయి టాప్100లో నా ప్రొడక్ట్ చోటు దక్కించుకుంది. టాప్7గా నిలిచింది. ఇది నాకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. ఆత్మస్థైర్యాన్ని పెంచింది. ఈ స్ఫూర్తితో 'ఏక్ లక్ష్యా'ను మరింత ఉపయోగకరంగా తీర్చిదిద్దాలని అనుకున్నాను. ఇంకా ఏమేం ఉంటే బాగుంటుందనే దానిపై స్నేహితులు, మెంటార్స్‌తో చర్చిస్తున్నాను. పదో తరగతి పరీక్షలు అవ్వగానే ఆ పనిలోనే ఉంటాను."



● హనుమా

తాజాగా ఇలా

అరటి పండ్లను నిల్వ చేయడం కొద్దిగా కష్టమే. తెచ్చిన రెండు రోజుల్లోనే బాగా పండి తరువాత పాడైపోతుంటాయి. చిన్న చిట్కాలు పాటించి అరటి పండ్లను ఎక్కువ రోజులు తాజాగా ఉండేలా నిల్వ చేసుకోవచ్చు.

- వెడల్పాటి గిన్నెలో సగానికి పైగా నీళ్లు పోసి అందులో రెండు సి విటమిన్ మాత్రలు వేసి కరిగించాలి. ఈ నీటిలో అరటి పండ్లను ముంచి తీస్తే అవి వారంపాటు తాజాగా ఉంటాయి. పండ్లపై కొద్దిగా నిమ్మరసం రాసినా ఫలితం ఉంటుంది.
- అరటి పండ్లు త్వరగా పండటానికి కారణం కాడల నుంచి వెలువడే ఎథిలిన్ వాయువు. కాడలను ప్లాస్టిక్ కవర్ లేదా అల్యూమినియం ఫాయిల్‌తో చుట్టేస్తే అయిదు రోజులపాటు అరటి పండ్లు తాజాగా ఉంటాయి.
- అరటి పండ్లను గుత్తిగా ఉంచినట్లయితే వాటిలో ఒకటి పండినా మిగిలినవన్నీ వెంటనే మెత్తబడతాయి. కాబట్టి అరటి పండ్లను తెచ్చిన వెంటనే గుత్తి నుంచి విడదీయాలి. పండినవాటిని వేరేగా ఉంచాలి.
- అరటి పండ్లను తాడు సహాయంతో హ్యాంగర్‌కు వేలాడదీస్తే చాలారోజుల వరకు పాడవకుండా తాజాగా ఉంటాయి.
- అరటి పండ్లను పేపర్ బ్యాగ్‌లో ఉంచి వెలుతురు తగలకుండా భద్రపరిస్తే వారానికి పైగా నిల్వ ఉంటాయి.



పోషకాల ఖజానా

తామరగింజలను సేకరించి ఎండబెట్టి వేయించి మఖానాను తయారుచేస్తారు. దీనిలో ఎన్నో పోషకాలు ఉంటాయి. చలికాలంలో తినదగ్గ చిరుతిండి.

- మఖానాలో పీచుపదార్థాలు ఎక్కువ. తరచూ మఖానాను తినడంవల్ల జీర్ణసమస్యలు దూరమవుతాయి. మలబద్దకం, కడుపు ఉబ్బరం, కడుపులో ఆమ్లత్వం లాంటి సమస్యలు తొలగిపోతాయి.
- వీటిలోని ప్రొటీన్ జీవక్రియలను వేగవంతం చేస్తుంది. అతిగా తినాలనే భావన తగ్గిస్తుంది. దీనిలో కేలరీలు కూడా తక్కువగా ఉంటాయి కాబట్టి శరీరం బరువు పెరగకుండా నియంత్రణలో ఉంటుంది.
- అల్పాహారంలో మఖానాను చేర్చుకుంటే శరీరానికి కావాల్సిన కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, ఐరన్, ఫాస్ఫరస్ లభిస్తాయి. దీంతో శరీరంలోని ఎముకలు బలోపేతమవుతాయి. కీళ్లు, కండరాల సమస్యలు తీరుతాయి.
- మఖానాలో గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా తక్కువ. కాబట్టి దీన్ని మధుమేహం ఉన్నవారు తింటే రక్తంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది.
- మఖానాలో ఫ్లవనాయిడ్స్, యాంటీ ఆక్సిడెంట్లు, అమైనో ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో హార్మోన్ల సమతుల్యతను కాపాడతాయి. మహిళల్లో ల్యుకోరియా, రుతు సమస్యలను నివారిస్తాయి.



హాకీ వరల్డ్‌కప్‌నకు టిక్కెట్లు ఫ్రీ

మధురై: పురుషుల హాకీ జూనియర్ వరల్డ్‌కప్ పోటీలను ప్రత్యక్షంగా వీక్షించాలనుకునే అభిమానులకు భారత హాకీ సమాఖ్య బంపర్ ఆఫర్ ఇచ్చింది. చెన్నై వేదికగా ఈనెల 28 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు జరగనున్న ఈ మ్యాచ్‌లకి అభిమానులకు ఉచితంగా టిక్కెట్లు ఇవ్వనున్నట్టు హాకీ సమాఖ్య తెలిపింది. ఈ వరల్డ్‌కప్‌లో మొత్తం 24 దేశాలు పాల్గొంటున్నాయి. టిక్కెట్ జీనీ వెబ్‌సైట్‌లో అభిమానులు ఫ్రీ టిక్కెట్లను పొందవచ్చు. యువ క్రీడాకారులు, విద్యార్థులతో పాటు వారి కుటుంబ సభ్యులు కూడా మ్యాచ్‌లు చూడడానికి రావచ్చునని హాకీ సమాఖ్య తెలిపింది.

కబడ్డీ టైటిల్‌పోరుకు భారత్

ఢాకా: భారత మహిళల జట్టు అద్భుతమైన ఆట తీరుతో కబడ్డీ వరల్డ్‌కప్‌లో ఫైనల్ చేరింది. సెమీఫైనల్ పోరులో భారత జట్టు 33-21తో బలమైన ఇరాన్‌ను ఓడించి, ట్రోఫీకి చేరువైంది. డిఫెండింగ్ చాంపియన్ అయిన భారత క్రీడాకారిణులు శత్రు దుర్భేద్యమైన డిఫెన్స్‌తో పాటు మెరుపు రైడ్లతో ప్రత్యర్థి ఇరాన్‌ను చిత్తు చేశారు. అంతకుముందు జరిగిన లీగ్ దశలోనూ గ్రూప్-ఎ ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ భారత్ విజయం సాధించడం విశేషం. సోమవారం జరిగే ఫైనల్లో చైనీస్ తైపీ జట్టుతో భారత అమ్మాయిలు తలపడనున్నారు.

అభినవ్‌కు స్వర్ణం

● బధిర ఒలింపిక్స్



టోక్యో: బధిర ఒలింపిక్స్‌లో భారత షూటర్లు అదరగొడుతున్నారు. తాజాగా పిస్టల్ విభాగంలో అభినవ్ దేశ్వాల్ స్వర్ణంతో మెరిశాడు. ఈ ఒలింపిక్స్ షూటింగ్ అంశంలో భారత్‌కిది 15వ పతకం. ఆదివారం జరిగిన 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్ ఫైనల్లో అభినవ్ 44 పాయింట్లతో టాప్‌లో నిలిచాడు. కొరియా షూటర్ సెంగ్ రజతం, ఉక్రెయిన్‌కు చెందిన సెర్హి కాంస్యం దక్కించుకొన్నారు. అయితే, క్వాలిఫికేషన్ రౌండ్‌లో అభినవ్ 575 పాయింట్లతో డెఫిలింపిక్స్ క్రీడల రికార్డు నెలకొల్పాడు.



రఫీల్

భారత్ శుభారంభం

● 1-0తో కొరియాపై గెలుపు ● అజ్లాన్ షా కప్ హాకీ

ఇఫో (మలేసియా): సుల్తాన్ అజ్లాన్ షా కప్‌లో భారత హాకీ జట్టు బోణీ చేసింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 1-0తో కొరియాపై గెలిచింది. తొలి క్వార్టర్ 15వ నిమిషంలో రఫీల్ ఫీల్డ్ గోల్‌తో భారత్‌ను ఆధిక్యంలో నిలిపాడు. మ్యాచ్‌లో భారత్‌కు ఐదు పెనాల్టీ కార్నర్‌లు లభించినా ఒక్కదాన్ని కూడా గోల్‌గా మలచలేక పోయింది. కాగా, ఈ మ్యాచ్ సమయానికి మధ్యాహ్నం భారీగా వర్షం కురవడంతో మిగిలిన మ్యాచ్‌లు పూర్తయిన తర్వాత రాత్రికి పూర్తి చేశారు. మలేసియా, న్యూజిలాండ్ మ్యాచ్ 2-2తో, బెల్జియం, కెనడా మ్యాచ్ 1-1తో డ్రాగా ముగిశాయి.

సేన్.. సాధించెన్!



● లక్ష్య ఖాతాలో ఆస్ట్రేలియన్ ఓపెన్
● సీజన్‌లో తొలి టైటిల్ కైవసం

ఆహా... ఎన్నాళ్లకెన్నాళ్లకు.. లక్ష్య సేన్ టైటిల్ కొరత తీరింది. ఏడాదికాలంగా విజయం కోసం ఎదురు చూస్తున్న ఈ స్టార్ షట్లర్ కల నెరవేరింది. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సేన్ చాంపియన్‌గా నిలిచి ఈ సీజన్‌లో తొలి ట్రోఫీని ముద్దాడాడు. తన ఫామ్‌పై నెలకొన్న సందేహాలకు చెక్ పెడుతూ, పునర్వైభవం దిశగా ముందడుగు వేశాడు.

2 ఈ సీజన్‌లో బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ టైటిల్ నెగ్గిన రెండో భారత షట్లర్ లక్ష్య. అంతకు ముందు ఈ ఏడాది ఆయుష్ శెట్టి యూఎస్ ఓపెన్‌లో విజేతగా నిలిచాడు.

లక్ష్యకు ఇది కెరీర్‌లో మూడో బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ 500 టైటిల్. అంతకు ముందు ఇండియా, కెనడా ఓపెన్ గెలిచాడు.

3 సైనా నెహ్వాల్, కిడాంబి శ్రీకాంత్ తర్వాత ఆస్ట్రేలియన్ ఓపెన్ నెగ్గిన మూడో భారత షట్లర్ లక్ష్య సేన్.

సిడ్నీ: గతేడాది పారిస్ ఒలింపిక్స్‌లో నాలుగోస్థానంతో త్రుటిలో కాంస్య పతకాన్ని చేజార్చుకున్న భారత యువ షట్లర్ లక్ష్య సేన్.. ఆ తర్వాత ఇన్నాళ్లకు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచి ఈ సీజన్‌లో అతి పెద్ద విజయాన్ని నమోదు చేశాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో లక్ష్య సేన్ 21-15, 21-11తో జపాన్‌కు చెందిన 26 ఏళ్ల యుషి తనకను వరుస గేముల్లో చిత్తుచేసి ట్రోఫీ దక్కించుకున్నాడు. గత మ్యాచ్‌లో మూడు గేమ్‌ల పాటు పోరాడిన లక్ష్య.. ఫైనల్లో మాత్రం ప్రత్యర్థి యుషిని అలవోకగా ఓడించాడు. కేవలం 38 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించిన సేన్.. ఆద్యంతం ఆధిపత్యం ప్రదర్శించాడు. రెండో గేమ్‌లో మూడు సార్లు మ్యాచ్ పాయింట్‌ను కాచుకొని విజయం సాధించాడు. ఉత్తరాఖండ్‌లోని అల్మోరాకు చెందిన 24 ఏళ్ల లక్ష్యకు ఇది ఈ ఏడాది తొలి టైటిల్. చివరిగా అతను నిరుడు నవంబరులో భారత్ వేదికగా జరిగిన సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ సూపర్ 300 టోర్నీలో విజేతగా నిలిచాడు. ఇక.. ఈ సీజన్ సెప్టెంబరులో హాంకాంగ్ ఓపెన్ ఫైనల్ చేరినా, టైటిల్ దక్కించుకోలేకపోయాడు. 2021లో ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం నెగ్గిన లక్ష్య సేన్.. ఆ తర్వాత ప్రతి ఏటా కనీసం ఒక టైటిల్ నెగ్గడం విశేషం. 2022లో ఇండియా ఓపెన్ విజేతగా నిలిచిన లక్ష్య.. 2023లో కెనడా ఓపెన్, 2024లో సయ్యద్ మోదీ, ఇప్పుడు ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిళ్లు కైవసం చేసుకున్నాడు. ప్రస్తుతం ప్రపంచ 14వ ర్యాంక్‌లోనున్న లక్ష్య.. తాజా ప్రదర్శనతో 11వ స్థానానికి ఎగబాకాడు.



అంధ మహిళల టీ20 వరల్డ్‌కప్ విజేత భారత్

మన అమ్మాయిలు టైటిల్ పట్టేశారు

● అదరగొట్టిన ఫులా సరెన్, కరుణ
● ఫైనల్లో 7 వికెట్లతో నేపాల్ చిత్తు




ట్రోఫీతో కరుణ కుమారి

గెలుపులో పాడేరు మన్యం బిడ్డ


పాడేరు మన్యంకు చెందిన పి.కరుణ కుమారి గత రెండేళ్లుగా అంధుల క్రికెట్‌లో నిలకడగా రాణిస్తోంది. ప్రస్తుతం విశాఖపట్నంలోని ప్రభుత్వ బాలికల అంధుల రెసిడెన్షియల్ పాఠశాలలో కరుణ పదో తరగతి చదువుతోంది. కరుణ ప్రతిభను గుర్తించిన అర్జున అవార్డు గ్రహీత, కోచ్ అజయ్ కుమార్ రెడ్డి ప్రోత్సాహంతో ఆమెకు జాతీయ జట్టులో చోటు లభించింది. భారత జట్టు వరల్డ్‌కప్ సాధించడంలో కరుణ ముఖ్యభూమిక పోషించడంతో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, శాప్ చైర్మన్ రవినాయుడు ఆమెను అభినందించారు.


కొలంబో: టోర్నీ ఆసాంతం అజేయంగా నిలిచిన భారత జట్టు.. అంధ మహిళల తొలి టీ20 వరల్డ్ కప్ చాంపియన్‌గా నిలిచింది. ఓపెనర్ ఫులా సరెన్ (44 నాటౌట్), తెలుగమ్మాయి కరుణ కుమారి (42) రాణించడంతో.. ఆదివారం ఏకపక్షంగా జరిగిన ఫైనల్లో భారత్ 7 వికెట్ల తేడాతో నేపాల్‌పై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకొన్న భారత్ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ప్రత్యర్థిని నియంత్రించింది. దీంతో నేపాల్ జట్టు 20 ఓవర్లలో 114/5 స్కోరు మాత్రమే చేసింది. బ్యాటర్లను బౌలర్లు కట్టడి చేయగా.. ఫీల్డర్లు అద్భుతంగా రాణిస్తూ ప్రత్యర్థి నేపాల్‌ను ఒత్తిడిలోకి నెట్టారు. ఇన్నింగ్స్ మొత్తంలో నేపాల్ ఒకే ఒక బౌండ్రీ సాధించిందంటే భారత ఫీల్డర్లు ఎంత అద్భుతంగా బౌల్ చేశారో అర్థం చేసుకోవచ్చు. ఛేదనలో భారత్ 12.1 ఓవర్లలో 3 వికెట్లకు 117 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్‌గా బరిలోకి దిగిన సరెన్ ఎడాపెడా షాట్లలో స్కోరు బోర్డును పరుగులు పెట్టించడంతో భారత్ 10 ఓవర్లలో సెంచరీ మార్క్ దాటింది. 13వ ఓవర్ తొలి బంతిని ఫైన్ లెగ్ మీదుగా ఫోర్ బాదిన సరెన్ మ్యాచ్‌ను ఫినిష్ చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా సరెన్ నిలిచింది. సెమీస్‌లో ఆస్ట్రేలియాను భారత్ ఓడించగా.. పాకిస్థాన్‌పై నేపాల్ గెలిచింది.

తండ్రికి అస్వస్థత.. మంధాన పెళ్లి వాయిదా



సాంగ్లీ (మహారాష్ట్ర): మూడ్రోజులపాటు హల్దీ, మెహందీ, సంగీత్ వేడుకలతో సంబరాలు జోరుగా సాగాయి. అందరూ హుషారుగా స్టెప్పులేశారు.. సందడి చేశారు. ఇంకొన్ని గంటల్లో పెళ్లి వేడుకకు సిద్ధమవుతున్న వేళ.. కాబోయే వధువు, క్రికెటర్ స్మృతీ మంధాన తండ్రి శ్రీనివాస్ అనారోగ్యానికి గురయ్యారు. ఛాతీలో నొప్పిగా ఉందనడంతో ఆయనను హుటాహుటిన ఆసుపత్రిలో చేర్చారు. ఈ హఠాత్పరిణామంతో ఇరుకుటుంబాల బంధుగణమంతా ఒక్కసారిగా ఉలిక్కిపడగా.. తండ్రితో ఎంతో అనుబంధమున్న స్మృతీ మంధాన తీవ్ర దు:ఖసాగరంలో మునిగిపోయింది. ఈ పరిస్థితుల్లో పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదన్న స్మృతి.. ప్రియుడు పలాష్ ముచ్చల్‌తో ఆదివారం జరగాల్సిన వివాహాన్ని వాయిదా వేసుకొంది. ఆసుపత్రిలో ఉన్న తండ్రి కోలుకునేదాకా పెళ్లిని నిరవధికంగా వాయిదా వేయాలని స్మృతీ నిర్ణయించుకుందని ఆమె మేనేజర్ తుహిన్ మిశ్రా మీడియాకు వెల్లడించారు. 'ఇవాళ ఉదయం నుంచే శ్రీనివాస్ నలతగా ఉన్నారు. ఛాతీలో నొప్పి ఉందని చెప్పిన వెంటే ఆయన్ని సాంగ్లీలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించాం. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. తండ్రి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఇప్పుడు పెళ్లి చేసుకోకూడదని స్మృతీ నిర్ణయించుకుంది. ఇదే విషయాన్ని పలాష్ కుటుంబంతో చెప్పగా.. పెళ్లి వాయిదా వేసేందుకు వాళ్లు కూడా అంగీకరించారు' అని తుహిన్ తెలిపారు.





సెనురన్ ముత్తుసామి (109)

రెండో టెస్టు

'తోక'తో కొట్టారు!

టాప్-5 ఆటగాళ్లంతా ఓ మాదిరి స్కోర్లకే పరిమితం కాగా.. తొలి రోజు ఆటలోనే ఆరు వికెట్లు ఫట్. ఇంకేముంది మిగిలిన వికెట్లను చకచకా పడగొట్టి భారత్ తమ ఇన్నింగ్స్‌ను ఆరంభిస్తుందనే అంతా భావించారు. కానీ ఆదివారమంతా దక్షిణాఫ్రికాదే ఆధిపత్యంగా సాగింది. టెయిలెండర్ల నుంచి అనూహ్య పోరాటం ఎదురవడంతో.. మన బౌలర్లకు చుక్కలు కనిపించాయి. బంతులు వేసీ వేసీ అలసిపోయారే తప్ప రెండు సెషన్లలో కలిపి తీసింది ఒక్క వికెట్‌నే. అటు ఏడో నెంబర్ బ్యాటర్ ముత్తుసామి శతకం అందుకోగా.. తొమ్మిదో నెంబర్ బ్యాటర్ యాన్సెన్ ఏకంగా 93 రన్స్‌తో అదుర్స్ అనిపించాడు. ఈ జోడీ ఎదురుదాడికి సఫారీలు సిరీస్‌ను శాసించే స్థితిలో నిలిచారు.


ముత్తుసామి శతకం

యాన్సెన్ సెంచరీ మిస్

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 489

చెమటోడ్చిన భారత బౌలర్లు

గువాహటి: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్టులో భారత బౌలర్లు తేలిపోయారు. ఆదివారం ఆటలో టెయిలెండర్లు సెనురన్ ముత్తుసామి (109), మార్కో యాన్సెన్ (93) అసాధారణ ఇన్నింగ్స్‌తో అలరించారు. వీరికి వెరీన్ (45) కూడా సహకరించడంతో సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 489 పరుగుల భారీ స్కోరు సాధించింది. స్పిన్నర్ కుల్దీప్‌నకు నాలుగు.. పేసర్లు బుమ్రా, సిరాజ్‌లతో పాటు మరో స్పిన్నర్ జడేజాకు రెండేసి వికెట్లు దక్కాయి. చివరి సెషన్ ఆఖర్లో తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ 6.1 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 9 పరుగులతో ఉంది. వెలుతురు లేమితో ఆట కాస్త ముందుగానే ముగియగా, క్రీజులో ఓపెనర్లు జైస్వాల్ (7), రాహుల్ (2) ఉన్నారు. భారత్ ఇంకా 480 పరుగులు వెనుకబడి ఉండడంతో సిరీస్‌ను సమం చేయడం కష్టమే.



యాన్సెన్ (93)

అద్భుత భాగస్వామ్యం: 247/6 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు ఆటను ఆరంభించిన దక్షిణాఫ్రికా దాదాపు మూడు సెషన్ల పాటు ఆడి మరో 242 పరుగులు జోడిస్తుందని ఎవరూ ఊహించివుండరు. లెఫ్ట్ హ్యాండర్ ముత్తుసామి స్పెషలిస్ట్ బ్యాటర్‌గా భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న తీరు ఆకట్టుకుంది. పిచ్ పేస్, స్పిన్‌కు సహకారం అందించకపోవడంతో తొలి సెషన్‌లో వికెట్ తీయలేకపోయారు. ఆరంభంలో ఆచితూచి ఆడినా కుదురుకున్నాక ముత్తుస్వామి, వెరీన్ బౌండరీలతో ఆకట్టుకున్నారు. అద్భుత డిఫెన్స్ కనబర్చిన ముత్తు అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇద్దరూ వికెట్ కోల్పోకూడదనే ఉద్దేశంతో ఆచితూచి ఆడి టీ బ్రేక్‌కు వెళ్లారు. రెండో సెషన్‌లో కాసేపటికే భారత ఎదురు చూపులు ఫలించాయి. జడేజా ఓవర్‌లో ముందుకు వచ్చి ఆడిన వెరీన్‌ను పంత్ స్టంపౌట్ చేయడంతో ఏడో వికెట్‌కు 88 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది.

1 సౌతాఫ్రికా తరఫున ఓ ఇన్నింగ్స్‌లో ఎక్కువ సిక్సర్లు (7) బాదిన బ్యాటర్‌గా డివిల్లీర్స్, డికాక్‌లతో సమంగా నిలిచిన యాన్సెన్. భారత్‌పై టెస్టుల్లో షాహిద్ అఫ్రీదితో సమంగా నిలిచాడు.

2 తొమ్మిది అంతకన్నా దిగువ బ్యాటర్లలో ఇన్నింగ్స్‌లో ఎక్కువ సిక్సర్లు (7) బాదిన రెండో బ్యాటర్‌గా యాన్సెన్. టిమ్ సౌథీ 9 సిక్సర్లతో టాప్‌లో ఉన్నాడు.

యాన్సెన్ ధనాధన్: వెరీన్ నిష్క్రమణతో వచ్చిన యాన్సెన్ ఆట స్వరూపాన్నే మార్చేశాడు. స్పిన్నర్లను లక్ష్యంగా చేసుకుంటూ అలవోకగా సిక్సర్లు బాదేయడంతో స్కోరు వేగంగా పెరిగింది. అతడిని చూసి ముత్తుసామి కూడా కుల్దీప్ ఓవర్‌లో 6,4తో గేరు మార్చాడు. ఈ ధాటికి తన తొలి శతకం కూడా పూర్తయ్యింది. అటు 53 బంతుల్లోనే యాన్సెన్ ఫిఫ్టీ పూర్తి చేశాడు. అయితే చివరి సెషన్ రెండో ఓవర్‌లోనే ముత్తుసామి మారథాన్ ఇన్నింగ్స్‌కు సిరాజ్ ముగింపు పలికాడు. ఫైన్ లెగ్‌లో జైస్వాల్ క్యాచ్ అందుకోవడంతో ఎనిమిదో వికెట్‌కు 107 బంతుల్లో 97 పరుగుల మెరుపు భాగస్వామ్యం ముగిసింది. మరోవైపు యాన్సెన్ మాత్రం దూకుడును ఆపలేదు. వరుసగా జడేజా ఓవర్‌లో రెండు సిక్సర్లు, సిరాజ్ ఓవర్‌లో 4,6తో బెంబేలెత్తించాడు. అటు హార్మర్ (5)ను బుమ్రా బౌల్డ్ చేయడంతో జట్టు తొమ్మిదో వికెట్ కోల్పోయింది. అయితే ఆఖరి వికెట్‌కు కేశవ్ (12 నాటౌట్) అండగా నిలవడంతో యాన్సెన్ సెంచరీ ఖాయమనిపించింది. కానీ శతకం సాధించే క్రమంలో గేమ్‌ప్లాన్‌ను మార్చుకుని డిఫెన్స్‌కు పరిమితమయ్యాడు. దీంతో ఒత్తిడికి గురై 7 పరుగుల దూరంలో కుల్దీప్ గూగ్లీకి బౌల్డ్ కావడంతో నిరాశ తప్పలేదు. మరోవైపు సఫారీల అద్భుత పోరాటం కూడా ముగిసింది.

స్కోరుబోర్డు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: మార్‌క్రమ్ (బి) బుమ్రా 38, రికెల్టన్ (సి) పంత్ (బి) కుల్దీప్ 35, స్టబ్స్ (సి) రాహుల్ (బి) కుల్దీప్ 49, బవుమా (సి) జైస్వాల్ (బి) జడేజా 41, డి జోర్జి (సి) పంత్ (బి) సిరాజ్ 28, ముల్డర్ (సి) జైస్వాల్ (బి) కుల్దీప్ 13, ముత్తుస్వామి (సి) జైస్వాల్ (బి) సిరాజ్ 109, వెరీన్ (స్టంప్) పంత్ (బి) జడేజా 45, యాన్సెన్ (బి) కుల్దీప్ 93, హార్మర్ (బి) బుమ్రా 5, కేశవ్ (నాటౌట్) 12; **ఎక్స్‌ట్రాలు: 21, మొత్తం: 151.1 ఓవర్లలో 489 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-82, 2-82, 3-166, 4-187, 5-201, 6-246, 7-334, 8-431, 9-462, 10-489. **బౌలింగ్:** బుమ్రా 32-10-75-2, సిరాజ్ 30-5-106-2, నితీశ్ 6-0-25-0, సుందర్ 26-5-58-0, కుల్దీప్ 29.1-4-115-4, జడేజా 28-2-94-2.

భారత్ తొలి ఇన్నింగ్స్: యశస్వీ జైస్వాల్ (బ్యాటింగ్) 7, రాహుల్ (బ్యాటింగ్) 2; **ఎక్స్‌ట్రాలు:0, మొత్తం: 6.1 ఓవర్లలో 9/0. బౌలింగ్:** యాన్సెన్ 3.1-1-9-0, ముల్డర్ 3-3-0-0.

టెస్టు మ్యాచ్ జోక్ అనుకున్నారా?



రెండో రోజు ఆటలో ఓవర్ వేసేందుకు ఎక్కువ సమయం తీసుకోవడంతో స్పిన్నర్ కుల్దీప్‌పై తాత్కాలిక కెప్టెన్ పంత్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. అప్పటికే అంపైర్ రెండుసార్లు హెచ్చరించాడు. మూడోసారి ఇదే రిపీట్ అయితే జట్టుపై 5 పరుగుల పెనాల్టీ విధిస్తారు. దీంతో పంత్ ఘాటుగా స్పందిస్తూ.. '30 సెకన్ల టైమర్ ఆన్‌లో ఉంది. ఇంట్లో ఆడుతున్నావా? బంతి త్వరగా వెయ్' అని కుల్దీప్‌కు సూచించాడు. ఇతర ఆటగాళ్లు కూడా ఓవర్ ముగిశాక నెమ్మదిగా కదులుతుండడంతో అసంతృప్తి చెందాడు. 'కుల్దీప్‌ను రెండుసార్లు హెచ్చరించారు. మీరు కదిలేందుకు పూర్తి ఓవర్ కావాలా? మీరంతా టెస్టు క్రికెట్‌ను జోక్‌గా భావిస్తున్నారు' అని పంత్ వారిపై కోపగించుకున్నాడు.

రాహుల్‌కు వన్డే పగ్గాలు

● బుమ్రాకు విశ్రాంతి ● తిలక్‌కు పిలుపు
● దక్షిణాఫ్రికాతో వన్డేలకు భారత జట్టు



న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికాతో జరగబోయే మూడు వన్డేల సిరీస్ కోసం భారత జట్టును ప్రకటించారు. రెగ్యులర్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మెడ నొప్పితో బాధపడుతుండగా.. అతడి స్థానంలో జట్టు పగ్గాలు కేఎల్ రాహుల్‌కు అప్పగించారు. ఈనెల 30 నుంచి డిసెంబరు 6 వరకు జరిగే సిరీస్ కోసం సెలెక్టర్లు 15 మందితో కూడిన జాబితాను ఆదివారం వెల్లడించారు. ఇటీవల ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన వన్డే జట్టు నుంచి నాలుగు మార్పులు చేశారు. కీపర్ రిషభ్ పంత్ జట్టులోకి వచ్చాడు. శ్రేయాస్ అయ్యర్ కూడా గాయంతో దూరం కావడంతో రాహుల్‌కు డిప్యూటీగా పంత్ వ్యవహరించనున్నాడు. అలాగే శ్రేయాస్ అయ్యర్ స్థానంలో హైదరాబాదీ తిలక్ వర్మకు చోటు దక్కింది. రెండేళ్ల క్రితం తను భారత్ తరఫున చివరి వన్డే ఆడాడు. ఇటీవల భారత్ 'ఎ' తరఫున ఆడి ఫామ్ నిరూపించుకున్న రుతురాజ్ గైక్వాడ్ కూడా జట్టులోకి వచ్చాడు. శ్రేయాస్ స్థానం కోసం ఈ ఇద్దరి మధ్య పోటీ నెలకొంది. అయితే ఆసీస్ పర్యటనలో రాణించినప్పటికీ స్పిన్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ స్థానంలో వెటరన్ జడేజాను తీసుకున్నారు. పేసర్ సిరాజ్ మాత్రం ఆ టూర్‌లో ఆడిన మూడు వన్డేల్లో కేవలం రెండు వికెట్లు మాత్రమే తీయడంతో తనను పరిగణనలోకి తీసుకోలేదు. మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. పంత్ జట్టులో ఉన్నా ధ్రువ్ జురెల్‌కు సెలెక్టర్లు అవకాశం ఇవ్వడం విశేషం. స్టార్ పేసర్ బుమ్రాకు విశ్రాంతినిచ్చారు. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా గాయం కారణంగా మరోసారి నితీశ్ కుమార్‌తో కొనసాగనున్నారు.

వన్డే జట్టు
రాహుల్ (కెప్టెన్), రోహిత్, విరాట్ కోహ్లీ, జైస్వాల్, తిలక్, రుతురాజ్, జురెల్, పంత్, సుందర్, జడేజా, కుల్దీప్, నితీశ్, హర్షిత్, అర్షదీప్, ప్రసిద్ధ్.

అమర్ సింగ్ రికార్డు ప్రదర్శన

న్యూఢిల్లీ: భారత రేసర్ అమర్ సింగ్ దేవాండ అంతర్జాతీయ స్థాయిలో రికార్డు ప్రదర్శన చేశాడు. బ్యాంకాక్‌లో జరిగిన ఆసియా ఓషియానా 100 కిలోమీటర్ల అల్ట్రా చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచాడు. అతను 6 గంటల 59 నిమిషాల 37 సెకన్ల జాతీయ రికార్డు టైమింగ్‌తో రేస్ ముగించాడు.

భారత్-ఎ గెలుపు

బెంగళూరు: ఆదిత్య రావత్ (4/34), మాలిక్ (4/49) బంతితో విజృంభించగా.. ఆల్‌రౌండర్ ఇనాన్ (105 నాటౌట్) సెంచరీతో చెలరేగాడు. దీంతో అండర్-19 ముక్కోణపు సిరీస్‌లో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత్-బిపై 26 పరుగులతో నెగ్గిన భారత్-ఎ ఫైనల్ బెర్త్‌ను దాదాపుగా ఖాయం చేసుకొంది. తొలుత భారత్-ఎ నిర్ణీత 50 ఓవర్లలో 269/7 స్కోరు చేసింది. కెప్టెన్ విహాన్ మల్హోత్రా (42), ఖిలన్ పటేల్ (37) రాణించారు. జగన్నాథన్, రోహిత్, కిశోర్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం ఛేదనలో భారత్-బి 47.2 ఓవర్లలో 243 పరుగులకు కుప్పకూలింది. హర్వంశ్ (99) త్రుటిలో శతకం చేజార్చుకొన్నాడు.

ఫైనల్లో జావోఖిర్ x వీ యి

చెస్ విశ్వకప్

పనాజీ: చెస్ వరల్డ్‌కప్ ఫైనల్లో అమీతుమీ తేల్చుకొనేందుకు జావోఖిర్ సిందరోవ్ (ఉజ్బెకిస్థాన్), వీ యి (చైనా) సిద్ధమయ్యారు. ఆదివారం జరిగిన రెండు సెమీఫైనల్స్‌లో జావోఖిర్, వీ యి గెలిచి ఫైనల్లో ప్రవేశించారు. సెమీస్‌లో వీరు సాధించిన విజయాలతో కాండిడేట్స్ టోర్నీకి కూడా అర్హత సాధించారు. ఇక, సెమీస్‌లోని రెండు క్లాసికల్ గేమ్‌లు డ్రాగా ముగియడంతో టైబ్రేకర్లు అనివార్యమయ్యాయి. ఇందులో జావోఖిర్ 2.5-1.5తో నోడిర్బెక్‌పై, వీ యి 2.5-1.5తో ఆంద్రీ ఎసిపెంకోపై గెలిచారు.

బంగ్లాదేశ్ క్లీన్‌స్వీప్

మిర్పూర్: ఐర్లాండ్‌తో రెండు టెస్టుల సిరీస్‌ను బంగ్లాదేశ్ 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. 509 పరుగుల భారీ ఛేదన కోసం బరిలోకి దిగిన ఐర్లాండ్ ఆదివారం ఆఖరి రోజు 291 పరుగులకే పరిమితమైంది. దీంతో బంగ్లా 217 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. అంతకుముందు ఐర్లాండ్ ఓవర్‌నైట్ స్కోరు 176/6 తో రెండో ఇన్నింగ్స్ ఆరంభించగా.. కాంఫర్ (71 నాటౌట్) పోరాడాడు. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లా 476, ఐర్లాండ్ 265 రన్స్ చేయగా.. బంగ్లా రెండో ఇన్నింగ్స్‌ను 297/4 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది.

గంజాయి సాగును నియంత్రించాం: డీజీపీ



డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీలో సైకిల్ తొక్కుతున్న డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ తదితరులు

విజయవాడ(అజిత్‌సింగ్‌నగర్), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గంజాయి సాగును నియంత్రించామని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా చెప్పారు. ఆదివారం ఈగల్ ఆధ్వర్యంలో విజయవాడలో 10 కిలోమీటర్ల సైకిల్ ర్యాలీ నిర్వహించి డ్రగ్స్ వాడకంతో జరిగే అనర్థాలను వివరించారు. 'డ్రగ్స్ వద్దు బ్రో... సైకిల్ తొక్కు బ్రో' నినాదాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. డీజీపీ సైతం ప్లకార్డు పట్టి సైకిల్ తొక్కారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వ్యతిరేక ఉద్యమంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం ద్వారా వచ్చే డబ్బు ఉగ్రవాద సంస్థలకు చేరుతోందని, దేశాన్ని ప్రేమించేవారు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు, డీసీపీ సరిత తదితరులు పాల్గొన్నారు.

పంటల ధరలు పతనమైనా రైతులవైపు చూడరేం?

- సీఎం చంద్రబాబును ఉద్దేశించి జగన్ పోస్ట్



అమరావతి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పంటల ధరలు దారుణంగా పతనమైనా రైతుల వైపు కన్నెత్తయినా చూడలేదెందుకని ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశించి వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదివారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. 'ప్రభుత్వం నుంచి ఏమాత్రం ఆసరా లేక రైతులు తాము వేసిన పంటలను తామే ట్రాక్టర్లతో దున్ని వేసే పరిస్థితులు మీరు తీసుకువచ్చారు. ఇలా మీ దుర్మార్గ పాలనతో రైతుల ఒంటిమీద ఉన్నచొక్కాను కూడా తీసివేసి వారిని రోడ్డు మీద నిలబెట్టారు. పబ్లిసిటీ కోసం రైతన్నా మీకోసం అంటూ ప్రకటలను ఇస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మీ మోసాలను ప్రశ్నిస్తూ, మీ నిర్లక్ష్యాన్ని కడిగేస్తూ, మీ కాలర్ పట్టుకునేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారనే విషయాన్ని మరచిపోవద్దు' అని జగన్ ట్వీట్ చేశారు.

ఎస్సీ, ఎస్టీలకు యూపీఎస్సీ ఉచిత కోచింగ్

అమరావతి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువత యూపీఎస్సీ సివిల్స్‌కు సిద్ధమయ్యేందుకు ఉచిత శిక్షణ అందిస్తున్నామని అంబేడ్కర్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వి.ప్రసన్న వెంకటేశ్ ఆదివారం తెలిపారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిల్లోని అంబేడ్కర్ స్టడీ సర్కిళ్లలో నాలుగు నెలల శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఈ నెల 26 వరకూ స్వీకరిస్తామని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన

- మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ప్రకటన

అమరావతి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ భారీగా ప్రోత్సాహం అందిస్తోంది. 12 రంగాల్లో 2029 నాటికి మొత్తం రూ.66,523 కోట్లు పెట్టుబడులు సమీకరించేందుకు సమాయత్తమైంది. అందుకోసం పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో సమగ్ర వ్యూహాన్ని సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 2.30 లక్షల మందికి ఉపాధి సృష్టిస్తామని మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పీపీపీ ప్రాజెక్టులను విజయవంతంగా అమలుచేయడం కోసం ప్రత్యేక యూనిట్‌ను ఏర్పాటు చేశామని, రోడ్ మ్యాప్ కూడా సిద్ధమైందని, ఈ బ్లూప్రింట్‌ను విశాఖపట్నంలో జరిగిన భాగస్వామ్య సదస్సులో ప్రదర్శించినట్లు వివరించారు.

నిర్మాత కల్యాణ్‌నే ఎన్‌కౌంటర్ చేయాలి!

- ఐ బొమ్మ రవి తండ్రి చిన అప్పారావు వ్యాఖ్యలు

విశాఖపట్నం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సినీ నిర్మాణ సి.కల్యాణ్‌నే పోలీసులు ఎన్‌కౌంటర్ చేయాలని ఐ బొమ్మ రవి తండ్రి చినఅప్పారావు డిమాండ్ చేశారు. ఆదివారం విశాఖలోని ఆయన నివాసానికి వచ్చిన మీడియా ప్రతినిధులు... ఐబొమ్మ రవిని ఎన్‌కౌంటర్ చేయాలని నిర్మాత కల్యాణ్ చేసిన డిమాండ్‌ను ప్రస్తావించగా.. ఆయన పైవిధంగా ప్రతిస్పందించారు. 'కల్యాణ్ చెప్పినట్టే పోలీసులు రవిని ఎన్‌కౌంటర్ చేసేస్తే ఇక చట్టాలు ఎందుకు?' అని ప్రశ్నించారు. అసలు సినిమా పైరసీ ఎందుకు వచ్చిందనే దానితో పాటు దానిని ప్రజలు ఎందుకు ఆదరిస్తున్నారో కల్యాణ్ ఒకసారి ఆలోచించుకోవాలన్నారు.

'అండమాన్'లో తీవ్ర అల్పపీడనం

- నేడు బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

విశాఖపట్నం/అమరావతి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మలక్కా జలసంధి, దక్షిణ అండమాన్ సముద్రంలో ఉన్న అల్పపీడనం ఆదివారం తీవ్ర అల్పపీడనంగా బలపడి అక్కడే కొనసాగుతోంది. ఇది సోమవారం నాటికి వాయుగుండంగా, 27వ తేదీకల్లా ఆగ్నేయ బంగాళాఖాతంలో తుఫాన్‌గా బలపడనుంది. సముద్రంలోనే బలహీనపడుతుందని కొందరు నిపుణులు చెబుతుండగా, మరికొన్ని మోడళ్ల మేరకు దిశ మార్చుకుని బంగ్లాదేశ్ వైపు వెళ్తుందని అంచనావేశారు. ఇదిలావుండగా శ్రీలంక సమీప కామరూన్, నైరుతి బంగాళాఖాతంలో సోమవారం మరో అల్పపీడనం ఏర్పనుంది.

కూర'గాయాలు'

(మొదటి పేజీ తరువాయి)

సొరకాయ సైజును బట్టి రూ.30-40పైనే ఉంటున్నాయి. ఇవే రకాలు రైతుబజార్లలో కాస్త తక్కువగా ఉన్నా.. అక్కడ రెండో మూడో రకాలే ఉంటున్నాయని వినియోగదారులు అంటున్నారు. అయినా బహిరంగ మార్కెట్‌లో భారీ ధరలకు కూరగాయలు కొనలేని సామాన్యులు పట్టణాలు, నగరాల్లోని రైతుబజార్లకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. ప్రకృతి వైపరీత్యం వల్ల కూరగాయల ఉత్పత్తి తగ్గడంతో రైతుబజార్లలోనూ మామూలుగా కన్నా ధర ఎక్కువగానే ఉంటోందని కొనుగోలుదారులు వాపోతున్నారు. తుఫాను గాలుల ధాటికి తీగ పంటలు దెబ్బతినగా, లంక గ్రామాల్లో



వరద ముంపుతో నేల పంటలు పాడయ్యాయి. ఇదే సమయంలో కొందరు అయ్యప్ప, భవానీ, శివమాలలు ధరించడం వల్ల శాఖాహారంగా కూరగాయల వినియోగం పెరిగింది.

చికెన్ ధరకు రెక్కలు

కార్తీక మాసంలో చాలా మంది మాంసాహారానికి దూరంగా ఉన్నా.. చికెన్ ధరలు తగ్గలేదు. మొన్నటి దాకా కిలో చికెన్ రూ.240-260 పలికింది. ఇప్పుడు కొన్ని చోట్ల ధర రూ.280కి చేరింది. కార్తీక మాసం ముగియడంతో నాన్‌వెజ్ వినియోగం పెరిగి, చికెన్ ధర ఇంకొద్దిగా పెరిగే అవకాశాలున్నాయని వ్యాపారులు అంటున్నారు.

మీ కష్టం నాకు తెలుసు

(మొదటి పేజీ తరువాయి)

తానూ పాల్గొంటానని సీఎం ప్రకటించిన సంగతి తెలిసిందే. సంక్షిప్తంగా ఆయన లేఖ సారాంశమిదీ..


మీతో కలిసి నడుస్తా..

నేనూ రైతు బిడ్డనే.. రాష్ట్రంలోని ప్రతి కర్షకుడి కష్టం నాకు తెలుసు. మీతో కలిసి నడవడానికి, మీ సమస్యలను పరిష్కరించడానికి, మీకు పూర్తి అండగా ఉంటానని ఈ సందర్భంగా హామీ ఇస్తున్నా. రాష్ట్ర ఆర్థిక సౌధానికి మూల స్తంభం.. వ్యవసాయ రంగమే. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్థక, మత్స్య రంగాలు రాష్ట్ర జీఎస్‌డీపీలో 35% వరకు వాటా అందిస్తూ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపిస్తున్నాయి. 2047 నాటికి ప్రజల తలసరి ఆదాయం రూ.55 లక్షలుగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందులో భాగంగా వ్యవసాయం, అనుబంధ రంగాల్లో సగటున ఏడాదికి 15% వృద్ధి రేటు సాధించాలని నిర్దేశించుకున్నాం. రానున్న ఐదేళ్లలో రైతును రాజును చేసేందుకు ఐదు విధానాలతో కార్యాచరణ అమలు చేస్తున్నాం. రాష్ట్రంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించే దిశగా.. అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం.

సాగు పద్ధతులు మారాలి..

సమాజంలో నేడు మారుతున్న ఆహార అలవాట్లకు అనుగుణంగా అన్నదాతలు సాగు పద్ధతులు మార్చుకోవాలి. పంటల మార్పిడి పాటించాలి. రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు వంటి వాటికి మళ్లీ డిమాండ్ వచ్చింది. చిరుధాన్యాల సాగు మరింత పెరగాలి. వాతావరణ మార్పులు తట్టుకునే పరిష్కార మార్గంగా ప్రకృతి వ్యవసాయాన్ని పెద్దఎత్తున అవలంబించాలి. సాగుకు టెక్నాలజీ తోడైతే మన రైతులకు తిరుగుండదు. అందుకే అగ్రిటెక్‌ను ప్రోత్సహిస్తున్నాం. ప్రతి రైతుకు ఏపీ ఫార్మర్ రిజిస్ట్రీ పథకంలో 'యూనిక్ ఐడీ'ల నమోదుతో పథకాలు వర్తింపజేస్తున్నాం. ఎస్సీ, ఎస్టీ రైతులకు బిందు సేద్యంపై.. గత ప్రభుత్వం రద్దుచేసిన 100% సబ్సిడీని పునరుద్ధరించాం. ప్రకాశం, రాయలసీమ జిల్లాల్లో పదెకరాలలోపు రైతులకు గత ప్రభుత్వం సబ్సిడీ తగ్గిస్తే.. దాన్ని 90 శాతానికి పెంచాం.

> అన్నదాతలే ఈ రాష్ట్రానికి నిజమైన సంరక్షకులు. మీరు పండించే ప్రతి గింజ, ప్రతి పంటా రాష్ట్రానికి బలం. మీ శ్రమతో, సహన శక్తితో మాత్రమే ఏపీ కల నిజమవుతుంది.
>
> సంపద సృష్టి జరగడానికి పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షిస్తున్నాం. విశాఖ భాగస్వామ్య సదస్సుకు మంచి స్పందన వచ్చింది. 613 ఒప్పందాలు చేసుకున్నాం. వీటి ద్వారా రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు, 16 లక్షల ఉద్యోగాలు వస్తాయి. - సీఎం చంద్రబాబు



యంత్రాలు, టెక్నాలజీ వాడకంతో వ్యవసాయంలో పెట్టుబడి వ్యయం తగ్గుతుంది. వ్యక్తిగతంగా రైతులకు యంత్రాలు సరఫరా చేస్తున్నాం. కిసాన్ డ్రోన్ సేవలు అందిస్తోంది.

అగ్రి ప్రెన్యూర్ రావాలి..

రైతుల పంటలకు విలువ పెరగాలంటే ఫుడ్ ప్రాసెసింగ్ జరగాలి. దీనికోసం రూ.13వేల కోట్ల పెట్టుబడితో 38 ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు సీఐఐ సదస్సులో ఎంవోయూలు కుదుర్చుకున్నాం. ఎంటర్‌ప్రెన్యూర్‌లా.. అగ్రి ప్రెన్యూర్ రావాలి. ఫుడ్ ప్రాసెసింగ్ రంగం దానికి నాంది పలుకుతుంది. సీసీసీ అంటే.. కాఫీ, కోకో, కోకోనట్ వంటి పంటలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. 175 నియోజకవర్గాల్లో ఎంఎస్‌ఎంఈల ఏర్పాటుతో ఫుడ్ ప్రాసెసింగ్‌కు ప్రోత్సాహం ఇస్తున్నాం.

రైతు కుటుంబాలకు 6,310 కోట్లు..

రైతులకు పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం కింద రెండు విడతల్లో ఒక్కొక్కరికీ రూ.14వేల వంతున 46,86,838 రైతు కుటుంబాలకు రూ.6,310 కోట్లు ఇచ్చాం. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు ఉపశమనంగా ప్రధాన పంటలకు రూ.8 వేలు (హెక్టారుకు రూ.17 వేల నుంచి రూ.25 వేలకు) పెంచి ప్రత్యేక పరిహారాన్ని ప్రకటించాం. మార్కెట్ ధరలు తగ్గిన పరిస్థితుల్లో, రైతులను ఆదుకోవడానికి మద్దతు ధర, మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకాల ద్వారా వరి, కంది, మినుము, పెసర, శనగ, టమాటా, ఉల్లి, మామిడి, కోకో పంట ఉత్పత్తులను కొనుగోలు చేశాం. రైతులను ఆదుకోవడానికి మొదటిసారిగా పొగాకును కూడా కొనుగోలు చేశాం. 24-48 గంటల్లోనే సొమ్ము చెల్లించాం. ఉల్లి రైతులకు అండగా నిలిచేందుకు హెక్టారుకు రూ.50 వేలు సాయం ప్రకటించాం. మామిడి కిలోకి రూ.4, కోకో పంటకు రూ.50 అదనంగా చెల్లించాం. దీనివల్ల కోకో రైతులకు రూ.11.84 కోట్లు, మామిడి రైతులకు రూ.190 కోట్లు ప్రత్యక్ష లబ్ధి చేకూరింది.

పాడికి ప్రోత్సాహం..

పశుసంవర్ధక రంగంలో రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి మూడు స్థానాల్లో నిలపడానికి పాలు, మాంస ఉత్పత్తికి తగిన చర్యలు తీసుకుంటున్నాం. గుడ్ల ఉత్పత్తిలో మొదటి స్థానంలో కొనసాగుతున్నాం. మెరుగైన పౌల్ట్రీ పాలసీ(2025-30) తీసుకొస్తున్నాం. పాడి పరిశ్రమకు ఇతోధిక ప్రోత్సాహానికి గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు నీటి తొట్టెల నిర్మాణం, మెరుగైన వసతి గృహాలు(గోకులాలు), పశుగ్రాసం పెంపకం, పశుదాణా పంపిణీ, ఆరోగ్య పరిరక్షణకు అన్ని రకాల టీకాలు అందిస్తాం. మాంసం ఉత్పత్తికి బ్రాయిలర్ కోళ్ల పెంపకం, దేశవాళీ కోళ్ల పెంపకానికి ప్రోత్సాహం(ఎన్‌ఎంఎల్), మాంస ఉత్పత్తి, శుద్ధి కేంద్రాల స్థాపన, విలువ ఆధారిత ఉత్పత్తులకు ప్రోత్సాహం ఇస్తున్నాం. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నాం. సూపర్‌సిక్స్ హామీల్లో ప్రతి హామీనీ అమల్లోకి తెచ్చాం. 17 నెలల కాలంలో సూపర్ సిక్స్‌ను సూపర్‌హిట్ చేశాం. తల్లికి వందనం, స్త్రీశక్తి-ఉచిత బస్సు, దీపం-2, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, 20లక్షల ఉద్యోగాలు, మెగా డీఎస్సీ, అన్నదాత సుఖీభవ అమలు చేశాం.

అమరావతికి బ్యాంకులు వస్తున్నాయ్!

- 28న నేలపాడులోని ఆర్బీఐ భవన నిర్మాణానికి.. కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ భూమిపూజ
- అదే రోజు మరో 25 ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులకూ..

గుంటూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో ఏర్పాటు కానున్న ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయ నిర్మాణానికి ఈ నెల 28న శంకుస్థాపన చేయనున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈనెల 28న నేలపాడులో ఆర్బీఐకి కేటాయించిన 3 ఎకరాల స్థలంలో భూమిపూజ చేయనున్నారు. అలాగే, మరో 25 జాతీయ, ప్రైవేటు, ప్రభుత్వరంగ బ్యాంకుల నూతన భవనాలకు ఆమె శంకుస్థాపన చేస్తారు. ఈ మేరకు మంత్రి నిర్మలా సీతారామన్ పర్యటన షెడ్యూల్ విడుదలయింది. వాస్తవానికి గతనెల 28వ తేదీన ఈ శంకుస్థాపన మహోత్సవాన్ని నిర్వహించాలని ఏపీసీఆర్డీఏ భావించినా, మొంథా తుఫాను ప్రభావంతో వాయిదా పడింది. కాగా, ఈ నెల 28న శంకుస్థాపనల కార్యక్రమాల సందర్భంగా సీఆర్డీఏ కార్యాలయం వద్ద భారీ సభను ఏర్పాటు చేయనున్నారు. ఈ సభకు కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, పెమ్మసాని చంద్రశేఖర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరవుతారు.

నెల్లూరు జిల్లాలో 'బిర్లాన్యూ' ఫైబర్ సిమెంట్ ప్లాంట్

- తొలిదశలో రూ.127 కోట్ల పెట్టుబడి.. 600 మందికి ఉద్యోగాలు.. సీఎండీ అక్షత్‌సేథ్

అమరావతి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ ఫైబర్ సిమెంట్ బోర్డు ప్లాంటు ఏర్పాటుకు 'బిర్లాన్యూ' బిల్డింగ్-మెటీరియల్స్, హోమ్ సొల్యూషన్ కంపెనీ ముందుకు వచ్చింది. ఇందుకుగాను తొలిదశలో రూ.127 కోట్లు వెచ్చించనున్నట్లు ఆ కంపెనీ సీఎండీ అక్షత్ సేథ్ వెల్లడించారు. ఆదివారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. ఈ ప్లాంట్ స్థాపనతో 600 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు దక్కుతాయని వివరించారు. నెల్లూరు జిల్లాలో స్థాపించే ప్లాంటు బిర్లా న్యూ విస్తరణ ప్రయాణంలో ఒక మైలురాయిగా నిలుస్తుందని సేథ్ పేర్కొన్నారు. ఇక్కడ అత్యాధునిక సాంకేతిక నైపుణ్యంతో కూడిన భవన నిర్మాణ పరికరాలు డిజైన్ చేస్తామని చెప్పారు. తాము తయారు చేసే భవన పరికరాలు అందుబాటు ధరల్లో ఉంటాయని సేథ్ వెల్లడించారు. తమ ప్లాంట్ వల్ల నెల్లూరులో సర్క్యులర్ ఎకానమీ పెరుగుతుందని వివరించారు. రెండో దశలో పీవీసీ పైపులు, ఫిట్టింగులు వంటివాటి ఉత్పత్తితో పరిశ్రమను విస్తరించి, ఇంటిగ్రేటెడ్ తయారీ సామర్థ్యాలను బలోపేతం చేస్తామన్నారు.

టెట్ రాసేద్దాం!

- 32 వేల మంది ఇన్‌సర్వీస్ టీచర్ల దరఖాస్తు

అమరావతి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను రాయాలని రాష్ట్రంలోని వేలాది మంది టీచర్లు నిర్ణయం తీసుకున్నారు. 32 వేల మందికి పైగా ఇన్‌సర్వీసు టీచర్లు టెట్‌కు దరఖాస్తు చేయగా.. మొత్తంగా 2,58,638 అప్లికేషన్లు వచ్చాయి. ఇన్‌సర్వీసు టీచర్లకు కూడా టెట్ తప్పనిసరని పేర్కొంటూ సుప్రీంకోర్టు గత సెప్టెంబరులో ఇచ్చిన తీర్పుపై ఏపీతో పాటు పలు ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు రివ్యూ పిటిషన్లు దాఖలు చేశాయి. దీంతో టెట్ నుంచి మినహాయింపు లభిస్తుందని దేశవ్యాప్తంగా టీచర్లు ఎదురుచూస్తున్నారు. కాగా, వచ్చే ఏడాది డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని ప్రకటించిన రాష్ట్రప్రభుత్వం.. గత నెల టెట్ నోటిఫికేషన్ జారీచేసింది. వచ్చే నెల నుంచి టెట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అయితే మినహాయింపు లభిస్తుందో లేదోనన్న సందేహంతో 32 వేల మంది టీచర్లు టెట్ రాసేందుకు సిద్ధపడ్డారు. టెట్ దరఖాస్తుల గడువు ఆదివారంతో ముగిసింది. మొత్తం 32,016 మంది ఇన్‌సర్వీస్ టీచర్లు దరఖాస్తు చేశారు.

2 వేల పోస్టులతో కొత్త నోటిఫికేషన్!

వచ్చే ఏడాది డీఎస్సీ నోటిఫికేషన్ జారీచేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఏడాది 16వేలకు పైగా పోస్టులు భర్తీచేసినా.. కొత్తగా ఏర్పడే ఖాళీలతో 2 వేల పోస్టులతో కొత్త డీఎస్సీ ఉంటుందని అంచనా. ఈ నేపథ్యంలో టెట్‌కు దరఖాస్తులు పెరిగాయి. కాగా, ఇప్పటికే టీచర్ ఉద్యోగాల్లో ఉన్నవారు సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తేదీ నుంచి రెండేళ్లలో టెట్ అర్హత సాధించాల్సి ఉంది.

ఉత్తీర్ణత శాతం పెంపునకు 'సంకల్ప్'

- ఇంటర్ విద్యాశాఖ 50 రోజుల ప్రణాళిక

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఉత్తీర్ణత శాతం పెంపు లక్ష్యంతో ఇంటర్ విద్యాశాఖ 'సంకల్ప్' పేరుతో 50 రోజుల కార్యాచరణ ప్రణాళిక ప్రకటించింది. సోమవారం నుంచే ఈ ప్రణాళికను అమలు చేయనుంది. ఇందులో భాగంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల ఆధారంగా వారిని 3 రకాలుగా వర్గీకరిస్తారు. 50రోజుల ప్రణాళికలో రోజూ ఉదయం నుంచి 12.40 గంటల వరకు రెగ్యులర్ సిలబస్ బోధిస్తారు. మధ్యాహ్నం పునశ్చరణ, అసైన్‌మెంట్లు, స్లిప్‌టెస్టులు నిర్వహిస్తారు. ప్రతి రోజూ మధ్యాహ్నం సమయాన్ని స్లాట్లుగా విభజించి.. ఏ కేటగిరీలో ఉన్న విద్యార్థులకు మొత్తం సిలబస్‌ను రివిజన్ చేస్తారు. బీ, సీ కేటగిరీల్లో ఉన్న విద్యార్థులకు ఒక పెద్ద ప్రశ్న, రెండు చిన్న ప్రశ్నలకు సమాధానాలు నేర్చుకునేలా బోధిస్తారు.

పెళ్లి వేడుకలోనూ రప్పా.. రప్పా!

- రాప్తాడు జగన్ పర్యటనలో ప్లకార్డులు



జగన్ వస్తున్న సందర్భంగా అభిమాని ప్రదర్శించిన ప్లకార్డు

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్ పర్యటించిన ప్రతి చోటా రప్పా-రప్పా పోస్టర్లు దర్శనమిస్తున్నాయి. తాజాగా ఆదివారం ఆయన అనంతపురం జిల్లా రాప్తాడులో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి సోదరుడి కుమార్తె వివాహానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కూడా 'రప్పా.. రప్పా.. 2.0' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. దీనిపై విమర్శలు వెల్లువెత్తాయి. జగన్ ర్యాలీగా రావడంతో దారి పొడవునా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి సాధారణ ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

కోటరీ జగన్‌ను తప్పుదారి పట్టిస్తోంది

- చుట్టూ నిబద్ధతలేని వ్యక్తులున్నారు.. వారి వల్లే పార్టీకి దూరంగా ఉన్నాను
- చంద్రబాబుతో వ్యక్తిగత వైరం లేదు
- పవన్‌తో 20 ఏళ్లుగా స్నేహం: విజయసాయి



శ్రీకాకుళం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'జగన్‌కు చెప్పేది ఒక్కటే.. అప్పుడైనా, ఇప్పుడైనా ఆయన చుట్టూ నిబద్ధతలేని వ్యక్తులున్నారు. వారి మాటలను జగన్ నమ్మకూడదు. చుట్టూ ఉన్న కోటరీ ఆయన్ను తప్పుదారి పట్టిస్తోంది. వారి వల్లే పార్టీకి దూరంగా ఉన్నాను" అని వైసీపీ మాజీ నాయకుడు, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. శ్రీకాకుళం మండలం అంపోలు సమీపంలో ఆదివారం నిర్వహించిన రెడ్డి సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. "ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉన్నాను. కొత్త పార్టీ పెట్టే ఆలోచన కానీ.. ఇతర పార్టీల్లో చేరే ఉద్దేశం కానీ లేదు. అవసరం వచ్చినప్పుడు తిరిగి రాజకీయాల్లోకి వస్తాను. జగన్ పార్టీని మేనేజ్ చేసుకోగలడు. గతంలో నాపై చాలా ఒత్తిడి ఉండేది. నేను వేటికీ తలొగ్గలేదు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో గత ఇరవై ఏళ్లుగా మంచి స్నేహం ఉంది. ఎప్పుడూ పవన్‌ను విమర్శించలేదు. సీఎం చంద్రబాబుతో ఎలాంటి వ్యక్తిగత వైరం లేదు' అన్నారు. శ్రీకాకుళంలో నిర్మిస్తున్న రెడ్డి సంక్షేమ భవన నిర్మాణానికి అవసరమైన ఖర్చును తానే భరిస్తున్నట్లు చెప్పారు.

మేమే ఆపాం

- మీ-భూమిలో గ్రామ అడంగల్ తొలగించాం
- వెబ్‌సైట్‌లో ఈ ఏడాదే బ్లాక్ చేశాం..
- అంగీకరించిన రెవెన్యూ శాఖ
- అన్నీ డొంకతిరుగుడు సమాధానాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

చట్టబద్ధమైన డిజిటల్ భూముల రికార్డుల వ్యవస్థ మీ-భూమి పోర్టల్ నుంచి గ్రామ అడంగల్‌ను తామే తొలగించామని రెవెన్యూ శాఖ అంగీకరించింది. డేటా దోపిడీని అడ్డుకునేందుకు, పైరసీదారులకు సమాచారం చిక్కకుండా ఉండేందుకే వెబ్‌సైట్ నుంచి గ్రామ అడంగల్ ఆప్షన్‌ను తొలగించినట్లు భూ పరిపాలన ప్రధాన కమిషనర్(సీసీఎల్ఏ), రెవెన్యూ శాఖ ప్రత్యేక సీఎస్ జి. జయలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలకు మరిన్ని సేవలందించేందుకు ప్రవేశపెట్టిన నూతన మాడ్యూలు, బల్క్ డౌన్‌లోడ్ వల్ల సర్వర్‌పై ఎక్కువ భారం పడి మీ-భూమి యాక్సెస్ మందగించిందని, బల్క్ డౌన్‌లోడ్‌ల ప్రక్రియను నిలిపివేశామని తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్-మేలో కొన్ని అనుమానాస్పద ప్రైవేటు యాప్‌లు, అనధికారిక వెబ్‌సైట్‌లు మీ-భూమి నుంచి మొత్తం డేటా సెట్లను కాపీ చేసినట్లు గుర్తించామని తెలిపారు. ఈ నేపథ్యంలో బల్క్ డౌన్‌లోడ్ అంశాన్ని మీ- భూమిలో ప్రారంభిస్తే మళ్లీ డేటా దుర్వినియోగం అవుతుందనే కారణంతో నిరోధించామని.. బల్క్ డౌన్‌లోడ్ వల్ల డేటా దుర్వినియోగం, ప్రయోజనానికి మించిన ప్రమాదం ఉన్నట్టు జయలక్ష్మి తన వివరణలో పేర్కొన్నారు.

అంతా డొల్ల సమాధానమే

మీ-భూమిలో గ్రామ అడంగల్‌ను ప్రజలకు అందుబాటులో లేకుండా బ్లాక్ చేయడానికి డేటా దోపిడీనే కారణమని సీసీఎల్ఏ చెప్పడం విచిత్రంగా ఉంది. జగన్ ప్రభుత్వంలో విలువైన ప్రభుత్వ, అసైన్‌మెంట్, షరతుగల, ఇనాం, గ్రామకంఠం భూములను నచ్చిన వారికి కట్టబెట్టే కుట్రతో మీ-భూమిలో గ్రామ అడంగల్‌ను కొంతకాలం పాటు నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ లోపాన్ని గుర్తించి వెంటనే సరిచేశారు. గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలను కనిపెట్టేందుకు గ్రామ అడంగల్ ఉపయోగపడింది. కానీ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి మళ్లీ బ్లాక్‌చేశారు. ఒకవైపు రాష్ట్రం క్లౌడ్ కంప్యూటింగ్‌లో దూసుకుపోతోంది. సైబర్ సెక్యూరిటీలో రాణిస్తోంది. కీలకమైన రెవెన్యూ సేవలను వాట్సప్ ద్వారా ప్రజలకు అందిస్తోంది. అలాంటిది కొన్ని యాప్‌లు బల్క్ డౌన్‌లోడ్‌లు చేశాయని, అందుకే మీ-భూమి నుంచి అడంగల్‌ను నిరోధించామని చెప్పడం వింతగా ఉందని రెవెన్యూ, టెక్ నిపుణులు చెబుతున్నారు. ఉద్దేశపూర్వకంగా చేసిన పని బయటపడటంతో దానికి సాంకేతిక సమస్యలను అంటగట్టి ఇందులో శాఖాపరమైన తప్పులేదని చెబుతున్నట్లుగానే ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సైబర్ దాడి కారణంగా ప్రజల డేటాను ఆపేశామంటే, ఇక మీ- భూమి వెబ్‌సైట్ నిర్వహణ ఎందుకు? ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఇష్టమైన పారదర్శకత, పౌరసేవలు, సురక్షిత డిజిటల్ డేటాకు కట్టుబడి ఉన్నామని చెబుతూనే డేటా దోపిడీ జరిగిపోతోందని, దాన్ని అడ్డుకోలేక అనేక ఆప్షన్‌లను నిలిపివేశామని చెప్పడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

షెడ్యూల్ ప్రకారమే 'స్థానికం'!

(మొదటి పేజీ తరువాయి)

ఆచరణలో మాత్రం కష్టసాధ్యమే. ఎందుకంటే రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. తెలంగాణ, మహారాష్ట్రల్లో బీసీ రిజర్వేషన్ల పెంపును ఇటీవల కొట్టివేసింది కూడా. ఓబీసీ రిజర్వేషన్ల ఖరారుకు 'ట్రిపుల్ టెస్ట్' ఫార్ములా అనుసరించాలని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. దీనిప్రకారం.. ఓబీసీ కులాల వెనుకబాటుతనంపై లోతైన అధ్యయనానికి రాష్ట్రప్రభుత్వం డెడికేటెడ్ కమిషన్‌ను నియమించాలి. కమిషన్ సిఫారసులకు అనుగుణంగా రిజర్వేషన్ల శాతాన్ని సర్కారు ఖరారుచేయాలి. ఇదే సమయంలో ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీల మొత్తం రిజర్వేషన్ 50 శాతానికి మించకుండా చూడాలి. ఈ నేపథ్యంలో వచ్చే నెలలో నియమించే డెడికేషన్ కమిషన్ ఛైర్మన్, సభ్యులు రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి అభిప్రాయ సేకరణ జరిపి.. ఓబీసీల వెనుకబాటుతనంపై అధ్యయనం చేసి.. రిజర్వేషన్లపై నివేదిక సమర్పిస్తే.. ప్రభుత్వం దానిని ఆమోదించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఏపీలో స్థానిక సంస్థల్లో బీసీలకు 24 శాతం కోటా అమలవుతోంది. మరో పది శాతం పెంచితే మొత్తం రిజర్వేషన్లు 60 శాతానికి చేరుకుంటాయి. సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించినట్లవుతుంది. పొరుగున ఉన్న తెలంగాణలో డెడికేటెడ్ కమిషన్ ద్వారా కులగణన చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించి స్థానిక ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. మహారాష్ట్ర ప్రభుత్వానికీ ఇదే ఎదురైంది. కోటా 50 శాతానికి మించితే నామినేషన్ల ప్రక్రియను రద్దుచేస్తానని కోర్టు హెచ్చరించింది కూడా. అంటే మన రాష్ట్రం కూడా బీసీలకు పాత రిజర్వేషన్‌తోనే ఎన్నికలకు వెళ్లాల్సి ఉంటుంది.

ఎంపీటీసీ, జడ్పీటీసీలకు సెప్టెంబరు వరకు..: రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం వచ్చే ఏడాది సెప్టెంబరు 23, 24 తేదీలతో ముగుస్తుంది. బీసీ కులగణన చేపట్టాలంటే ఎంతలేదన్నా మూడు నెలల సమయం పడుతుంది. జనవరిలో ఏర్పాటయ్యే డెడికేషన్ కమిషన్ ఆరు నెలల్లో అధ్యయనం పూర్తిచేసి నివేదిక అందించినా.. ఆ వెంటనే ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేస్తే.. సెప్టెంబరు-అక్టోబరుల్లో పరిషత్ ఎన్నికలు నిర్వహించడానికి వీలుంటుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. పంచాయతీల పాలకవర్గాలకు వచ్చే మార్చి నెలాఖరు వరకు గడువుంది. వీటికీ రిజర్వేషన్లు అమలు చేయాల్సి ఉంటుంది. ఒకవేళ పాత రిజర్వేషన్లతో ఇప్పటికిప్పుడు పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభించినా.. మార్చిలోపు నిర్వహించడం కష్టం. ఎందుకంటే ఫిబ్రవరి 23 నుంచి మార్చి 24 వరకు ఇంటర్ పరీక్షలు జరుగనున్నాయి. పదో తరగతి పరీక్షలు మార్చి 16న ప్రారంభమై 31వ తేదీ వరకు జరుగుతాయి. పరీక్షలు జరుగుతుండగా.. గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించడం కుదరదు.

పార్టీపరంగా బీసీ రిజర్వేషన్లు..!

కూటమి నేతలు స్థానిక ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు 34 శాతానికి పెంచుతామని పదే పదే చెబుతున్నారు. అందుకు వీలుకాని పరిస్థితుల్లో పార్టీపరంగా కోటా అమలు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. తద్వారా బీసీలను సంతృప్తిపరచవచ్చని అనుకుంటున్నారు. పాత రిజర్వేషన్లు అమలుచేసినా సుప్రీంకోర్టు నిర్దేశిత 'ట్రిపుల్ టెస్ట్'ను పాటించాల్సిందే. గత వైసీపీ ప్రభుత్వం బీసీలకు 24 శాతం కోటాతోనే ఎన్నికలకు వెళ్లింది. అయితే అప్పట్లో ట్రిపుల్ టెస్ట్ నిబంధనలపై ఎవరూ కోర్టుకెళ్లకపోవడంతో ఎన్నికలు అడ్డంకులు లేకుండా జరిగాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం బీసీలకు ఎంత కోటా అమలు చేసినా.. ట్రిపుల్ టెస్ట్ నిబంధనలు పాటించాల్సిందే. అలా కాకుండా ముందుకెళ్తే ఎవరైనా కోర్టు కెళ్తే మళ్లీ బ్రేక్ పడే అవకాశముందని అంటున్నారు.

కొత్త కమిషనర్ రావాలి!


ఇంకోవైపు.. ప్రస్తుత రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) నీలం సాహ్ని పదవీకాలం వచ్చే ఏడాది మార్చితో ముగియనుంది. ఆమె స్థానంలో నియమితులయ్యే కొత్త కమిషనర్ స్థానిక ఎన్నికల కసరత్తు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది.


కార్యకర్తల గుండె ధైర్యం జనసేన:ఎమ్మెల్సీ నాగబాబు

అమరావతి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ప్రతి కార్యకర్తకూ గుండె ధైర్యంలా నిలబడిందని పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కె.నాగబాబు అన్నారు. వేర్వేరు ప్రమాదాల్లో మరణించిన 220 మంది కార్యకర్తల కుటుంబాలకు ఆదివారం తాడేపల్లిలో ఆయన బీమా చెక్కులు పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.11 కోట్లు ఇచ్చారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ... జనసేన పార్టీ జెండాను భుజాలపై మోసిన ప్రతి కార్యకర్తకూ అండగా ఉండాలనే ఉద్దేశంతో జనసేనాని పవన్ కల్యాణ్ ప్రవేశపెట్టిన ప్రమాద బీమా.. 1,400 మంది కుటుంబాలకు అండగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో 'హిడ్మా' ట్రెండింగ్

అమరావతి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మారేడుమిల్లి అడవుల్లో ఏపీ పోలీసుల చేతిలో హతమైన సీపీఐ(మావోయిస్టు) కేంద్ర కమిటీ సభ్యుడు మాడ్వి హిడ్మా ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారారు. ఎన్‌కౌంటర్ తర్వాత విడుదలైన ఫొటోలిప్పుడు సోషల్‌మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. గడచిన ఐదు రోజులుగా ఎక్స్, ఫేస్‌బుక్, య్యూటూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లలో హిడ్మా ట్రెండింగ్‌లో నిలిచారు. ఇక వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల్లో హిడ్మా అమరుడంటూ, ఆయన ఆదివాసీల కోసం చేసిన త్యాగాలను కీర్తిస్తూ పోస్టులు పెడుతున్నారు.





అబ్బురపరచిన డ్రోన్ షో

పుట్టపర్తి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శత జయంతి వేడుకల్లో భాగంగా శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన డ్రోన్ షో అబ్బురపరచింది. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ఆధ్వర్యంలో హిల్ వ్యూ స్టేడియంలో డ్రోన్ షో నిర్వహించారు. సత్యసాయి ప్రతిబింబాలతో ప్రదర్శించిన ఈ షో భక్తులను అమితంగా ఆకట్టుకుంది.





పుట్టపర్తి హిల్‌వ్యూ స్టేడియంలో సత్యసాయి స్వర్ణ రథం ఊరేగింపు

సర్వం.. సాయి స్మరణ

సత్యసాయి నామంతో పులకించిన పుట్టపర్తి

(మొదటి పేజీ తరువాయి)

లక్షలాది మంది భక్తులు, ప్రముఖులు తరలివచ్చారు. వేడుకలలో చివరి రోజు, సత్యసాయి జయంతి అయిన ఆదివారం పుట్టపర్తిలోని హిల్ వ్యూ స్టేడియం ఉదయం ఏడు గంటలకే భక్తజనంతో నిండిపోయింది. నిర్మల, నిస్వార్థ సేవ, ప్రేమను పంచిన సత్యసాయికి జయము జయము అని భక్తులు స్మరించుకున్నారు. భక్తుల భజనలు, కళాకారుల నృత్యాలు అలరించాయి. విద్యార్థుల వేదపఠనంతో స్టేడియం మారుమోగింది. సత్యసాయి విద్యార్థులు బ్యాండ్‌మేళం, మంగళవాయిద్యాలు, భజనలు, భక్తిపాటలతో ర్యాలీగా సత్యసాయి స్వర్ణ రథంతో స్టేడియానికి చేరుకున్నారు. వాయిద్యకారుడు శివమణి, గాయకుడు మనో తమ ప్రదర్శనలతో అలరించారు. శాంతి వేదిక వద్దకు చేరుకున్న స్వర్ణ రథానికి సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ మంగళహారతి ఇచ్చారు. అనంతరం వేదికపై సత్యసాయి శత జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. జాతీయ గీతం ఆలాపన, విద్యార్థుల వేదపారాయణంతో కార్యక్రమం ప్రారంభమైంది. ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, మేఘాలయా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సౌమన్ సేన్, ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గుహనాథన్ నరేందర్, మంత్రులు నారా లోకేశ్, సవిత, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ ఛైర్మన్ చక్రవర్తి, వైస్ ఛైర్మన్, అఖిల భారత సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు నిమీష్ పాండే తదితరులు వేదికపై ఆశీనులయ్యారు.



ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు సత్యసాయి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ట్రస్టీ రత్నాకర్, చిత్రంలో సీఎం చంద్రబాబు, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, మంత్రి లోకేశ్

వేడుకలు దిగ్విజయం

సత్యసాయి శత జయంతి వేడుకలను ప్రశాంతి నిలయంలోని సభామండపంలో ఘనంగా నిర్వహించారు. సాయి కుల్వంత్ మందిరంలోని సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. విద్యార్థుల వేదపఠనం, భక్తి నివేదనం పేరిట భక్తి గీతాల ఆలాపన చేశారు. భక్తులు పెద్దఎత్తున సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. శతజయంతి ఉత్సవాలకు వచ్చిన లక్షలాది మంది భక్తులతో పుట్టపర్తి వీధులు కిటకిటలాడాయి. సాయి నామస్మరణతో పురవీధులు మార్మోగాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సెంట్రల్ ట్రస్టు సభ్యులు, సేవాదళ్, అధికార, పోలీసు యంత్రాంగం అన్ని చర్యలు తీసుకున్నాయి. బాబా శతజయంతి ఉత్సవాలు దిగ్విజయంగా ముగిశాయి. ఉత్సవాలకు వచ్చిన భక్తులకు పలువురు అన్నదానం చేశారు.

ఉప రాష్ట్రపతికి సన్మానం

శత జయంతి వేడుకలలో రెండు రోజులపాటు పాల్గొన్న ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌ను ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ ఘనంగా సత్కరించారు. ప్రశాంతి నిలయంలో బస చేసిన ఆయన.. వేడుకల అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. ఉప రాష్ట్రపతికి సత్యసాయి చిత్రపటాన్ని ఆర్‌జే రత్నాకర్ అందజేసి, ధన్యవాదాలు తెలిపారు.

భక్తులే మూలస్తంభాలు: రత్నాకర్

భగవాన్ సత్యసాయి బాబా ప్రారంభించిన సత్యసాయి మిషన్‌కు భక్తులే మూలస్తంభాలు అని సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ అన్నారు. వేడుకలకు హాజరైన ఉపరాష్ట్రపతి, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సహా వీవీఐపీలకు ధన్యవాదాలు తెలిపారు. మారుమూల గ్రామం పుట్టపర్తిలో 1940లో సత్యసాయి తన అవతార ప్రకటన చేశారని అన్నారు. ఆనాటి నుంచి ప్రేమ, శాంతి, ఆధ్యాత్మికత, సేవలను రాష్ట్రం, దేశం దాటి విశ్వవ్యాప్తం చేశారని అన్నారు. మాతృమూర్తి ఈశ్వరమ్మకు ఇచ్చిన మాట మేరకు సత్యసాయి ప్రశాంతి నిలయం వేదికగానే తన ప్రేమతత్వాన్ని ప్రపంచానికి చాటారని అన్నారు. నేడు ప్రశాంతి నిలయం విశ్వశాంతి వేదికగా విస్తరించిందన్నారు.

సాయి భోజనం సాధారణం

సత్యసాయి సాధారణ భోజనాన్ని తీసుకునేవారని, రాగిముద్దనే తినేవారని రత్నాకర్ గుర్తుచేసుకున్నారు. 'నా చదువు పూర్తి అయిన తరువాత ఏమి చేయాలని అడిగాను. నిన్ను నువ్వు గౌరవించుకోలేని పని చేయవద్దు అని సత్యసాయి సూచించారు. ఆ తరువాత ట్రస్టు సభ్యుడిగా నువ్వు ఒక వ్యక్తివి మాత్రమే, నీ విధి నీవు నిర్వర్తించు అని సూచించారు. ట్రస్టు సమష్టి అని, అంతా సాఫీగా సాగుతుందని చెప్పేవారు. సత్యసాయికి కనీసం బ్యాంకు ఖాతా కూడా లేదు. అయితే సాయితత్వం విశ్వవ్యాప్తం అయింది' అని అన్నారు.






పుట్టపర్తి హిల్‌వ్యూ స్టేడియంలో సాంస్కృతిక ప్రదర్శనలు, హాజరైన భక్తులు

నిస్వార్థ సేవలకు ప్రతిరూపం!

- సత్యసాయి బోధనలతో కోట్ల మంది ప్రభావితం: ఉపరాష్ట్రపతి
- బాబా వారసత్వాన్ని మాటల్లో కాకుండా సేవల్లో చూపాలి
- శత జయంతి వేడుకల్లో సీపీ రాధాకృష్ణన్ పిలుపు



అనంతపురం/పుట్టపర్తి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): శాంతి, ప్రేమ, నిస్వార్థ సేవలకు సత్యసాయిబాబా ప్రతిరూపమని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. ఆయన బోధనలు.. 'అందరినీ ప్రేమించు- అందరినీ సేవించు', 'ఎల్లప్పుడూ సాయపడు-ఎన్నిటికీ బాధించకు' వంటివి విశ్వవ్యాప్తంగా కోట్లాది మందిని ప్రభావితం చేస్తున్నాయని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని హిల్‌వ్యూ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన సత్యసాయి శతజయంత్యుత్సవాల్లో ఆయన ప్రసంగించారు. తొలుత భారత మాతకు, సత్యసాయికి ప్రణమిల్లారు. వేదికపై ఆంధ్ర, తెలంగాణ ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి, త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి, మంత్రి లోకేశ్, పలు రాష్ట్రాల హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులతో కలిసి పాల్గొనడం తనకు లభించిన గౌరవంగా భావిస్తున్నానని ఉపరాష్ట్రపతి చెప్పారు. 1964-65 మధ్య తన కుటుంబానికి సత్యసాయి ఆశీస్సులు అందాయని.. తమిళం మాత్రమే తెలిసిన తన అత్తయ్య ఒంటరిగా పుట్టపర్తికి వచ్చి, 15 రోజులు ఇక్కడ ఉండి సాయిబాబా ఆశీస్సుల అందుకోవడం బాబా దైవిక శక్తికి నిదర్శనమని తెలిపారు. 'ఈ ఆధ్యాత్మిక, పవిత్ర క్షేత్రాన్ని సందర్శించే అవకాశం దక్కినందుకు కృతజ్ఞతలు. ఇతరుల కోసం జీవించడమే నిజమైన ఆధ్యాత్మికత. ఓ తమిళ కవి తన పద్యాల్లోనూ ఇదే చెప్పారు' అని వెల్లడించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు దేశవ్యాప్తంగా అందిస్తున్న మహత్తర సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఉచిత విద్య అందిస్తున్న సత్యసాయి విశ్వవిద్యాలయం, గ్రామీణ ఆరోగ్య సేవలు, ఉచిత గుండె శస్త్ర చికిత్సలు, తాగునీటి ప్రాజెక్టులు, విపత్తుల్లో సాయం తదితర కార్యక్రమాలు లక్షలాది మందికి జీవనాధారం అవుతున్నాయని కొనియాడారు. తెలుగుగంగ ప్రాజెక్టు పునరుద్ధరణ, చెన్నైకి నిరంతరం తాగునీటి సరఫరాకు సత్యసాయి చేసిన సేవలు అనిర్వచనీయమన్నారు. సంఘర్షణలు, ఒత్తిళ్లతో నిండిన నేటి ప్రపంచానికి ఆయన బోధించిన ప్రేమ, ఐక్యత, సేవ వంటి విలువలు మరింత అవసరమని తెలిపారు. సత్యసాయి మహా సమాధి అయిన తర్వాత కూడా భక్తులు ఇక్కడకు వచ్చి సేవల్లో కొనసాగడం అభినందనీయమన్నారు. 'సేవ మానవత్వాన్ని కలుపుతుంది. ప్రేమ ద్వేషాన్ని జయిస్తుంది. కుటుంబాల్లో, సమాజంలో, దేశంలో శాంతిని పెంపొందించడం మనందరి బాధ్యత' అని ఆయన అన్నారు. భగవాన్ వారసత్వాన్ని మాటల్లో కాకుండా సేవల్లో కొనసాగించాలని ఉపరాష్ట్రపతి పిలుపిచ్చారు.

సమానత్వమే సాయితత్వం: మంత్రి లోకేశ్

ప్రేమ, అహింస, సత్యం, ధర్మం, శాంతి ప్రతి మనిషి జీవిత పరమార్థమని సత్యసాయి బోధించారు. ప్రేమ తత్వమే మానవత్వం.. సమానత్వమే సాయితత్వమని చాటిచెప్పిన బాబా పుట్టిన ఈ రాష్ట్రంలో నేను పుట్టడం పూర్వజన్మ సుకృతం. భగవాన్ శతజయంత్యుత్సవాల్లో పాల్గొనడం నా అదృష్టం. విద్య, వైద్య, ప్రజా అవసరాలు తీరుస్తూ సేవా భావమే దైవత్వమని ఆయన నిరూపించారు. భగవాన్ చూపిన మార్గంలో పయనిస్తూ, ప్రజాసేవకు అంకితమైన కోట్లాది మంది భక్తులు ఆయనకు ప్రతిరూపాలు. బాబా శతజయంతి సందర్భంగా వారందరికీ నా శుభాకాంక్షలు.

అవ్వా.. మన ప్రభుత్వ పాలన బాగుందా?

- పింఛన్ డబ్బు సకాలంలో అందుతుందా?
- ఓ వృద్ధురాలికి మంత్రి లోకేశ్ ఆప్యాయ పలకరింపు



కొత్తచెరువు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సత్యసాయి శతజయంతి ఉత్సవాలకు పుట్టపర్తికి విచ్చేసిన మంత్రి లోకేశ్.. తన శిబిరం వద్దకు వచ్చిన వారితో ముచ్చటించి, వారి సమస్యలు తెలుసుకున్నారు. పుట్టపర్తి సమీపంలోని మామిళ్లకుంట క్రాస్ వద్ద గల పారిశ్రామిక వాడలో మంత్రికి విడిది కేంద్రం ఏర్పాటు చేశారు. ఆదివారం లోకేశ్‌ను కలిసి, సమస్యలను విన్నవించుకునేందుకు ప్రజలు బారులుతీరారు. మంత్రి అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలు విన్నారు. తనను కలిసిన ఓ వృద్ధు రాలితో ఆప్యాయంగా మాట్లాడారు. 'అవ్వా.. ఆరోగ్యం బాగుందా.. మన ప్రభుత్వ పాలన ఏ విధంగా ఉంది.. నీకు పించన్ డబ్బు సకాలంలో ఇస్తున్నారా?' అని ఆరా తీశారు. వైసీపీ హయాంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి, ఇబ్బందులు పెట్టారని పలువురు తమ సమస్యలను లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు.



కరచాలనం చేస్తున్న సీఎంలు చంద్రబాబు, రేవంత్

ప్రజల్లో దేవుడిని చూసిన మహానుభావుడు

భగవాన్ సత్యసాయి ప్రజల్లోనే దేవుడిని చూశారు. ప్రేమతో వారిని గెలుచుకున్నారు. ప్రేమ ద్వారానే ఏదైనా సాధ్యమవుతుందనేది ఆయన సందేశం. ఈ సందేశం యుగయుగాలపాటు ప్రజలకు స్ఫూర్తిగా నిలుస్తుంది. ఈ వేడుకల్లో పాల్గొనే అవకాశం లభించడం నాకు దక్కిన గొప్ప గౌరవం. తన సేవలతో ప్రజలలో సత్యసాయి దేవుడయ్యారు. ప్రభుత్వాలు అందించలేని చోటా బాబా ట్రస్టు చేపట్టిన సేవలు లక్షలాది మందికి జీవనాడి అయ్యాయి. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించడం ద్వారా ట్రస్టు లక్షలాది మంది జీవితాలకు వెలుగునిచ్చింది. ప్రభుత్వాలకు సరితూగే స్థాయిలో, కొన్ని సందర్భాల్లో అంతకుమించి సేవలు అందిస్తోంది.

\- రేవంత్‌రెడ్డి, తెలంగాణ ముఖ్యమంత్రి

సత్యసాయి సేవలు అపూర్వం

మానవ విలువల వికాసానికి సత్యసాయి అందించిన సేవలు అపూర్వం. మానవత్వం, దైవత్వం మధ్య ఉన్న దూరాన్ని తగ్గించేందుకు సత్యసాయి ట్రస్టును ఏర్పాటు చేయడం బాబా తీసుకున్న దైవ నిర్ణయం. సమానత్వం, సేవ, ఆధ్యాత్మికత ట్రస్టు మూలధ్యేయాలు. పుట్టపర్తిలో స్థానికుల కోసం చిన్నపాటి జనరల్ ఆస్పత్రిగా ప్రారంభమైన వైద్యసేవలు ప్రపంచ స్థాయికి చేరాయి. ఉచిత కార్డియాక్, సూపర్ స్పెషాలిటీ వైద్య సంస్థలుగా ఎదగడం బాబా దివ్యకార్యానికి నిదర్శనం. సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ లెర్నింగ్, సాయి పాఠశాలల్లో అందిస్తున్న విలువలతో కూడిన విద్య, విద్యార్థుల తెలివితేటలతోపాటు వ్యక్తిత్వాన్ని నిర్మించడంలో గొప్ప పాత్ర పోషిస్తున్నాయి.

\- ఎస్.ఇంద్రసేనారెడ్డి, త్రిపుర గవర్నర్

సాయి మార్గాన నడుద్దాం!



మానవ రూపంలో మనం చూసిన దైవం సత్యసాయి

- విశ్వ శాంతిని, సకల జనుల సంక్షేమాన్ని కోరుకున్నారు
- జ్ఞానబోధతో భక్తులకు సన్మార్గం చూపారు
- పుట్టపర్తిని ఆధ్యాత్మికతకు, దైవత్వానికి నిలయంగా మార్చారు
- 75 ఏళ్ల ప్రశాంతి నిలయం ఓ ఎనర్జీ సెంటర్
- సెంట్రల్ ట్రస్టు ద్వారా దేశవిదేశాల్లో సేవలు: సీఎం చంద్రబాబు

భగవాన్ సత్యసాయి 1926 నవంబరు 23న ఒక లక్ష్యం కోసం ఈ పుణ్యభూమిలో అవతరించిన మహోన్నత వ్యక్తి అని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ పవిత్ర నేలపై 86 ఏళ్లపాటు తన జీవన ప్రయాణాన్ని సాగించిన బాబా, తన బోధనలను ప్రపంచానికి అందించారన్నారు. భక్తులకు జ్ఞానాన్ని బోధించి, సన్మార్గం చూపారని కొనియాడారు. సత్యసాయి శత జయంత్యుత్సవాల్లో ఆయన ప్రసంగించారు. మానవ రూపంలో మనం చూసిన దైవమే బాబా అని కొనియాడారు. 'సమాజ సేవ, సమస్యకు పరిష్కారం, ఆధ్యాత్మిక భావన, ప్రశాంత జీవనం, ముక్తి మార్గంతో కోట్ల మంది జీవితాలను బాబా ప్రభావితం చేశారు. ఎనిమిదేళ్ల వయసు నుంచే దైవచింతన కలిగి భిన్నంగా వ్యవహరించారు. 1940 మే 23న సత్యసాయి వయసు 14 ఏళ్లు. అప్పుడే ఆయన సత్యనారాయణరాజు నుంచి సత్యసాయిగా సాక్షాత్కరించారు. అవతరించడానికి ఈ పుణ్యభూమిని ఎంచుకున్నారు. చిత్రావతి నది ఒడ్డున పుట్టపర్తిని ఆధ్యాత్మికతకు, దైవత్వానికి నిలయంగా మార్చారు. లవ్ ఆల్-సర్వ్ ఆల్, హెల్ప్ ఎవర్-హర్ట్ నెవర్ అని బోధించారు. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస సిద్ధాంతాలతో నూతనాధ్యాయం ప్రారంభించారు. విశ్వశాంతి, విశ్వ సౌభాగ్యం, సకల జనుల సంక్షేమాన్ని ఆయన కోరుకున్నారు. భగవాన్ మనోదర్శనం ద్వారా దేశ, విదేశాల నుంచి సంపన్నులు, ప్రముఖులు వచ్చి ఆయన సేవా మార్గాన్ని అనుసరించారు. ఎవరూ పిలవకున్నా.. వారంతటవారే వచ్చి ఆయన సిద్ధాంతాన్ని పాటించారు. డబ్బు, పదవి, పేరు ఉన్నా.. ఎక్కడా లేని ప్రశాంతత పుట్టపర్తిలో పొందారు. బాబా లేకపోయినా ఆయన నింపిన స్ఫూర్తి ఉంది. శతజయంతితోపాటు ఈ రోజుకు మరో విశిష్టత ఉంది. ప్రశాంతి నిలయాన్ని నిర్మించి 75 ఏళ్లయింది. ఇది ఆధ్యాత్మిక సంబరాలకు వేదికైంది. భక్తుల బాధలు, కష్టాలకు పరిష్కారం చూపే నిలయంగా మారింది. ప్రశాంతి నిలయం ఒక ఎనర్జీ సెంటర్' అని అన్నారు.




కాంతారా నృత్యం చేస్తున్న కళాకారుడు

సత్యసాయి సంస్థలతో సేవలకు రూపం

మానవ సేవే.. మాధవ సేవగా భావించే బాబా.. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ద్వారా సేవలను మరింత విస్తరించారని చంద్రబాబు చెప్పారు. విద్య నుంచి వైద్యం వరకు, తాగునీటి నుంచి మానసిక సంతృప్తి వరకూ అందరికీ అన్నీ దక్కేలా చేశారని.. 1960లో ఆయన స్థాపించిన సత్యసాయి సంస్థలతో సేవలకు రూపం వచ్చిందని తెలిపారు. 'ట్రస్టు ద్వారా దేశ, విదేశాల్లో అనేక సేవలు అందుతున్నాయి. 140 దేశాల్లోని 2 వేల కేంద్రాలకు ఇది విస్తరించిందంటే బాబా సేవలు ఏ పాటివో అర్థం చేసుకోవచ్చు. ఈ రోజుకు కూడా 7.50 లక్షల మంది సేవాదళ్ సభ్యులు ఉన్నందుకు గర్వపడుతున్నాను. 102 సత్యసాయి పాఠశాలల్లో 60 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. రూ.550 కోట్లతో ఏపీ, తెలంగాణ, తమిళనాడుల్లోని 1,600 గ్రామాల్లో 30 లక్షల మందికిపైగా ప్రజలకు తాగునీటిని అందిస్తున్నారు. చెన్నై తాగునీటి పథకం ఆధునీకరణకు సత్యసాయి రూ.250 కోట్లు ఖర్చు పెట్టారు. ఆయన సేవలను చాటేందుకు రాష్ట్రప్రభుత్వం అధికారికంగా శతజయంత్యుత్సవాలు నిర్వహిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అభినందిస్తున్నాను' అని తెలిపారు. సత్యసాయి సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు బాబా ఇక్కడకు రప్పించారని, వేడుకలకు హాజరైన ప్రతి ఒక్కరినీ అభినందిస్తున్నానన్నారు. మనది వసుధైక కుటుంబం.. ఇది భారతీయులకు మూలం.. సత్యసాయి బోధనల ద్వారా దీనిని నిలబెట్టుకుందామని భక్తులకు పిలుపిచ్చారు.

వికసిత భారత్ నిర్మాణంలో.. సివిల్ సర్వెంట్ల పాత్ర కీలకం



నాసిన్‌లో ట్రైనీ అధికారులు, శిక్షకులతో ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, మంత్రి లోకేశ్

- జీఎస్టీ సంస్కరణలు ఒక మైలురాయి: ఉపరాష్ట్రపతి
- 'నాసిన్'లో ట్రైనీ అధికారులనుద్దేశించి ప్రసంగం
- మంత్రులు లోకేశ్, సవిత హాజరు

హిందూపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్-2047 నిర్మాణంలో అఖిల భారత సర్వీసు అధికారులైన సివిల్ సర్వెంట్ల పాత్ర కీలకమని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం పాలసముద్రం సమీపంలో ఉన్న నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ నార్కోటిక్స్ (నాసిన్)ను ఆయన ఆదివారం సందర్శించారు. సివిల్ సర్వీసెస్ ట్రైనీ అధికారులను ఉద్దేశించి ప్రసంగించారు. 2024లో ప్రధాని మోదీ నాసిన్ ప్రాంగణాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. భారత కస్టమ్స్, జీఎస్టీ, పరిపాలనా సామర్థ్య నిర్మాణానికి కేంద్రంగా ఇది అవతరించిందన్నారు. అఖిల భారత సర్వీసుల పితామహుడు సర్దార్ పటేల్ 150వ జయంతిని ఈ ఏడాది జరుపుకొంటున్నామని.. సంస్థానాల సమూహంగా ఉన్న దేశాన్ని బలమైన, వికసిత్, ఆత్మనిర్భర్ భారతంగా మార్చడానికి ఆయన దార్శనిక నాయకత్వం పునాది వేసిందని తెలిపారు. జీఎస్టీ సంస్కరణలు అమలు చేయడం మైలురాయిగా పేర్కొన్నారు. ఆయన వెంట మంత్రులు లోకేశ్, సవిత, నాసిన్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376, RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.